RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 24-01-2026 శనివారం | సంపుటి : 12 | సంచిక : 331 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on



## చిన్న వ్యాపారులకు చేయూత ఇవ్వండి

**బ్యాంకర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు**

**వుదయం, అమరావతి:** రుణాల రీషెడ్యూల్‌తో రూ.1,108 కోట్ల మేర ఆదా చేయగలిగామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఎంఎస్‌ఎంఈలు, వివిధ కీలక రంగాలు అభివృద్ధి జరిగేలా బ్యాంకర్ల సహకారం అందించాలని కోరారు. వ్యాపారాల్లో బల హీనవర్గాలకు చేయూతనిచ్చే ఎంఎస్‌ఎంఈలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అమరావతిలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. ''ఎంఎస్‌ఎంఈలకు ప్రభుత్వం, బ్యాంకర్లే వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరముంది. వాటి పోత్సాహంతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. వైకాపా పాలనలో వ్యవస్థలు గాడి తప్పి ప్రభుత్వానికి క్రెడిబులిటీ పోయింది. పెద్ద ఎత్తున వడ్డీలకు అప్పులు తెచ్చారు. క్రెడిబులిటీ ఉంటే తక్కువ వడ్డీలకు రుణాల తీసుకురావొచ్చు. రాష్ట్రంలో 2 లక్షల కోట్ల మేర రుణాలను రీషెడ్యూల్ చేసుకునే అవకాశం ఉందని అంచనా వేశాం. ఇప్పటి వరకు రూ.49వేలకోట్లు రీషెడ్యూల్ చేశాం. ప్రకృతి సేద్యం మరింత విస్తరించేందుకు బ్యాంకర్ల నుంచి ప్రోత్సాహం అందాలి. ఇకపై బ్యాంకర్ల సమావేశానికి జిల్లా కలెక్టర్లను కూడా ఆహ్వానించాలి'' అని చంద్రబాబు సూచించారు.

### చంద్రబాబు ట్వీట్..

'ఆజాద్ హింద్ ఫౌజ్' ఏర్పాటు చేసి భరత మాత దాస్య శృంఖలాలను తెంచేందుకు నిర్విరామ కృషి చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని చంద్రబాబు కొనియాడారు. 129వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. ఆయన పోరాట పటిమ దేశ పౌరుషానికి ప్రతీకగా ఈనాటికీ చెప్పుకుంటున్నామంటే అది ఆయన ప్రత్యేకత. భారత జాతి కోసం ప్రాణాలకు తెగించి పోరాడతానని ప్రతిజ్ఞ చేసి కార్యాచరణలో చూపిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనకు ప్రాతఃస్మరణీయుడు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

### నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు చంద్రబాబు, లోకేశ్ నివాళులు

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 29వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబా బు నాయుడు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ నివాళులు అర్పించారు. నేతాజీ పోరాట పటిమ దేశ పౌరుషానికి ప్రతీకగా నేటికీ చెప్పుకుంటున్నామని, స్వాతంత్ర్యం కోసం అవిశ్రాంతంగా పోరాడిన యో ధుడు నేతాజీ అంటూ ఎక్స్‌లో సీఎం, మంత్రి పోస్టు చేశారు.

## లడ్డూ కేసులో చార్జ్‌షీట్



**చార్జ్‌షీట్‌లో 24 మంది నిందితులు** | **మరో 12 మంది హస్తం**

**వుదయం, అమరావతి:** తిరుమల తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారన్న కేసులో చార్జ్ షీటును నెల్లూరి ఎసిబి న్యాయస్థానంలో దాఖలు చేశారు. షీట్ విచారణ పూర్తి అయ్యింది. 15 నెలలపాటు 12 రాష్ట్రాల్లో సిట్ విచారణ సాగింది. బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్ కీలక సూత్రధారులుగా గుర్తించారు. ఏపీతోపాటు 12 రాష్ట్రాలకు చెందిన సంస్థలు, వ్యక్తుల హస్తం ఉన్నట్లు సిట్ వెల్లడించింది. ఛార్జిషీట్‌లో 24 మందిని నిందితులుగా సిట్ పేర్కొంది. మరో 12 మంది హస్తం ఉన్నట్లు కోర్టుకు అధికారులు తెలిపారు. తొలుత కల్తీ నెయ్యి కేసు విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను నియమించగా.. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటైంది.

కేసు మూలాలు తొలుత తమిళనాడులో ఉన్నట్లు దర్యాప్తు బృందాలు భావించాయి. విచారణలో సీబీఐలోని డీఎస్పీలు, సీఐలతోపాటు రాష్ట్రానికి చెందిన 30 మంది అధికారులు పాల్గొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ నుంచి జేడీ వీరేశ్ ప్రభు, విశాఖపట్నం డీఐజీ మురళీ రాంబా, రాష్ట్రం నుంచి గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి డాక్టర్ సత్యేన్‌కుమార్ పాండా సభ్యులుగా ఉన్నారు. తిరుపతి అదనపు ఎస్పీ వెంకట్రావును సీబీఐ డైరెక్టర్.. విచారణాధికారిగా నియమించడంతో దర్యాప్తులో ఆయన కీలకంగా వ్యవహరించారు. కేంద్ర దర్యాప్తు సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రశ్నావళి రూపొందించడం, నిందితులను విచారించారు.

## 'సిట్ అన్‌ఫిట్ విచారణ'

- ఆశించిన రీతిలో విచారణ సాగడం లేదు
- సిట్ అధికారులకు ప్రభుత్వం స్వేచ్ఛ ఇవ్వడం లేదు
- ప్రభుత్వ పెద్దల ఒత్తిడి ఉంది
- సిరిసిల్ల వేదికగా ఫోన్ టాపింగ్‌కు తెరలేపారు
- తన ఫోన్ టాపింగ్ జరిగిందని కెసిఆర్ కూతురు స్వయంగా చెప్పారు
- పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో టాపింగ్ మాటున వేల కోట్ల లావాదేవీలు
- కేంద్రమంత్రి బండి సంజయ్



### కాంగ్రెస్ హయాంలోనే ఫోన్ టాపింగ్

టి బిజెపి చీఫ్ రాంచందర్‌రావు



2



### కక్ష సాధింపు లేదు

టి పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్ అధికారుల విచారణ పక్కదారి పడుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఈ కేసు విషయంలో సిట్ విచారణ ఆశించిన స్థాయిలో జరగడం లేదని విమర్శించారు. విచారణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సిట్ అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలు చెప్పిన విధంగానే సిట్ అధికారులు వ్యవహరించాలని ఒత్తిడి పెరుగుతోందని కీలక వ్యాఖ్యలు చేశారు. సిట్‌లోని అధికారులు చాలా నిజాయితీపరులు,, అనుభవజ్ఞులన్నారు. వారిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. కానీ కేసు విచారణలో వారికి ఎంత స్వేచ్ఛ నిచ్చారనే దానిపై అనుమానాలు వస్తున్నాయని అన్నారు. శుక్రవారం జూబ్లీ హిల్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. అసలు ఈ కేసులో హరీశ్ రావు, కేటీఆర్‌లు అందరి ఫోన్లను ట్యాపింగ్ చేశారని విచారణకు పిలిచారా..? లేక వారి

### సిట్ పటలు

ఫోన్లు ట్యాప్ అయ్యాయని విచారిస్తున్నారా.. ? అనే విషయాన్ని సిట్ అధికారులు స్పష్టం చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిరిసిల్ల వేదికగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని ఫోన్ ట్యాపింగ్ దందాకు తెరలేపారని ఆరోపించారు. కేసీఆర్ కూతురు కవితే.. తన ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిందన్నారు. ట్యాపింగ్‌కి భయపడి ఓ ఏడాది హరీష్ రావు, కవిత దంపతులు కూడా ఫోన్లు వాడలేదని గుర్తు చేశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ మాటున రూ.వేల కోట్ల లావాదేవీలు జరిగాయని బండి సంజయ్ ఆరోపించారు. ఇందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రముఖ బిజినెస్‌మెన్లు, రాజకీయ నాయకులు, సినిమా సెలబ్రిటీలు, జడ్జీలు బాధితులు అని జగమెరిగిన సత్యం అన్నారు. కేసీఆర్ కుటుంబమే ఫోన్లు ట్యాప్ చేయించిందని తెలిసినా.. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును అరెస్ట్ చేసేందుకు ప్రభుత్వం ఎందుకు ధైర్యం చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సిట్ విచారణను ఎలా నమ్మమంటారు? ఇప్పటివరకు ఏం సాధించారో చెప్పాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలను డైవర్ట్ చేసేందుకు ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం ఆయుధంగా వాడుకుంటోందని బండి సంజయ్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో బిచ్చగాళ్లు కూడా.. వాట్సాప్ కాల్ మాట్లాడాల్సిన పరిస్థితి ఉండేదని చెప్పారు. ఈ కేసులో తనకు కూడా సిట్ నోటీసులు ఇచ్చి వాంగ్మూలం తీసుకుందని బండి సంజయ్ అన్నారు.

## మేడారం జాతరకు కేంద్రం రూ.370 కోట్లు

**వుదయం, హైదరాబాద్ బ్యూరో:** మేడారం జాతర నిర్వహణ, ఏర్పాట్ల కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 370 కోట్లు విడుదల చేసింది. గిరిజన కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతర ఏర్పాట్ల కోసం కేంద్ర పర్యాటక, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలు కలిసి శుక్రవారం రూ. 3.70 కోట్లు విడుదల చేశాయి. మరోవైపు కేవలం జాతర నిధులతోనే ఆగకుండా, ఆ ప్రాంతాన్ని ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే గతంలో 'గిరిజన సర్క్యూట్'పథకం కింద మేడారం పరిసర ప్రాంతాలైన ములుగు, లక్నవరం, తాడ్వాయి, దామరవాయి, మల్లూరు, బొగత జలపాతం అభివృద్ధికి రూ. 80 కోట్లు వెచ్చించిన కేంద్రం.. పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచింది. మరోవైపు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచీ జాతరకు తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని జాతర జరిగే నాలుగు రోజుల పాటు 30 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.



## సినిమా టిక్కెట్టు ధరల పెంపు గణాంకాలు ఇవ్వండి

**శంకర వరప్రసాద్ సినిమా కేసులో హైకోర్టు ఆదేశాలు**



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ సినిమాకు సంబంధించి ఈ నెల 11 నుంచి 18 వరకు పెంచిన టిక్కెట్టు ధరల వాస్తవ గణాంకాలను సమర్పించాలని జీఎస్టీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. సింగిల్ స్క్రీన్‌లకు రూ. 50, మల్టీప్లెక్స్‌లకు రూ. వంద, జీఎస్టీతో కలిపి వివరాలన్నీ నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించింది. ఈ సినిమాకు టికెట్ ధరలు పెంపు అక్రమం అని ఆరోపిస్తున్న హైదరాబాద్ కు చెందిన డాక్టర్ పాదూరి శ్రీనివాస రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఈ సినిమా అక్రమ సంపాదించిన రూ.45 కోట్లను రికవరీ చేయాలని శ్రీనివాస రెడ్డి తన పిటీషన్ లో కోర్టుకు నివేదించారు. చట్ట విరుద్ధంగా ఈ సినిమా టికెట్ ధరలు పెంచారనీ ఈ సినిమా ఆర్జించిన రూ. 42 కోట్లను ప్రతివాదులు చేసి సంయుక్తంగా, వ్యక్తిగతంగా రాష్ట్ర ప్రభుత్వ సంచిత నిధికి లేదా హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటీషనర్ కోరారు. స్పందించిన కోర్టు... ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. అలాగే గతంలో దాఖలైన పుష్ప–2, గేమ్ ఛేంజర్, అఖండ–2, రాజా సాబ్ వంటి సినిమాల టికెట్ ధరల పిటిషన్లతో కలిపి తదుపరి వాయిదా విచారిస్తామని పేర్కొంది.

రెవెన్యూ వ్యవస్థ గురించి రెవెన్యూ మంత్రికి ఏమైనా తెలుసా? 2

## 7 గంటల విచారణ

**మాజీ డిసిపి రాధాకిషన్ రావును, కెటిఆర్‌ను ఒకేచోట కూర్చోబెట్టి పలు ప్రశ్నలు వేసిన సిట్**

- ఫోన్ ట్యాపింగ్‌లో మీ ప్రమేయమెంతా
- మీకు తెలిసే జరిగిందా..?
- పార్టీ విరాళాలు, ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాల్లో ఎవరి ప్రమేయం ఉంది
- మాజీ మంత్రి కేటీఆర్‌పై సిట్ ప్రశ్నల వర్షం,
- ఏడు గంటల పాటు అనేక అంశాలపై ప్రశ్నలు
- సిట్ అధికారులనే ప్రశ్నించిన కెటీఆర్
- నా వ్యక్తిత్వ హననం జరుగుతుంది
- ప్రస్తుత మంత్రుల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని వ్యాఖ్య



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ విచారణ ముగిసింది. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో సిట్ అధికారులు ఆయన్ను సుమారు ఏడు గంటల పాటు విచారించారు. ఈ సందర్భంగా అధికారులు కేటీఆర్ నుంచి కీలక స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. ఈ కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్ రావును, కేటీఆర్‌ను అధికారులు ఒకేచోట కూర్చోబెట్టి విచారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 2023 ఎన్నికలకు ముందు భారీ స్థాయిలో ఫోన్ల ట్యాపింగ్ ఎందుకు జరిగింది? అప్పటి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌పై మీకు సమాచారం ఉందా? పార్టీ విరాళాలు, ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారాల్లో పోలీసు అధికారుల ప్రమేయం ఉందా? వంటి అంశాలపై సిట్ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. రాధాకిషన్ రావుకు కేటీఆర్ పంపిన చేసిన నంబర్లపై ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. గతంలో ఉప ఎన్నికల సమయంలో జరిగిన ఫోన్ల ట్యాపింగ్ పైనా ప్రశ్నించినట్లు సమాచారం. కొంతమంది వ్యాపారవేత్తలు, రాజకీయ నేతల ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇప్పటికే ఈ కేసులో మాజీ మంత్రి హరీష్ రావును ఏడు గంటల పాటు విచారించిన సిట్, ఇప్పుడు కేటీఆర్‌ను అంతే సమయం విచారించడం విశేషం. మరోవైపు విచారణ ముగిసిన వెంటనే కేటీఆర్ సిట్ ఆఫీస్ నుంచి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు.

అక్కడ మీడియతో మాట్లాడారు. మరోవైపు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలపై గతేడాది ఫోన్ ట్యాపింగ్ కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు రాష్ట్రాభివృద్ధి కోసం పని చేశామని, ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలను వేధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ లేదనీ , అంతా డొల్ల అని వ్యాఖ్యానించారు. విచారణకు పదిసార్లు పిలిచినా హాజరవుతాననీ ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతానన్నారు. చట్టంపై తమకు పూర్తి నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సిట్ విచారణకు హాజరయ్యే ముందు, తర్వాత తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. విచారణ పేరుతో రేవంత్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి స్వయంగా తన సొంత మంత్రుల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు.




మిగతా 2లో

## కాంగ్రెస్ హయంలోనే ఫోన్ ట్యాపింగ్

**టీబీజేపీ చీఫ్ రామచందర్ రావు**



**వుదయం, హైదరాబాద్ బ్యూరో:**

ప్రస్తుత అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయిస్తోందనే అనుమానం ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపైనా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంటున్నారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసు లో విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఈ కేసులో దోషులను శిక్షించే చిత్తశుద్ధి సర్కారుకు లేదని విమర్శించారు. నిజంగా ఆ చిత్తశుద్ధి ఉంటే ఈ కేసుతో సంబంధం ఉన్న రాజకీయ నాయకులను కూడా అరెస్ట్ చేసి ఉండేవారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఫోన్లు ట్యాపింగ్ చేయించిన నాయకులను విచ్చలవిడిగా తిరుగుతున్నారని ఆరోపించారు.

# 7 గంటల విచారణ

**మొదటి పేజీ తరువాయి**

**నాకే సంబంధం లేదు : కేటీఆర్**

ఫోన్ ట్యాపింగ్ కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు రాష్ట్రాభివృద్ధి కోసం పని చేశామని, ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలను వేధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ లేదని, అంతా డొల్ల అని వ్యాఖ్యానించారు. విచారణకు పదిసార్లు పిలిచినా హాజరవుతానని ప్రతి ప్రశ్నకు సమాధానం చెబుతానన్నారు. చట్టంపై తమకు పూర్తి నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సిట్ విచారణకు హాజరయ్యే ముందు, తర్వాత తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. విచారణ పేరుతో రేవంత్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి స్వయంగా తన సొంత మంత్రుల ఫోన్లను ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. ఒకప్పుడు రూ.50 లక్షలతో 'నోటుకు ఓటు' కేసులో అడ్డంగా దొరికిన దొంగ నేడు సీఎం కావడమే రాష్ట్ర దౌర్భాగ్యమని విమర్శించారు. సింగరేణి బొగ్గు టెండర్లలో జరుగుతున్న అవినీతి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ఫోన్ ట్యాపింగ్ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను నయవంచన చేసిన సీఎంను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని, ఆ పార్టీని బొంద పెట్టే వరకు విశ్రమించబోమని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గలేదన్న ఆయన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ పేరుతో రేవంత్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో పాలన పడకేసిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ధ్వజమెత్తారు. రెండేళ్లుగా ప్రభుత్వం వ్యక్తిత్వ హననానికి పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు.



తాను డ్రగ్స్ తీసుకుంటానని ఆరోపణలు చేశారని, హీరోయిన్స్‌తో నాకు లింకులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా జరుగుతున్న వ్యక్తిత్వ హననానికి బాధ్యులెవరని ప్రశ్నించారు. [illegible] రాజకీయ నేతలంతా దొంగలు అనుకునేలా చేస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. సింగరేణిలో కుంభకోణాన్ని హరీశ్ రావు బయట పెట్టగానే ఆయనకు నోటీసులు ఇచ్చారని అన్నారు. విచారణలో భాగంగా హరీశ్ సంధించిన ప్రశ్నలకు సిట్ సమాధానం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ 'మనసుమమత' సీరియల్‌లా మారిందని సెటైర్లు వేశారు. పుట్టిన మట్టి సాక్షిగా.. అంతరాత్మ సాక్షిగా తాను ఎప్పుడూ అక్రమ, అనైతిక పనులకు పాల్పడలేదని అన్నారు. ప్రభుత్వంలోని దోపిడీని బయటపెడితే మమ్మల్ని వేధిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. పుట్టిన భూమి సాక్షిగా నేను ఎప్పుడూ అక్రమ, అనైతిక పనులు చేయలేదు.. నేను డ్రగ్స్ తీసుకుంటానని, హీరోయిన్లతో సంబంధాలు ఉన్నాయని వ్యక్తిత్వహననం చేశారు.. ఫోన్ ట్యాపింగ్ పేరుతో డైలీ సీరియల్‌లా లీకులు ఇచ్చి మా వ్యక్తిత్వహననం చేస్తున్నారు.

## రెవెన్యూ వ్యవస్థ గురించి రెవెన్యూ మంత్రికి ఏమైనా తెలుసా?

**మాజీ మంత్రి పేర్ని నాని**



**వుదయం, విజయవాడ :**

ఏపి మంత్రి అనగాని సత్యప్రసాద్ సంస్కారం మరిచి మాట్లాడుతున్నారని వైసిపి మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి పై అవాకులు, చవాకులు పేల్చుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో ఆయన విలేకరుల తో మాట్లాడుతూ.. అనగాని ఏపి మంత్రి కావడం మన ఖర్మ అని విమర్శించారు. పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకున్నారని, ఆ పాస్ పుస్తకాల్లో క్యూఆర్ కోడ్ ఓపెన్ కావడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్వే చేసి ఒక్క పాస్ పుస్తకం అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. జగన్ హయాంలో ఇచ్చిన పాస్ పుస్తకాలు తీసుకుని కొత్త పాస్ పుస్తకాలు ఇస్తున్నారని పేర్నినాని మండిపడ్డారు. రూ. 25 కోట్లు ఇస్తే పార్టీ మారతానని అనగాని సత్యప్రసాద్ అన్నారని, రూ.25 కోట్లు ఇవ్వడానికి ఆనాడు వైఎస్ జగన్ అంగీకరించలేదని తెలియజేశారు. రెవెన్యూ వ్యవస్థ గురించి రెవెన్యూ మంత్రికి ఏమైనా తెలుసా? అని ప్రశ్నించారు. తక్కెళ్ల పాడులో కూటమి ప్రభుత్వం మొదలు పెట్టిన సర్వే ఎందుకు కొనసాగించడం లేదు? అని.. రెండేళ్లలో ఎవరి సమస్య తీర్చారు? అని నిలదీశారు. వైఎస్ జగన్ చేపట్టిన భూసర్వేను మీరెందుకు ఫాలో అవుతున్నారు? అని జగన్ నిర్ణయాలు వాడుకుంటూ.. ఆయనపైనే విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ 6 వేల గ్రామాల్లో సమగ్ర భూసర్వే పూర్తి చేశారని, 6వేల గ్రామాల్లో సర్వే కోసం వాడిన ఎక్విప్‌మెంట్ నే ఏపి సిఎం చంద్రబాబు నాయుడు వాడుతున్నారని పేర్ని నాని దుయ్యబట్టారు.

# ఎమ్మెల్యే X ఎక్సైజ్



**మొదటి పేజీ తరువాయి**

సంస్థాన్ నారాయణపూర్‌లో రాజగోపాల్ రెడ్డి అనుచరులు మూసివేసిన వైన్ షాపులను అధికారులు దగ్గరుండి తెరిపించారు. ఎక్సైజ్ శాఖ అధికారుల పహారాలో ఉదయం నుండి మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి.కాగా, మా సార్ చెప్పిన టైంకే వైన్ షాపులు తెరవాలి. లేదంటే షాపులు మొత్తానికి మూసేస్తాం అని మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపుల ముందు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరులు వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో వైన్ షాపులు మధ్యాహ్నం 1 గంటకు.. పర్మిట్ రూమ్ సాయంత్రం 6 గంటలకు తెరవాలని రాజగోపాల్ రెడ్డి హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో సంస్థాన్ నారాయణపూర్‌లో తెరిచి ఉన్న వైన్ షాపు నిర్వాహకులపై దాడికి తెగబడి, షాపును ఎమ్మెల్యే కోమటిరెడ్డి అనుచరులు మూసివేయించారు. దీంతో వైన్ షాపు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన అధికారులు ఉదయం నుంచే మందు బాబుల కోసం దగ్గరుండి షాపులు తెరిపించి ఎమ్మెల్యేకు షాక్ ఇచ్చారు. ఇప్పుడు మునుగోడులో ఇదే హాట్ టాఫిక్‌గా మారింది.

# 'సిట్' పటలు

**మొదటి పేజీ తరువాయి**

అనుభవజ్ఞులన్నారు. వారిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. కానీ కేసు విచారణలో వారికి ఎంత స్వేచ్ఛ నిచ్చారనే దానిపై అనుమానాలు వస్తున్నాయని అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేక పోతున్నారని వ్యాఖ్యానించారు. అసలు ఈ కేసులో హరీశ్ రావు, కేటీఆర్‌లు అందరి ఫోన్లను ట్యాపింగ్ చేశారని విచారణకు పిలిచారా..? లేక వారి ఫోన్లు ట్యాప్ అయ్యాయని విచారిస్తున్నారా..? అనే విషయాన్ని సిట్ అధికారులు స్పష్టం చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిరిసిల్ల వేదికగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని ఫోన్ ట్యాపింగ్ దందాకు తెరలేపారని ఆరోపించారు. కేసీఆర్ కూతురు కవితే.. తన ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిందన్నారు.

ట్యాపింగ్‌కి భయపడి ఓ ఏడాది హరీష్ రావు, కవిత దంపతులు కూడా ఫోన్లు వాడలేదని గుర్తు చేశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ మాటున రూ.వేల కోట్ల లావాదేవీలు జరిగాయని బండి సంజయ్ ఆరోపించారు. ఇందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రముఖ బిజినెస్‌మెన్లు, రాజకీయ నాయకులు, సినిమా సెలబ్రిటీలు, జడ్జీలు బాధితులు అని జగమెరిగిన సత్యం అన్నారు. కేసీఆర్ కుటుంబమే ఫోన్లు ట్యాప్ చేయించిందని తెలిసినా.. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును అరెస్ట్ చేసేందుకు ప్రభుత్వం ఎందుకు ధైర్యం చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సిట్ విచారణను ఎలా నమ్మమంటారు? ఇప్పటివరకు ఏం సాధించారో చెప్పాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలను డైవర్ట్ చేసేందుకు ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం ఆయుధంగా వాడుకుంటోందని బండి సంజయ్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో బిచ్చగాళ్లు కూడా.. వాట్సాప్ కాల్ మాట్లాడాల్సిన పరిస్థితి ఉండేదని చెప్పారు. ఈ కేసులో తనకు కూడా సిట్ నోటీసులు ఇచ్చి వాంగ్మూలం తీసుకుందని బండి సంజయ్ అన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తూనే ఉన్నారని మండిపడ్డారు.

## సిట్ విచారణలో ప్రభుత్వం జోక్యం ఉండదు

**మొదటి పేజీ తరువాయి**

ఇంతటి అక్రమాలకు పాల్పడి కూడా, ఇప్పుడు కేటీఆర్ తానేదో ఘనకార్యం చేసినట్లుగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా, పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు వచ్చినా బీఆర్ఎస్ నాయకులకు ఇంకా బుద్ధి రావడం లేదని చురకలంటించారు. అసెంబ్లీలో చర్చకు తోకముడిచిన బీఆర్ఎస్ నాయకులు, బయట మాత్రం పోరాట యోధులుగా ఫోజులు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైన ఆ పాత్ర పోషించాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత దుర్మార్గపు చర్య అన్నారు. కేవలం అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కల్వకుంట్ల కుటుంబం ఎంతటి నీచానికైనా పాల్పడుతుందనడానికి ఈ ఉదంతం ఉదాహరణ అన్నారు. హరీష్‌రావు ఆరడుగులు పెరిగాడు కానీ, ఆయన తెలివితేటలు మాత్రం మోకాలిలో ఉన్నట్లున్నాయని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం స్వయంగా హరీష్ రావు ఫోన్‌తో పాటు ఆయన వ్యక్తిగత సహాయకుల ఫోన్లను కూడా ట్యాప్ చేసిందని ఆరోపించారు. ఆ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారంతోనే హరీష్ రావుకు గతంలో మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టారన్నారు.

# భవిష్యత్తు విద్యుత్ వాహనాలదే

**పటాన్చెరు , జనవరి23 (వుదయం):**



పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు అంశాలలో విద్యుత్ వాహనాలు గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాయని.. భవిష్యత్తు అంతా విద్యుత్ వాహనాలదేనని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫిల్లింగ్ స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన జిఎంఆర్ థండర్ ఈవి చార్జింగ్ స్టేషన్ ను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో ఇటీవల విద్యుత్ వాహనాల వినియోగం పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వాహనదారుల సౌకర్యార్థం చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వ్యక్తిగత, ప్యాసింజర్ వాహనాల కొనుగోలులో విద్యుత్ వాహనాలకే వినియోగదారులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం విద్యుత్ వాహనాల కొనుగోలు అంశంలో పెద్ద ఎత్తున రాయితీలు అందిస్తుందని తెలిపారు. స్వయం ఉపాధి కోసం నేటి తరం యువత చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు విషయంలో ఆసక్తి కనబరచాలని విజ్ఞప్తి చేశారు. ఈవీల వినియోగం వలన పర్యావరణంతో పాటు భారత ఆర్థిక వ్యవస్థకు ఎంతగానో మేలు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో థండర్ ప్లస్ సంస్థ సీఈఓ రాజు, జనరల్ మేనేజర్ సతీష్, రాకేష్, భద్రాల భాస్కర్ రెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

# ఉత్తీర్ణత శాతం మెరుగుపరచాలి

**మహబూబ్ నగర్, జనవరి 23(వుదయం) :**



ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో బాగా చదివి ఉత్తీర్ణతా శాతం మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి విద్యార్థినిలకు సూచించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పి.టి.ఎం)లో ముఖ్య అతిథిగా పాల్గొంటూ, విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన దని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షలకు నెల సమయం ఉందని,విద్యార్థిని లు టెన్షన్ లేకుండా ఆత్మ విశ్వాసం తో ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అన్నారు.9,10వ తరగతి వార్షిక పరీక్షల్లో 90 శాతం,నూరు శాతం ఫలితాలు వస్తే ఇంటర్మీడియట్ వచ్చే వరకు ఉత్తీర్ణత శాతం తగ్గుతుందని అన్నారు.ప్రభుత్వ కళాశాలలు "ది బెస్ట్ అని "మంచి విద్యార్హతలు,అనుభవం కల ఉపాధ్యాయులు ఉన్నారని,మంచిగా చదివి పరీక్షలు రాయండి అని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలు,గురుకులాల్లో చదువు కొని ఎంతో మంది ఐ. ఏ.ఎస్.,ఐ.పి.ఎస్.అధికారులుగా పని చేస్తున్నారని తెలిపారు. విద్యార్థినిలు భవిష్యత్ లో ఉన్నత ఉద్యోగాలు,వ్యాపారం,పరిశ్రమలు స్థాపించి పారిశ్రామిక వేత్తలుగా తమ లక్ష్యం నెరవేర్చుకొనేలా కృషి చేయాలని అన్నారు.తమ లక్ష్యం కు పేదరికం,ఆర్థిక పరిస్థితి అడ్డు కాకూడదని అన్నారు.సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి, కళాశాల ప్రధానోపాధ్యాయురాలు కౌసర్ జహాన్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తల్లి తండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# యూరో కిడ్డీ పాఠశాలలో అక్షరాభ్యాసం

**సంగారెడ్డి జిల్లా,పటాన్చెరు:**



వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్చెరు పట్టణంలోని యూరో కిడ్డీ పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ మహేష్ గారు, సంజన గారు మరియు పురోహితుల సమక్షంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించి శుభారంభం పలికించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య ప్రారంభ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సరస్వతి దేవిని స్మరిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, పట్టణ పుర ప్రముఖులు అధిక సంఖ్యలో హాజరై పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో రైతుల దినోత్సవాన్ని కూడా నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు పండ్లు, కూరగాయలు తీసుకువచ్చి వాటిని విక్రయించే విధంగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీని ద్వారా పిల్లల్లో వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీ మహేష్ గారు మాట్లాడుతూ, "పిల్లలు పండ్లు, కూరగాయలు విక్రయించే ఈ కార్యక్రమం ద్వారా రైతు చేసే కష్టం, సహనం, వ్యవసాయ విలువ పిల్లలకు తెలియజేయడం జరుగుతుంది. దేశానికి అన్నం పెట్టే రైతుని గుర్తించి గౌరవించాలి" అని అన్నారు.

## బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు



**నారాయణపేట టౌన్, జనవరి 23(వుదయం)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బైక్ ర్యాలీలో సింగర్ బేస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలేమోని కృష్ణ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎల్లమ్మ గుడి ముందునుండి కాంగ్రెస్ పార్టీ తరపు నుంచి చేపట్టిన ఈ బైక్ ర్యాలీ పట్టణంలోని పురవీధుల గుండా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భక్తవత్సలం, మైనార్టీ కాంగ్రెస్ లీడర్ హస్లోద్దీన్ మైనార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోటీ ప్రపంచంలో రాణించాలంటే భాషా ప్రావీణ్యం అవసరం

**కొల్లూరు, జనవరి 23 (వుదయం):**





పోటీ ప్రపంచంలో రాణించాలంటే భాషా ప్రావీణ్యం, స్కిల్ డెవలప్మెంట్, సృజనాత్మకత అవసరమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.

సంగారెడ్డి జిల్లా కొల్లూరు గ్రామంలోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహించిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన-2026 ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల వైజ్ఞానిక ఆవిష్కరణల స్టాల్లను పరిశీలించి, వాటి ఉపయోగాలు, సాంకేతిక అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి ఆలోచనా విధానం, సృజనాత్మకతను ప్రశంసించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో మన పిల్లలు రాణించాలంటే భాషా ప్రావీణ్యం, స్కిల్ డెవలప్‌మెంట్, సృజనాత్మకత తప్పనిసరిగా అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రాథమిక విద్య నుంచి ప్రతి నియోజక వర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తూ విద్యా రంగాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌తో కూడిన క్వాలిటీ ఎడ్యుకేషన్, అలాగే మెరుగైన వైద్య సేవలను సామాన్యులకు ఉచితంగా అందించడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలోనే 90 శాతం వైద్య చికిత్సలు అందేలా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, సూపర్ స్పెషాలిటీ సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజా వైద్యాన్ని పటిష్టం చేస్తున్నామని తెలిపారు.

నర్సింగ్ వృత్తిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తోందని, నర్సింగ్ విద్యార్థులు విదేశాల్లో సేవలందించేందుకు జపనీస్, జర్మన్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తున్నామని మంత్రి వివరించారు.విద్యార్థులు సృజనాత్మకత, స్కిల్, క్వాలిటీ, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు.

ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, ఐక్యూ స్థాయిని పెంచుతాయని అన్నారు. ఈ ప్రదర్శనలో అద్భుతమైన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు మంత్రి నగదు బహుమతులు, షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులను మంత్రి అభినందించారు.

కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజి రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ నికోలస్, ఎస్సిఆర్టి డైరెక్టర్ రమేష్, అదనపు కలెక్టర్ పాండు, గాడియం స్కూల్ సీఈఓ రామకృష్ణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కక్ష సాధింపులేదు

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమర్ గౌడ్**



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

ల గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజ్యాంగం ప్రకారం విచారణ జరుగుతోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమర్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కేసు విషయంలో రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవన్నారు. శుక్రవారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ కేసు విషయంలో సిట్ అధికారులు, ప్రభుత్వం వ్యక్తిగత హననం చేస్తున్నారని కేటీఆర్ చేస్తోన్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆత్మ పరిశీలన చేసుకోవాలని కేటీఆర్ కు హితవు పలికారు. ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమే అని చెప్పారు. కేటీఆర్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. తోడ బుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటి వరకూ సమాధానం చెప్పలేదు. ఫోన్ ట్యాపింగ్ కేసును ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదన్నారు. అధికారులకు పరిమితులు ఉంటాయన్నారు. కానీ గత పాలనలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డారని చెప్పారు. దేశ భద్రతకు విఘాతం కలిగించే శక్తులపై మాత్రమే ట్యాపింగ్ చేస్తారని చెప్పారు. నక్సలైట్లతో లావాదేవీలు జరుపుతున్నారని తనపై నిఘా పెట్టి ట్యాపింగ్ చేశారని పార్టీ చీఫ్ ఆరోపించారు. అసలు రాజకీయాలకు సినీ తారలకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. అసలు సినీతారల ఫోన్ ట్యాప్ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కల్వకుంట్ల కవితను తాను ఎప్పుడూ చెల్లెలుగా గౌరవిస్తానని చెప్పారు. వాటాల పంపకంలో తేడాతోనే కేసీఆర్ కుటుంబంలో తగాదాలకు మూలం అని ఆరోపించారు. కవిత ఇప్పటికైనా నిజాలు మాట్లాడుతున్నాందుకు స్వాగతిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయంలో కేవలం మూడు నెలల్లో 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గడిచిన పదేండ్లలో కేసీఆర్ కుటుంబం అలీ బాబా 420 దొంగల మాదిరిగా రాష్ట్రాన్ని దోచుకుందని ఆరోపించారు. బీఆర్ ఎస్ ను స్టువర్ట్ పురం దొంగల బ్యాచ్ గా అభివర్ణించారు. కార్తీకదీపం గురించి తర్వాత.. ముందు మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దీపం ఆగిపోకుండా చూసుకోవాలని హితవు పలికారు. కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్‌ను ప్రశ్నించారు. బీజేపీ నేతల ఈడీ కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఇబ్బందిపడతారు

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణలో కక్ష పూరిత రాజకీయాలు నడుస్తున్నాయని ఇందులో అధికారులు పావులుగా మారుతున్నారని హరీష్‌రావు ఆరోపించారు. ఎవర్నీ వదిలి పెట్టబోమన్నారు. శ్రుతిమించి ప్రవర్తిస్తున్న అధికారులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే వచ్చే కాలంలో కేసుల్లో ఇరుక్కుంటారని హెచ్చరించారు. రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నాం తర్వాత ఎవరూ ఏం చేయలేరనే ధీమా వద్దని కూడా చెప్పారు. రిటైర్మెంట్ తర్వాత సప్త సముద్రాల అవతల దాక్కున్నా లాక్కొచ్చి చట్టం ముందు నిలబెడతామని సీరియస్ అయ్యారు. కేటీఆర్‌తో సిట్ కార్యాలయం వరకు వచ్చిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. పోలీసు అధికారులు, ప్రభుత్వాధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని, చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు సూచించారు. వాటిని మీరితే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఇప్పుడు ప్రభుత్వం అండగా ఉండవచ్చేమో కానీ రేపటి రోజున కచ్చితంగా ఇంతకింతా అనుభవిస్తారని అన్నారు. అప్పుడు సొంత డబ్బులు పెట్టి కేసులు వాదించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. తమపై చాలా కాలం నుంచి దుష్ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో పోలీసులు చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పుడు జరుగుతున్నదంతా కేవలం రాజకీయ కక్ష సాధింపేనని హరీష్ అభిప్రాయపడ్డారు. వివిధ స్కామ్‌లలో ఇరుక్కున్న ప్రభుత్వ పెద్దలు వాటి నుంచి ప్రజల దృష్టిని డైవర్ట్ చేయడానికే విచారణ పేరుతో వేధిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని విధాలుగా వేధించినా తమ పోరాటం మాత్రం ఆపేది లేదని ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూనే ఉంటామని అన్నారు.

**రాష్ట్రంలో మరోస్కాం**

సింగరేణి బొగ్గు కుంభకోణంతో పాటు రాష్ట్రంలో 127 మెగావాట్ల సోలార్ స్కామ్ కూడా జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సోలార్ ప్లాంట్స్‌కి కూడా సైట్ విజిట్ నిబంధన పెట్టారన్న ఆయన.. రూ. రెండొందల కోట్ల నుంచి రూ.250 కోట్లు వచ్చేలా టెండర్లు కట్టబెట్టారు. సోలార్ ప్లాంట్ కోసం దేశమంతా రూ.3 కోట్ల టెండర్ అయితే.. మన రాష్ట్రంలో మాత్రం రూ.5.04 కోట్ల టెండర్ ఇచ్చిందని మండిపడ్డారు.



**జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత**

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విచారణ నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణులు భారీగా పీఎస్ వద్దకు చేరుకున్నారు. వారిని అదుపుచేయలేక పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేటీఆర్ విచారణ మొదలైన తర్వాత బీఆర్ఎస్ మహిళా నేతలు స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు వాగ్వాదం జరిగింది. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నిరసనకారులు ఆందోళన చేశారు.

## ఘనంగా అక్షరాభ్యాస మహోత్సవం



**కడప, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** సి ఎస్ ఎస్ ఆర్ & ఎస్ ఆర్ ఆర్ ఎమ్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో వసంత పంచమి పర్వ దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం స్వామి స్థైర్యానంద సరస్వతీ పీఠాధిపతి చేతులమీదుగా ఘనంగా చైతన్య పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ డా. లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ చైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య గారు, ప్రొద్దుటూరు నుండి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి విచ్చేశారు. మొదటగా చిన్నారులకు అక్షరాభ్యాస మహోత్సవం జరిగించారు. తర్వాత ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ లక్ష్మయ్య గారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి విద్యార్థులను ఐఏఎస్ స్థాయికి సివిల్స్ ప్రిపరేషన్ చేయించే విధంగా ప్రోత్స హించడం, ఆ దిశగా ఒక క్రమశిక్షణతో ప్రతి ఒక్క విద్యార్థిని ఉన్నత స్థానాలకు వెళ్లే విధంగా ప్రేరేపించడం జరుగుతుందన్నారు. చైతన్య పబ్లిక్ స్కూల్ ద్వారా నిర్వాహకులు ఆదర్శవంతమైనటువంటి అంశాలతో చిన్నారులకు మానసిక, శారీరక వికాసం లక్ష్యంగా కరికులం తయారు చేసి వారి బంగారు భవిష్యత్తు తీర్చి దిద్దుటకు ఒక గమ్యంగా చైతన్య పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గీతా ప్రియా, కళాశాల చైర్మన్ సి.వి.రాజగోపాల రెడ్డి పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో బాణాసంచా నిషేధించాలి

### ఆర్సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్




**కడప, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** బహిరంగ ప్రదేశాలలో బాణాసంచాలు కాల్చడం వల్ల చుట్టూ ఉన్నవారికి ప్రమాదాలు తప్పవని, జన సంచారం ఉన్న బహిరంగ ప్రదేశాలలో బాణాసంచా కాల్చడాన్ని పూర్తిగా నిషేధించాలని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. శుక్రవారం ఆర్ సి పి కార్యాలయం నందు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ . గురువారం రోజున శోభయాత్రలో తారాజువ్వ ఓ కాపలాదారుడి కడుపులో చొచ్చుకపోయిందని, ఆ ప్రాంతమంతా శబ్దాలతో దద్దరిల్లి పోయిందని, నిర్వాహకులు ప్రజలను అప్రమత్తం చేయలేకపోయారని, బహిరంగ ప్రదేశాలలో బాణాసంచాను కాల్చేవారు! ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రజలు ఎవరు అటుగా రాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీపావళి రోజుల్లో కూడా రోడ్డు పైనే బాణాసంచాలు కాల్చి పడేస్తు ఉంటారని, అవి ఎంతో మందిని గాయల పాయాల పాలు చేస్తుందని, బహిరంగ ప్రదేశాలలో తిరుణాల, ర్యాలీలు, మొదలైన వాటిల్లో బాణాసంచాను పూర్తిగా నిషేదించాలని, ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, రవి, మునిరెడ్డి పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి..

### పోలీస్ కమిషనర్ ఎస్.వి రాజశేఖర బాబు



**విజయవాడ జనవరి 23 ఉదయం న్యూస్ బ్యూరో:–** ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ప్రజలు గమనించగలరు..కుటుంబ సభ్యులు ఎవ్వరైనా తప్పిపోయినా ఇంటి నుండి వెళ్లిపోయినా వెంటనే మీ సమీపంలోని పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయవలెను. ఎన్.టి.ఆర్.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో 10,500 కెమెరాలను అమర్చడం జరిగింది. మిస్సింగ్ అయిన గంట గోల్డెన్ అవర్, వ్యవధిలో ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే నగరంలో ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా వారి కదలికలను గుర్తించడం జరుగుతుంది. ఆలస్యంగా ఫిర్యాదు చేస్తే వారి కదలికలను గుర్తించడం ఆలస్యమవుతుంది. నగరంలో ఫేస్ రికగ్ నైజేషన్ ఎఫ్ ఆర్ ఎస్, నెంబర్ ప్లేట్ రికజైషన్ ఏన్పీఆర్ కెమెరాలను అమర్చడం జరిగింది. మిస్సింగ్ అయిన వ్యక్తుల యొక్క ఫోటో, వాహన నెంబర్లను ఆధారంగా చేసుకుని గుర్తించడం జరుగుతుందన్నారు.

## 25న 'భారత రాజ్యాంగం-సవాళ్ళు' పై జాతీయ సదస్సు

- జెవీవీ–ఐలూ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ–ఎంబీకేలో..
- ముఖ్య అతిథిగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి



**ప్రొద్దుటూరు, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ,ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) సంయుక్తంగా ఈనెల జనవరి 25వ తేదీన విజయవాడలోని ఎం బి విజ్ఞాన కేంద్రం నందు 'భారత రాజ్యాంగం– సవాళ్లు'అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్ తెలిపారు. తొలుత ఈ జాతీయ సదస్సు పోస్టర్ ను ఆవిష్కరించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరగనున్న ఈ సదస్సులో 'భారత రాజ్యాంగం–లౌకికవాదం' పై ప్రొఫెసర్ కె. నాగేశ్వర్,'భారత రాజ్యాంగం–ప్రజాస్వామ్య హక్కులు' పై సుంకర రాజేంద్రప్రసాద్(ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు), 'భారత రాజ్యాంగం –ఫెడరలిజం' పై ప్రొఫెసర్ చక్కా బెనర్జీ (డీన్,విఐపి స్కూల్ ఆఫ్ లా), శాస్త్రీయ దృక్పథం–రాజ్యాంగం పై మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఉపన్యసించనున్నారని తెలిపారు. జెవివి పట్టణ కార్యదర్శి నంగా రాజేష్ మాట్లాడుతూ ఈ సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేయబడతాయనీ, మరిన్ని వివరాలకు 8309965083, 9705333305 సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో జెవివి నాయకులు మురళీ గుప్త, దేవమణి, మధుసూదన్ రెడ్డి, ఉషారాణి, రవిబాబు, పద్మ పాల్గొన్నారు.

## ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు



**కావలి, జనవరి 23, వుదయం న్యూస్:** కావలి రూరల్ మండలంలోని సర్వాయి పాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భారత స్వాతంత్ర సమరయోధుడు 'ఆజాధ్ హింద్ ఫౌజ్' వ్యవస్థాపకుడు నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి (పరాక్రమ దివాస్) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట వెంకటేశ్వర్లు ముందుగా నేతాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు చిన్ననాటి నుండి దేశభక్తి అలవర్చుకోవాలని, కష్టపడి చదివి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్ చంద్రబోస్ పోరాటం మరువలేనిది



**అవనిగడ్డ జనవరి23 (వుదయం ప్రతినిధి):** స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ పోరాటం మరువలేనిదని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం అవనిగడ్డ వంతెన సెంటర్లో ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరి విగ్రహాలకు మండలి వెంకట్రామ్, శత జయంతి కమిటీల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీ, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆది నారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి చిన్నా, మాదివాడ రత్నారావు, యర్రంశెట్టి సుబ్బారావు, రాజశేఖరస్వామి దేవస్థానం చైర్మన్ ఘంటసాల రాజమోహనరావు (కన్నయ్య), గాంధీ క్షేత్రం ప్రధాన కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానేపల్లి కోటయ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, టీసీ అధ్యక్షుడు రేపల్లె రవీంద్ర, దేవస్థానం డైరెక్టర్లు మత్తి శివపార్వతి, అన్నపరెడ్డి వెంకటేశ్వరమ్మ, మాజీ డైరెక్టర్ విశ్వనాథపల్లి పాప, కూటమి నాయకులు బండే రాఘవ, బచ్చు శ్రీహరి, సిద్దినేని అశోక్ నాయుడు, కమ్మిలి సాయిభార్గవ్, దేగల రాఘవ, సోమిరెడ్డి, లింగం బాబూరావు, పులిగడ్డ బాలు శ్రీనివాస్, కూరాకుల శివప్రసాద్, హరినాథబాబు, అడపా వెంకటేశ్వరరావు, ముళ్లపూడి శ్రీను, బచ్చు మల్లి, సీతామహాలక్ష్మి , బాలమ్మ, గరికపాటి హరిబాబు, చెన్ను గాంధీ, చెన్ను బాబూరావు, పుల్లగోరు రాజేంద్ర, మండలి రామ్మోహనరావు, భోగాది బాలకృష్ణ, శ్యాంకుమార్, బడే సుబ్బారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో ప్రతీ సమస్యకు పరిష్కారం

- తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్
- ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరణ




**విజయవాడ జనవరి 23 వుదయం న్యూస్ బ్యూరో :–** ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. ప్రజాదర్బార్‌లో ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటారని, అందుకు వారికి శక్తినివ్వాలని కోరుకుంటున్నానన్నరు. త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మరిన్ని ఎక్కువ నిధులు కేటాయించాలని ప్రధానిని కూడా కోరుతున్నానని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.

పటమట ఆశోక్‌నగర్‌లోని తూర్పు నియోకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాదర్బార్ జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. వాటిని పరిష్కరించాల్సిందిగా ఆయా ప్రభుత్వ విభాగాల అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజాదర్బారు అనంతరం పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి ప్రజలను చైతన్యపరచి ప్రజాదర్బారుకు నియోజకవర్గంలోని సమస్యలన్నింటీ ప్రభుత్వం దృష్టికి తీసుకొనిరావాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ ప్రజాదర్బార్‌ను ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నామని చెప్పారు. అనేక మంది ఈ ప్రజాదర్బార్‌లో పాల్గొని వారి సమస్యలను తెలియజేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక సమస్యలు ఉన్నా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటుగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, సహకారం అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడికి ప్రత్యేకంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజాదర్బార్‌లో తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించేలా వీరికి మరింత శక్తిని ఇవ్వాలని కోరుకున్నారు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మరిన్ని నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నియోజకర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయ సిబ్బంది, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న ఆశాల సమ్మె జయప్రదం చేయండి

- నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి
- ఏఐటియూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ డిమాండ్



**కడప, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** బ్రిటిష్ కాలంలో ఏఐటీయూసీ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తూ కార్మికులను మరల బానిసలుగా మార్చే విధంగా చేపట్టిన చర్యలను తక్షిణం ఉపసంహరించుకోవాలని, లేబర్ కోర్సు రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, యూనియన్ జిల్లా అధ్యక్షులు యు మరియమ్మ, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి శాంతమ్మ తెలిపారు. ఫిబ్రవరి నెల 12వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా 12న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి పిలుపునివ్వడం జరిగినది.శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ నాగరాజు కి సమ్మె నోటీసును ఇవ్వడం జరిగినదని తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో ఆశా కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని గుంటి వేణుగోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి సి అమ్ములు, ఉపాధ్యక్షులు మంజులవాణి జిల్లా నాయకులు సుధారాణి, ముకుంద, శ్రీలక్ష్మి , రేణుక, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌పురం మండలంలో ప్రజా దర్బార్

- పోలవరం జిల్లా వీఆర్‌పురం మండలంలో ఎమ్మెల్యే శిరీష దేవి పర్యటన
- బీసీ కాలనీ కి పోలవరం నష్టపరిహారం ప్యాకేజీఇవ్వాలి
- అన్నవరం వాగుపై హైవే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



**వీఆర్‌పురం జనవరి 23 వుదయం న్యూస్ :** పోలవరం జిల్లా వి ఆర్ పురం మండలంలో ప్రజా దర్బార్ సమావేశంలో జరిగింది రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవీ ఈ ధర్బర్ కు ముఖ్య అతిథిగా రావటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రధాన సమస్య పోలవరం ప్యాకేజీ. ఈ విషయం పై ముఖ్యమంత్రి చంద్రబాబు తో మాట్లాడనని 2026 లో మొత్తం అరుహులైన అందరికి ప్యాకేజీ ఇస్తామని తెలిపారు.పోలవరం ప్రాజెక్టు కు సంబంధించి అధికారులు ఎవరు రాలేదు, మండలంలో పెద్ద ఎత్తున ప్రజా ధర్బర్ జరుగుతుంటే ఐటీడీఏ ఆఫీస్ నుండి ఎస్ డి సి గాని ఇతర అధికారులు గాని,సర్వేలు గాని,దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి ఎందుకు రాలేదు పోలవరం ప్యాకేజీ నిమితం ప్రశ్నిస్తారని రాలేదా, లేక తప్పించుకుంటున్నారా అంటు పోలవరం ప్యాకేజీ బాధితులు తమ వేదన వ్యక్త పరుస్తున్న రు.ఇది ఇలా ఉండగా అన్నవరం వాగు పై బ్రిడ్జి కూలిపోయి 3 సంవత్సరాలు పై బడింది. ఎదో తాత్కాలికంగా అప్రోచ్ బ్రిడ్జి కట్టారు.అది కూడా గోదావరి వరదల సమయంలో కనుమరుగైనది.ఇప్పుడు ఈ బ్రిడ్జి హైవే బ్రిడ్జి కొరకు ప్రభుత్వం కోటి రూపాయలు పైబడి నిధిని సెంక్షన్ చేశామని త్వరలోనే వర్కు ప్రారంభిస్తాము అని ఎమ్మెల్యే శిరీష దేవి తెలిపారు.కార్యక్రమంలో మండల తహసీల్దార్ సరస్వతి,ఎంపి డిఓ ఇమ్మనీయేలు, పంచాయతీ ప్రెసిడెంట్లు, సెక్రెటరీ లు,మండల టిడిపి న్యాయకులు,మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్యలపై ఎమ్మెల్యే శిరీష దేవికి వినతిపత్రం




**వీఆర్ పురం జనవరి 23 వుదయం న్యూస్.** వి ఆర్ పురం మండల పరిధిలో వెలుగు ఆఫీస్ నందు ప్రజాదర్బార్ ఏర్పాటు చేయడం జరిగింది. ఏ ఎస్ డి ఎస్ సంస్థ నుండి దివ్యాంగుల సమస్యలపై ఎమ్మెల్యే శిరీష దేవి కి మెమోరాండం ఇస్తూ ఈ కింది సమస్యల పరిష్కరించాలని రవి కోరడం జరిగింది . వికలాంగులు సకలాంగులు పెళ్లి చేసుకుంటే లక్ష రూపాయలు మ్యారేజ్ అవార్డు ఇవ్వాలని గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి డబ్బులు రిలీజ్ చేయాలని, ప్రస్తుతం వికలాంగుల సకలాంగులు పెళ్లి చేసుకున్న వారికి దరఖాస్తు విధానము ప్రవేశ పెట్టాలని, తత్కాకాలిక సదరం సర్టిఫికెట్ పొందిన వారికి కాలపరిమితి ప్రకారం పెన్షన్ మంజూరు చేయాలని, 40% వైకల్యం ఉన్న వారికి బ్యాటరీ సైకిల్ ఇప్పించే విధంగా చూడాలని, బ్యాటరీ సైకిల్ ,ట్రై సైకిల్ ,వీల్చరు ,ఉపకరణాల మంజూరు కొరకు చింతూరులో క్యాంప్ ఏర్పాటు చేయించాలని , దివ్యాంగుల బ్యాక్లాగ్ పోస్టులు ఫిలప్ చేయించాలి , ఒంటరి మహిళలకు 32 సం ల నుండి పెన్షన్ ఇప్పించాలనీ రవి నేరుపటి ములకలపల్లి క్లస్టర్ కోఆర్డినేటర్,ముత్యాల రావు ఎన్ ఎఫ్ కోఆర్డినేటర్ కొరటమైనది.




## 25న జాతీయ ఓటర్ల దినోత్సవం

### విద్యాశాఖ ఆధ్వర్యంలో గొప్ప ర్యాలీ

**కావలి, జనవరి 23, వుదయం న్యూస్:** ఈనెల 25వ తేదీ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుంటూ విద్యార్థులతో అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కావలి పట్టణం లోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులచే ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. దేశాన్ని పరిరక్షించుకుందాం, అనే నినాదాలతో ఎంఈఓ ఆఫీస్ నుండి భారీ ర్యాలీగా బయలుదేరి ఎంపీడీవో ఆఫీసు మీదుగా తిరిగి వెళ్ళి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాలుగు రోడ్ల కూడలి నందు మానవహారంగా నిలబడి ఓటర్ల ప్రతిజ్ఞ చేపట్టారు. అనంతరం విద్యార్థులు వారి వారి స్కూళ్లకు వెళ్లడం జరిగింది. కార్యక్రమంలో జెడ్పి బాయ్స్ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు మాధవ రావు, జెడ్పి గర్ల్స్ హైస్కూల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కోటీశ్వరి అదేవిధంగా పి.ఈ.టిలు పులి చిరంజీవి, గౌసియా తదితర ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఉదయగిరి కోటేశ్వరరావు, సిఆర్‌ఎంటిలు పార్ట్ టైమ్ ఇన్స్పెక్టర్లు పాల్గొని పై ర్యాలీని విజయవంతం చేయడం జరిగింది.



## 'చస్తే గాని ఊరు గుర్తుకు రాదా'

**ఆత్మకూరు రూరల్ మర్రిపాడు (వుదయం ప్రతినిధి) జనవరి 23వ తేదీ** మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామ ఎస్సీ కాలనీ ప్రజలు కిడ్నీ వ్యాధితో అనేకమంది మరణించి ఇంకా కొంతమంది కిడ్నీ వ్యాధితో మంచాన్ని పడిన సందర్భంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి చొరవ తీసుకుని మెడికల్ సిబ్బందిని. గ్రామానికి పంపగా మెడికల్ సిబ్బందిపై గ్రామ ప్రజలు మండిపడడం జరిగింది. మా గ్రామంలో ప్రజలు సస్తేగాని మా గ్రామం వైపు చూడరా మా ఊరు గుర్తుకు రాదా ఈ విధంగానే ప్రజల యొక్క ఆరోగ్యాన్ని గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేస్తారా ఇంకెంత మందిని పొట్టన పెట్టుకుంటారు ప్రజల యొక్క బాగోగులు చూసే బాధ్యత మీకు లేదా .అని గ్రామ ప్రజలు మెడికల్ సిబ్బందిని నిలదీయడం జరిగింది. దీనికి సమాధానంగా మెడికల్ సిబ్బంది వారికి ఏమీ సమాధానం చెప్పలేక గమ్మునుండిపోవడం వాళ్ళు అంతా అయింది.

## ఆపరేషన్ వికటించి తల్లి, బిడ్డ మృతి



**అన్నమయ్య జిల్లా, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** అన్నమయ్య జిల్లా, రాయిచోటి లో ఆపరేషన్ వికటించి తల్లి, బిడ్డ మృతి చెందిన విషాదకర సంఘటన తీవ్ర కలకలం రేపుతోంది. రాయచోటి లక్ష్మీ ఆసుపత్రి వద్ద చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండెం మండలం చింతమాని వారి పల్లికి చెందిన తవలం వెంకటరమణ భార్య ఈశ్వరమ్మ 30, ప్రసవ నొప్పులతో రాయచోటి లోని లక్ష్మీ ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్ళింది. ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తుండగా బిడ్డ మృతి చెందడం ఆ వెంటనే తల్లి మృతి చెందడంతో వివాదానికి దారితీసింది. అయితే ఆసుపత్రి యాజమాన్యం తప్పించుకోవడానికి మృతదేహాన్ని తిరుపతికి తరలించాలని ఉచిత సలహా ఇచ్చి స్కానింగ్ పేరుతో పంపివేశారని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. నిజా నిజాలను వైద్యాధికారులు పోలీసులు దర్యాప్తు అనంతరం బయటపెట్టాల్సి ఉంది



## క్రమ శిక్షణతో నేర్చుకోవాలి

### ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

**కడప,జనవరి 23, (వుదయం ప్రతినిధి)** స్థానిక కడప పట్టణం, అక్కాయవల్లె, సాయిబాబా పాఠశాల యందు వసంతి పంచమి వేడుకల సందర్భముగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ యం.వి. రామ చంద్రారెడ్డి పాల్గొని విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భముగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వసంత పంచమి అనేది విద్యా, జ్ఞానం, కళలకు అధిష్టాన దేవత అయిన సరస్వతి దేవిని పూజించే పవిత్రమైన రోజు ఇది అని తెలిపారు. ఈ రోజు సరస్వతి దేవిని పూజించడం వల్ల చదువు పట్ల శ్రద్ధ, ఏకాగ్రత, ఆలోచనా శక్తి పెరుగుతాయని ప్రజలందరి నమ్మకం అని తెలిపారు. చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయడం ఈ రోజు చాలా మంచిదని తెలిపారు. .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుడివాడలో ఆరు ఎకరాల్లో క్రికెట్ పిచ్ అభివృద్ధి

- గుడివాడ ఖ్యాతి మరింత పెరిగేలా జాతీయ కబడ్డీ పోటీలు : ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- ప్రజల సహకారంతో గుడివాడలో మరిన్ని జాతీయ పోటీలు నిర్వహిస్తాం: ఎమ్మెల్యే రాము

### దిగ్విజయంగా ముగిసిన నేషనల్ స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలు



**విజయవాడ జనవరి 23 వుదయం న్యూస్ బ్యూరో :** గుడివాడ ఖ్యాతి పెంపొందేలా జాతీయ కబడ్డీ పోటీలు విజయవంతంగా జరగడం సంతోషకరమని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ హర్షం వ్యక్తం చేశారు. పట్టణాలు అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో మంత్రి లోకేష్ ఇచ్చిన అవకాశాన్ని, టోర్నమెంట్ విజయవంతంతో గుడివాడ ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని కొనియాడారు.

గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న....69వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 14 బాలికల జాతీయ కబడ్డీ పోటీలు,విజయవంతంగా ముగిసాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీల్లో... హిమాచల్ ప్రదేశ్ జట్టుపై, హర్యానా జట్టు విజయం సాధించి ప్రథమ స్థానంలో, నిలవగా హర్యానా ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. మూడు,నాలుగు స్థానాలకు జరిగిన పోటీల్లో తమిళనాడు జట్టుపై మహారాష్ట్ర జట్టు విజయం సాధించింది. ఈ ఫైనల్ మ్యాచ్ ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఎంపీ కేశినేని శివనాథ్ ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని... ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఫైనల్ పోటీలను తిలకించేందుకు వేలాదిగా ప్రేక్షకులు,విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్సీ , టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మ్యాచ్ తిలకించటంతో పాటు, క్రీడాకారులను ప్రోత్సహించారు.

నేషనల్ టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి, చక్కటి ఆతిథ్యం ఇచ్చిన ఎమ్మెల్యే రాము ,నిర్వాహకులను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. పోటీల్లో క్రీడాకారులు చక్కటి ప్రదర్శన చేశారని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గాస్పెల్ ప్రేయర్ టెంపుల్ మినిస్ట్రీస్ కన్వీనర్ సజ్జా బర్నబాస్, గుడివాడ మండల, నందివాడ మండల టిడిపి అధ్యక్షులు వాసే మురళి, దానేటి సన్యాసిరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్,టిడిపి నాయకులు పంద్రాజు సాంబయ్య, పిన్నమనేని బాబ్జి,లింగం ప్రసాద్,చేకూరు జగన్మోహన్రావు, గోకవరపు సునీల్, కిలారపు రంగ ప్రసాద్, ఏపీ క్రీడా శాఖ, స్కూల్ గేమ్ ఫెడరేషన్ పెద్దలు, విద్యాశాఖ అధికారులు, వేలాదిగా ప్రేక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుభాష్ చంద్రబోస్ కు బుద్ధప్రసాద్ ఘన నివాళి

### మంగళ్ పాండే ఘాట్ సందర్శించిన ఎమ్మెల్యే



**అవనిగడ్డ జనవరి23 (వుదయం ప్రతినిధి):** పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం బారక్ పూర్ నగరంలో బెంగాల్ వీరకుమారుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన తొలి ఘట్టం 1857 మార్చిలో జరిగిన సిపాయిల తిరుగుబాటులో బ్రిటిష్ అధికారిపై మొదటి తూటాను పేల్చిన స్వాతంత్ర్య సమర యోధుడు, 34వ భారత పదాతిదళం (బెంగాల్ నేటివ్ ఇన్ఫాంటి–బారక్ పూర్)కు చెందిన మొదటి అమరవీరుడు సిపాయి మంగళ్ పాండే ఘాట్ సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.

## కడప ఉక్కుపై ఇంకెన్నాళ్లు ఎదురుచూపులు?

- ఇప్పటికి వందల కోట్లు ఖర్చు పెట్టిన కడప బెంగళూరు రైల్వే లైన్ పైన కూడా పాలకుల నిర్లక్ష్యం
- పులివెందుల మెడికల్ కాలేజీ ని ప్రైవేటీకరణ ఆపాలి
- ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11,12,13 బైక్ జాత...
- జయప్రదం చేయాలని నాయకుల పిలుపు....



**కడప, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కీలకమైన కడప ఉక్కు పరిశ్రమ, కడప బెంగళూరు రైల్వే లైన్ ల పై దశబ్దాలుగా పాలకుల చేస్తున్న నిర్లక్ష్యం పై ప్రతిఘటించేదుకు ప్రజలు సిద్ధం కావాలని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వినర్ ఓబుల్ రెడ్డి, ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జోగిరామిరెడ్డి, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. కడప లోని ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఫిబ్రవరి 11,12,13 న జరిగే బైక్ యాత్రకు సంబందించిన ఆర్ఎస్ఎఫ్ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ బైక్ జాత కన్యాతీర్థం నుండి మొదలై పులివెందుల మెడికల్ కళాశాల, కడప బెంగళూరు రైల్వే లైన్ ఆగిన పెండ్లిమర్రి వరకు బైక్ యాత్ర ఉంటుందని, అనంతరం కడపలో బహిరంగసభ ఉంటుంది అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకమైన కడప ఉక్కు పరిశ్రమ, కడప బెంగళూరు రైల్వే లైన్, పులివెందుల మెడికల్ కళాశాల ప్రయివేట్ పరం చేయడం ఆపాలని వారు డిమాండ్ చేశారు. కడప ఉక్కు పరిశ్రమ ఈ ప్రాంతా ప్రజల అభివృద్ధికి కీలకమైనది, మొదటి శిలాఫకం వేసి ఇప్పటికి రెండు దశబ్దాలు అవుతుంది, ప్రభుత్వాలు మారుతున్న శిలాఫలాకాలు వేయడం, ఈ ప్రాంతా ప్రజలకు హామీలు ఇస్తూ నమ్మించి మోసం చేయడం తప్ప నిర్మాణం చేయాలేదు. ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ చదువుకున్న యువత ఉద్యోగాలా కోసం బెంగళూరు, చెన్నై,హైదరాబాద్ కి గల్ఫ్ దేశాలకు వాళ్లేసెల్లుతున్నారన్నారు.ఆర్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 11,12,13తేదీలల్లో జరిగే బైక్ జాతను జిల్లా యువత విద్యార్థులు మేధావులు, ప్రజలు జయప్రదం చేయాలనీ, మనకు జరిగిన అన్యాయన్ని ఈ బైక్ యాత్ర ద్వారా ప్రతిఘటన రూపంలో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనతాదల్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు సంగటి మనోహర్, అఖిల పక్ష్య కమిటీ కన్వినర్ సిఆర్వి ప్రసాద్, దళిత మిత్ర సంఘం అధ్యక్షులు కైపు రామాంజనేయులు, లోకసత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు దేవర శ్రీ కృష్ణ, హై కోర్ట్ అడ్వకేట్ అమీన్ పీరా, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ జిల్లా నాయకులు ఎస్ వి రమణ, ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వంశీ, ఉపాధ్యక్షులు బాలు, సాయి పాల్గొన్నారు.

## స్థాయిని మరచి మాట్లాడడం వీర శివారెడ్డికి తగదు

### టిడిపి యువ నాయకుడు అంబవరం రామాంజనేయరెడ్డి



**కడప, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** కడప జనవరి 23 మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తన స్థాయిని మరిచి తమ టిడిపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డిని ఉద్దేశించి విమర్శించడం తగదని టిడిపి యువ నాయకులు అంబవరం రామాంజనేయరెడ్డి అన్నారు. శుక్రవారం కడప ప్రెస్ క్లబ్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీర శివారెడ్డి తన గత చరిత్ర ఏమిటో తెలుసుకోవాలని హితవు పలికారు.ప్రొద్దుటూరులో మట్కా, జూదం, గంజాయి అమ్మిన చరిత్ర నీకుందనే విషయం జిల్లా ప్రజలం దరికీ తెలుసన్నారు. నేటికీ తమ నాయకుడు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నాడు కాబట్టే తన కుమారుడు ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి అతి చిన్న వయసులోనే అత్యధిక మెజార్టీతో గెలుపొం దారని చెప్పారు. నాలుగుసార్లు ఓడిపోయిన పుత్తా నరసింహారెడ్డి అని విమర్శించడం తన స్థాయికి తగదని హితవు పలికారు. వీర శివారెడ్డి తన గురువైన కిరణ్ కుమార్ రెడ్డి ద్వారా బిజెపిలో చేరుతానని, చెప్పడం మంచిదే కానీ గతంలో వైయస్సార్ తన గురువు అని చెప్పి ఇప్పుడు కిరణ్ కుమార్ రెడ్డి తన గురువు అని చెప్పుకో వడం సిగ్గుచేటన్నారు. వీరశివారెడ్డి వయసు రీత్యా పెద్దవాడైనందున తాము దిగజారి మాట్లాడలేక పోతున్నామని రామాంజుల రెడ్డి అన్నారు. అనంతరం టిడిపి కడప నేత కొండా సుబ్బయ్య మాట్లాడుతూ బిజెపిలో చేరి ఎమ్మెల్యే అయినట్లు మాజీ ఎమ్మెల్యే వీరి శివారెడ్డి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు జాఫర్ వలి, కార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.



“విద్య జీవితాలను మారుస్తుంది. ఐక్యరాజ్యసమితి శాంతి దూత మలాల యూసఫ్‌జాయ్ ఒకప్పుడు చెప్పినట్టు ‘ఒక సంతానం, ఒక టీచర్, ఒక పుస్తకం, ఒక కలం ప్రపంచాన్ని మార్చగలవు.’ విద్య ప్రపంచాన్ని మార్చగల అత్యంత బలమైన ఆయుధం అని నెల్సన్ మండేలా అన్నారు. ఐక్యరాజ్య సమితిలో నేను పనిచేయడానికి ముందు, నా దేశంలో ప్రభుత్వ పదవిలో చేరకముందు నేను లిస్బన్ మురికివాడల్లో టీచర్‌గా పనిచేశాను. పేదరిక నిర్మూలనలో శాంతి సాధనలో విద్య ఒక ఇంజన్ లా ఉపయోగపడడం చుశాను. ఈరోజున సుస్థిర అభివృద్ధి గమ్యాలను చేరుకునే యాత్రకు హృదయం విద్య అని రుజువవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 26 కోట్ల 20 లక్షల మంది పిల్లలు, కౌమార దశలో ఉన్నవారు, యువత చదువుకు దూరంగా ఉన్నారు. మరి కొన్ని లక్షల మంది పిల్లలు చదువుకుంటున్నప్పటికీ అక్షరాలు సవ్యంగా రాయలేని స్థితిలో కొనసాగుతున్నారు.”

ఆంటోనియో గుటెరస్, ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి

## వే‘మన’పద్యం

వేరుపురుగు చేరి వృక్షంబు చెరచును
చీడ పురుగు చేరి చెట్టు చెరచు
కుత్సితుండె చేరి గుణవంతు చెరచురా!
విశ్వదాభిరామ! వినురవేమ!



## సంపాదకీయం

# మళ్ళీ మణిపూర్ మంటలు!

జాతుల వైరం, ప్రభుత్వ నిర్లక్ష్యం తో రెండున్నర ఏళ్లుగా తీవ్ర సంక్షోభంలో కొనసాగుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మరొక్కసారి భగ్గుమనడం ఆశ్చర్యాన్ని కలిగించదు. అక్కడ ఈ మంటలు ఇంకె న్నాళ్ళు ఇలా రగులుతాయో అనే భయమూ పెరుగుతున్నది. భారత మయన్మార్ సరిహద్దుల్లోని గిరి, మైదాన మిశ్రమప్రాంతమైన సుందర మణిపూర్ రాష్ట్రం లో ఈ కల్లోలాన్ని అంతమొందించడంలో రాజకీయ వైఫల్యం సుస్పష్టం. బుధవారం రాత్రి చురచంద్రపూర్ జిల్లాలోని కుకిజో తెగకు చెందిన తన భార్యను చూడడానికి వెళ్లిన ఇరవై ఎనిమిది సంవత్సరాల మెయితీ తెగ యువకుడుని కాల్చి చంపిన ఘటన మళ్ళీ ఉద్రిక్తత కు దారి తీసింది. మయాంగ్లంబంబం రిషికాంత్ సింగ్ అనే ఈ యువకుడు మెయితీ తెగవాడు కావడం గమనించవలసిన అంశం. ప్రస్తుత సంక్షోభంలో ఎదుర రెదురు వర్గాలుగా ఉన్న ఈ రెండు తెగల జంట ఎంతో ఆదర్శప్రాయమైనది. ఇంఫాల్ మైదాన ప్రాంతం నుంచి రిషికాంత్ సింగ్ కొండ ప్రాంతంలోని తన భార్య వద్దకు వెళ్ళినప్పుడు ఆయన హత్యకు గురయ్యాడు. దుండగులు భార్యాభర్తలిద్దరినీ ఇంటి నుంచి తీసుకుపోయి భార్యనుంచి అతడిని దూరం చేసి హతమార్చారని బోధపడుతున్నది. ఇది కుకిజో తెగ ఆందోళనకారుల నిర్వాకమేనని తెలుస్తున్నది. ఇందుకు నిరసనగా లోయలో ఉద్రిక్తత చోటు చేసుకున్నది. రిషికాంత్ సింగ్ సొంత కాక్చింగ్ జిల్లాలో ఇండో - మయన్మార్ సుగ్ను రోడ్ ను మెయితీ నిరసనకారులు మూసివేశారు. హతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మణిపూర్ సంక్షోభాన్ని సింహావలోకనం చేసుకుంటే పర్వత ప్రాంత కుకీ జో తెగవారిలో పేరుకుపోయిన అసంతృప్తే సంక్షోభం ఇప్పటికీ చల్లారక పోవడానికి కారణమని బోధపడుతుంది. తాము అనిభవిస్తున్న రిజర్వేషన్లను ఇంఫాల్ మైదాన ప్రాంతవాసులైన మెయితీలకు కూడా వర్తింపచేయడానికి మొదట్లో కోర్టు దన్నుతో జరిగిన ప్రయత్నం కుకిజో తెగలో ఆగ్రహం కలిగించింది. ఆల్ ట్రైబల్ స్టూడెంట్స్ యూనియన్ మణిపూర్ పతాకం కింద సంఘటిత ఆందోళన చేపట్టారు. మెయితీలు అధికంగా ఉన్న అధికార పీఠం ఇంఫాల్లో గలో ప్రదర్శలు నిర్వహించారు. మెయితీలు కుకో మహిళను సామూహిక రేప్ చేయడం వంటి ఘటనలు అగ్గికి ఆజ్యం అయ్యాయి. బీరేంద్ర సింగ్ ముఖ్యమంత్రిగా బిజెపి డబల్ ఇంజిన్ ప్రభుత్వంలో ఆయన తన వారైన మెయితీల వైపు మొగ్గిపోయి అందించిన పాలన, మొత్తం 60 అసెంబ్లీ స్థానాల్లో మెయితీలు 40 స్థానాలకు ప్రాతినిధ్యం వహించడం, బడ్జెట్లో అత్యధిక నిధులు వారికే చెందడం కుకీల లో నిరాశ, నిస్పృహలను కలిగిస్తున్నాయి. కుకీలను అక్రమ ఆక్రమణదారులుగా ముద్రవేసి సింగ్ ప్రభుత్వం వారిని భారీ గా ఖాళీ చేయించడం వారిలో అసంతృప్తిని తారస్థాయికి చేర్చింది. ఈ సంక్షోభంలో, ఘర్షణల్లో 250 మంది మరణించారు. 60000 మంది స్వస్థలాలనుంచి పారిపోయి పునరావాస శిబిరాలను ఆశ్రయించారు. చాలా కాలం ససేమిరా అన్న కేంద్ర ప్రభుత్వం చివరికి బీరేన్ సింగ్ ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించి గత ఏడాది ఫిబ్రవరి లో రాష్ట్రపతి పాలన విధించింది. అయినా ఫలితం లేకపోయింది. కొండ ప్రాంతాన్ని ఇంఫాల్ నుంచి వేరు చేసి తమకు ప్రత్యేక పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కుకి జో లు కోరుతున్నారు. మయన్మార్ లోని చిన్ తెగ వారి తో కలిపి తమపై డ్రగ్స్ స్మగ్లింగ్ ఆరోపణలు చేసి వేధిస్తున్నారని బాధపడుతున్నారు. అందుచేత కేంద్రం చొరవ చూపి వారి డిమాండ్లను సానుభూతితో పరిశీలిస్తున్నామనే నమ్మ కాన్ని అయినా కలిగించి ఇప్పటికైనా శాశ్వత పరిష్కారాన్ని సాధించాలి.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ ‘ఉష’ కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# బీటలు వారుతున్న అమెరికా ఆధిపత్యం!

పెట్టుబడిదారీ దేశాల్లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం, ఆదేశాల మధ్య వైరుధ్యాలను సృష్టించింది. అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలకు మద్దతు ఇస్తూ వచ్చిన నా టో కూటమి దేశాలు నేడు బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నాయి. వెనిజులా పై అమెరికా దాడిని, గ్రీన్ లాండ్ ను ఆక్రమిస్తామని ట్రంప్ చేసిన ప్రకటనను యూరోపియన్ యూనియన్ దేశాలు వ్యతిరేకించాయి. అమెరికా విధానాలు నాటో విచ్ఛిన్నానికి దారి తీస్తుందని పేర్కొన్నాయి.

నాటో కూటమి ఏర్పాటు: స్టాలిన్ నాయకత్వాన ఉన్న సోవియట్ యూనియన్ అన్ని రంగాల్లో దూసుకుపోవడమే కాకుండా, సైనిక శక్తిలో అమెరికాను డీ కొనగలిగిన సామర్ధ్యం కలిగి ఉండటం, అల్బేనియా, రుమేనియా, ఉత్తర కొరియా తదితర దేశాలు కమ్యూనిస్టు, సోషలిస్టు దేశాలుగా ఉండటం, చైనాలో మావో నాయకత్వాన విప్లవం చివరి విజయానికి చేరుకోవడం, అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడి బలమైన శక్తిగా మారడంతో భయపడిన అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్ తదితర 12 దేశాలతో, సోవియట్ యూనియన్ కి వ్యతిరేకంగా 1949లో ‘నాటో’ ( నార్త్ అట్లాంటిక్ ట్రీ టీస్ ) కూటమిగా ఏర్పడ్డాయి. కూటమిలోని దేశాల ప్రధాన ఉద్దేశం వెనకబడిన దేశాల సహజ వనరుల దోపిడీలో భాగం కోసమే. నాటో సభ్యదేశాల్లోని ఏదేశం పైనైనా మరో దేశం దాడి చేస్తే, తమపై దాడిగానే భావించి మిగిలిన సభ్య దేశాలు, ఆ దేశానికి అండగా ఉండాలన్నది నాటో ఏర్పాటు ఉద్దేశం. అంతే కాకుండా ఒక నా టో దేశం వేరొక దేశంపై దాడి చేసినా అందుకు మద్దతుగా ఉండాలి. ఇతర దేశాలపై దాడులు చేస్తున్నది అమెరికా తదితర పెట్టుబడిదారీ దేశాలే అన్నది గమనించాలి. తన దురాక్రమణ దాడులకు మద్దతుగా నాటో దేశాలు ఉండాలన్నదే అమెరికా ఉద్దేశం. పెట్టుబడిదారీ విధానాల పునరుద్ధరణ ఫలితంగా ఏర్పడిన ఆర్థిక ,రాజకీయ సంక్షోభం ఫలితంగా 1991లో సోవియట్ యూనియన్ పతనమై అనేక దేశాలుగా ఏర్పడ్డాయి. సోవియట్ పరిణామాల తర్వాత తూర్పు ఐరోపాలోని అనేక దేశాలు నాటో లో చేరాయి. వాటిల్లో సోషలిజానికి తిలోదకాలు ఇచ్చి పెట్టుబడిదారీ విధానాన్ని చేపట్టిన అల్బేనియా, బల్గేరియా, రుమేనియా, చెక్ రిపబ్లిక్ తో పాటు హంగరీ, పోలెండ్ తదితర దేశాలు నా టో పంచన చేరాయి. తటస్తంగా ఉన్న ఫిన్లాండ్ 2023లో, స్వీడన్ 2024లో నాటో లో చేరటం జరిగింది. ఉక్రెయిన్ నాటో లో చేరటానికి దరఖాస్తు చేసింది.

అమెరికా యుద్ధాలకు నాటో మద్దతు: అమెరికా ప్రపంచ ఆదిత్య విధానాల్లో భాగంగా అనేక దేశాల్లోని సహజ వనరులను తరలించుకుపోవడానికి అడ్డంకిగా ఉన్న దేశాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడులు చేసింది. 2001లో ఆఫ్ఘనిస్థాన్ పై దాడి చేసింది. 1999లో యుగోస్లేవియా (యుగోస్లేవియా- కొసావో యుద్ధం)పై వైమానిక దాడులు చేసింది. చమురు నిల్వలు తరలించుకుపోవడానికి ఇరాక్ పై దాడి చేసి సద్దాం హుస్సేన్ ని ఉరితీసింది. జెలెనెస్కీ ని రెచ్చగొట్టి ఉక్రెయిన్ రష్యాతో యుద్ధానికి తలపడేలా చేసి ఆయుధాలు సప్లయ్ చేస్తూ యుద్ధం ఆరకుండా చేస్తున్నది. ఈ దాడులన్నీ అమెరికా ఆధిపత్య దోపిడీ విధానాల్లో భాగమే. అమెరికా దాడులకు నాటో మద్దతు



ఇస్తూ ఇచ్చింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని సృష్టించిన అమెరికా, రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయరాదని నాటో దేశాలపై కూడా ఆంక్షలు పెట్టటం వల్ల అమెరికా వెడల నాటో దేశాల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. ట్రంప్ ఆంక్షలు తమ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తుందని భావించాయి.

నాటో పై అమెరికా పెత్తనం : నాటో కి ప్రత్యేకమైన సైనిక శక్తి లేదు. నాటో కూటమిలోని మిగతా దేశాల కన్నా ఆర్థిక, సైనిక శక్తి తో అమెరికా కీలకంగా ఉంది. ఫలితంగా నాటో పై దాని ఆధిపత్యం కొనసాగుతున్నది. నాటో అజెండాను అమెరికానే రూపొందిస్తున్నది. ఇటీవల కాలంలో అమెరికా ఏకపక్ష నిర్ణయాలు, సైనిక జోక్యాలు కొన్ని దేశాలకు నచ్చక అమెరికా వెడల వ్యతిరేకత చోటుచేసుకుంది. అమెరికా అనుసరిస్తున్న విధానాలు తమ ఆర్థిక ప్రయోజనాలకు నష్టంగా ఉన్నాయనే అభిప్రాయ కూటమి దేశాల్లో ఏర్పడింది. ఫలితంగా కొన్ని దేశాల్లో చైనాపై సానుకూలత పెరుగుతూ ఉంది.

వెనిజులా పై అమెరికా దాడితో కూటమి దేశాల్లో ఉన్న వ్యతిరేకత బయట పడింది. నాటో లోని ముఖ్య పెట్టుబడిదారీ దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా మొదలైన దేశాలు అమెరికా దాడిని వ్యతిరేకించాయి. స్వతంత్ర ప్రతిపత్తి కలిగి డెన్మార్క్ భూ భాగంలో అంతర్భాగంగా ఉన్న గ్రీన్ ల్యాండ్ ను అమెరికాలో కలుపు కుంటామని, తమ దేశ భద్రతకు గ్రీన్ ల్యాండ్ అవసరమని, అందుకు అంగీకరించకపోతే దాడి చేసి ఆక్రమిస్తామని, బలపరచని దేశాలపై ఫిబ్రవరి 1 నుంచి 10% దిగుమతి సుంకం విధిస్తానని, ఆ తర్వాత కూడా ఒప్పందం కుదరక పోతే జూన్ నుంచి 25% సుంకం విధిస్తానని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను నాటో దేశాలు తీవ్రంగా ఖండించాయి.

తన దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఏ దేశం ఉన్నా సహించని ట్రంప్ చెప్పడమే కాకుండా గ్రీన్ ల్యాండ్ విషయంలో తనకు మద్దతు ఇవ్వని నాటో కూటమి దేశాలకు వ్యతిరేకంగా అనేక వ్యాఖ్యలు చేశాడు. దీన్ని గమనిస్తే నాటో కూటమి తన ప్రయోజనాలను మాత్రమే కాపాడాలని, అందుకు విరుద్ధంగా ఏ దేశం ఉన్నా సహిం చని ట్రంప్ హెచ్చరిక చేయడం అగ్ర రాజ్య దురహంకారానికి, నాటో దేశాల వెడల చులకన బాణానికి నిదర్శనం.

ట్రంప్ హెచ్చరికలను ఐరోపా సమాఖ్య దేశాలు తీవ్రంగా పరిగణించాయి. తీవ్ర పదజాలంతో ఖండించాయి. దావోస్ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం వార్షిక సమావేశాన్ని అందుకు వేదిక చేసుకున్నాయి. ట్రంప్ సమావేశానికి రాక ముందే వివిధ దేశాల నేతలు ట్రంప్ విధానాలను దుయ్యబట్టారు. అమెరికా నాయకత్వాన ఉన్న ప్రపంచ వ్యవస్థకు ముగింపు పలికి ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాయి. బలవంతుల చట్టానికి లొంగిపోగూడదని, బెదిరింపులకు బదులు గౌరవాన్ని కోరుకుంటున్నామని, గ్రీన్ ల్యాండ్ విషయంలో ట్రంప్ వైఖరి నాటో కూటమికి చేటు చేస్తుందని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ పేర్కొన్నాడు. అమెరికా చెప్పే గాజా శాంతి బోర్డులో చేరటానికి ఫ్రాన్స్ నిరాకరించింది. ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యూరప్ స్వాతంత్రంపై ఏకాభిప్రాయం పెరిగిందని, ఐరోపా కమిషన్ ప్రెసిడెంట్ తెలిపాడు. బెల్జియం ప్రధాన మంత్రి బార్ట్ డి వెవర్ మాట్లాడుతూ 27 దేశాల ఐరోపా సమాఖ్య ఒక కూడలిలో ఉందని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో అమెరికా మద్దతు, తర్వాత ఎదుర్కొన్న దారుణ పరిస్థితుల నుంచి ఎలా బయటపడాలో నిర్ణయించుకోవాలన్నాడు. సంతోషకరంగా ఉండటం ఒక విషయం కాగా, దుర్భరమైన బానిసగా ఉండటం మరొకటి అని ట్రంప్ సుంకాలపై బెదిరింపుల గురించి డి వెవల్ వ్యాఖ్యానించాడు. అమెరికా నాయకత్వంలోని ప్రపంచ పాలనా వ్యవస్థ ఒక విచ్ఛిన్నాన్ని ఎదుర్కొంటున్నదని కెనడా ప్రధాని మార్క్ కార్నీ సూటిగా వ్యాఖ్యానించాడు. మనం పరివర్తనలో కాదు విచ్ఛిన్నంలో ఉన్నామని, అంతర్జాతీయ నియమాల ఆధారిత క్రమం పాక్షికంగా అబద్ధమని మాకు తెలుసు. బలవంతులు సౌకర్యవంతంగా ఉన్నప్పుడు తమకు తాము మినహాయించు కుంటారు. వాణిజ్య నియమాల అమల్లో అసమానంగా వ్యవహరిస్తారు అంటూ ట్రంప్ గురించి వ్యాఖ్యానించాడు. తమ దేశ సార్వభౌమత్వ అంశాన్ని ఇతరులతో చర్చించాల్సిన అవసరం లేదని డెన్మార్క్ మహిళా ప్రధాని మెటె ఫెడరిక్షన్ చెప్పారు. దావోస్ లో ట్రంప్ ను కలవకుండానే డెన్మార్క్, ఫ్రాన్స్, జర్మనీ, యూ కే నేతలు స్వదేశాలకు బయలుదేరారు.

అమెరికా సామ్రాజ్యవాదం అణ్వస్త్రాల బూసిని చూపి ప్రపంచ పెత్తనం కోసం అర్రు చేస్తున్నది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు కూడా చెప్పు చేతుల్లో ఉండాలని, తన ప్రయోజనాలు కాపాడాలనే విధంగా వ్యవహరిస్తున్నది. అమెరికా ఆధిపత్య విధానాల ఫలితంగా బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ మొదలైన పెట్టుబడిదారీ దేశాల దోపిడీ ప్రయోజనాలు దెబ్బ తింటూ వచ్చాయి. అమెరికా పై గుర్రుగా ఉన్నాయి. ఇవి కూడా సామ్రాజ్యవాద కాంక్ష గల దేశాలు కావడమే అందుకు కారణం. తమ దేశాల్లో కూడా ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు ఏర్పడి సమస్య వలయంలో చిక్కుకున్న ప్రజలు వీధి పోరాటాలకు దిగుతున్నారు. అమెరికా దురాక్రమణ యుద్ధాలకు మద్దతు ఇవ్వరాదని ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. ఇది తమ అధికారానికే ప్రమాదమని బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాలు భావించాయి. వీటన్నిటి ఫలితమే అమెరికాకు వ్యతిరేకంగా ఈ దేశాలు ముందుకు రావడం. అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ విధానాలను వ్యతిరేకిస్తూ, గ్రీన్ ల్యాండ్ స్వయం ప్రతిపత్తి, పూర్తి స్వాతంత్ర కాంక్షను అమెరికా గౌరవించాలని, గ్రీన్ ల్యాండ్ ఆక్రమణ విధానాలను మానుకోవాలని, వెనిజులా సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని ప్రపంచ ప్రజలు అమెరికాకు వ్యతిరేకంగా ఉద్యమించాలి.



బొల్లిముంత సాంబశివరావు
రైతు కూలీ సంఘం ( ఆం.ప్ర ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
సెల్:9885983526

## అణుశక్తి విజ్ఞాన పితామహుడు

# హోమీ బాబా

హోమీ జహంగీర్ భాభా (1909-1966) భారతదేశ శాస్త్ర రంగానికి, అణుశక్తి అభివృద్ధికి అత్యంత విలువైన సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త. ఆయన భారతదేశాన్ని అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషించి, "భారత అణుశక్తి పితామహుడు"గా గుర్తింపు పొందారు. హోమీ జహంగీర్ భాభా 1909 అక్టోబర్ 30న ముంబైలో ఒక సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించారు. తండ్రి జెహంగీర్ హోర్ముస్‌జీ భాభా, ఒక ప్రముఖ న్యాయవాది. తల్లి మీహర్‌బాయి, కళలపట్ల గొప్ప ఆసక్తి కలిగి ఉండేవారు. కుటుంబం విద్యకు ప్రాముఖ్యతనిచ్చింది, ఇది భాభా వ్యక్తిత్వం అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించింది. భాభా చిన్నతనంలోనే శాస్త్రానికి ఆసక్తి కనబరిచారు. కుటుంబం నుంచి వచ్చిన ప్రోత్సాహంతో, ఇంజినీరింగ్ విద్య కోసం ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయానికి వెళ్లారు. భాభా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రాన్ని అభ్యసించి, భౌతిక శాస్త్ర రంగంలో అద్భుతమైన పరిశోధనలు చేపట్టారు.

భాభా-హీట్లర్ సిద్ధాంతం: కాస్మిక్ రేడియేషన్‌పై ఆయన చేసిన అధ్యయనాలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. భౌతిక శాస్త్రంలో చేసిన ఈ పరిశోధనలు, ప్రతిభను ప్రదర్శించడంతో పాటు, భవిష్యత్తులో ఆయనకు మార్గదర్శకంగా నిలిచాయి. భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత భాభా దేశంలోని శాస్త్ర అభివృద్ధికి పెద్ద అడుగు వేశారు. 1945లో ఆయన టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (TIFR)ను స్థాపించారు. ఇది శాస్త్రవేత్తల కోసం పరిశోధన కేంద్రంగా మారింది. TIFR ను భౌతిక శాస్త్రం, అణు శక్తి, మరియు ఖగోళ శాస్త్రంలో ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చేశారు. 1948లో స్థాపించబడిన ఆటామిక్ ఎనర్జీ కమిషన్కు భాభా అధ్యక్షత వహించారు. ఈ కమిషన్ ద్వారా భారతదేశం శాంతియుత అవసరాల కోసం అణు శక్తిని వినియోగించుకోవడం ప్రారంభించింది. ట్రాంబేలో ఆయన ఆధ్వర్యంలో అణు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయబడింది. ఇది తర్వాత భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్గా (BARC) పునర్నామీకరించబడింది. భాభా భారతదేశాన్ని అణుశక్తి రంగంలో గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దే దిశగా పనిచేశారు. ఆయన ప్రతిపాదించిన త్రిస్థాయి ప్రణాళికలో యురేనియం, థోరియం వంటి శక్తి వనరుల వినియోగం ప్రధానంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, మరియు పరిశ్రమల అభివృద్ధిలో అణుశక్తిని వినియోగించేందుకు ఆయన ప్రాధాన్యతనిచ్చారు. విదేశీ ఆధారాన్ని తగ్గించి, స్వదేశీ శక్తి, మరియు సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యతనిచ్చారు.



భాభా భారతదేశాన్ని అణుశక్తి రంగంలో గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దే దిశగా పనిచేశారు. ఆయన ప్రతిపాదించిన త్రిస్థాయి ప్రణాళికలో యురేనియం, థోరియం వంటి శక్తి వనరుల వినియోగం ప్రధానంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, పరిశ్రమల అభివృద్ధిలో అణుశక్తిని వినియోగించేందుకు ఆయన ప్రాధాన్యతనిచ్చారు. విదేశీ ఆధారాన్ని తగ్గించి, స్వదేశీ శక్తి, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యతనిచ్చారు.

భాభా శాస్త్రవేత్తగా మాత్రమే కాకుండా ఒక సంపూర్ణ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా ప్రసిద్ధి చెందారు. ఆయనకు సంగీతం, చిత్రలేఖనం, మరియు కళలపై ప్రత్యేక ఆసక్తి ఉంది. భాష పట్ల ఆయనకు ఉన్న ఆసక్తి ఆయనను ఆంగ్లం, ఫ్రెంచ్, మరియు ఇతర భాషల్లో నిపుణుడిగా మార్చింది. 1966 జనవరి 24న స్విట్జర్లాండ్‌లో జరిగిన విమాన ప్రమాదంలో భాభా మరణించారు. ఆయన మరణం భారత శాస్త్రరంగానికి తీరని నష్టం. ఆయన స్థాపించిన సంస్థలు (TIFR మరియు BARC) భారతదేశ శాస్త్ర రంగానికి కీలక కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. హోమీ జహంగీర్ భాభా భారతదేశ శాస్త్రరంగంలో తారగా నిలిచారు. ఆయన కలలైన అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధి భారతదేశాన్ని ప్రపంచంలో ప్రధాన స్థానంలో నిలిపింది. భాభా శ్రద్ధ, పట్టుదల, దూర దృష్టి భారత శాస్త్ర రంగానికి మార్గనిర్దేశం చేస్తూ, దేశ అభివృద్ధికి చిరస్థాయిగా ప్రేరణనిస్తుంది. “హోమీ జ హం గీర్ భాభా పేరు భార త శాస్త్రరంగ చరిత్రలో సుదీర్ఘకాలం వెలుగొందుతుంది.”



సంగనబట్ల
9440595494

# బాలికల సాధికారత?

నేటి బాలికలే రేపటి కుటుంబ వెలుగుల దివ్వెలు. బాలికల విద్యా వికాసమే భవిష్యత్తు లింగ సమానత్వానికి సాధనం. బాలికలు శక్తివంతం అయితే సమాజం శక్తివంతం అయినట్లే. భారతాన్ని ఉన్నత స్థాయిలో చూడాలంటే నేటి బాలికలను విద్యావంతులను చేయాలి. ఒక్క బాలిక చదువు, ఆ కుటుంబానికే అక్షర వెలుగు. బాలికలను నిర్లక్ష్యం చేసిన సమాజం పలు సామాజిక సమస్యలతో చచ్చుబడి పోతుంది. బాలిక బలహీనమైతే రేపటి తరం కూడా రోగాలమయం అవుతుంది. లింగ అసమానతల విష వలయంలో చిక్కిన నేటి బాలిక జీవితం ప్రశ్నార్థకంగా మారుతున్నది. నేటి సమాజంలో మహిళాశక్తిని రుజువు చేసిన అతివలు ఎందరో నేటి బాలికలకు ప్రేరణగా నిలుస్తున్నారు. బాలికల విద్యతోనే సమాజ ఉన్నతి సాధ్యపడుతుందని నినదించిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిభాయ్ పూలే నేటి బాలికలకు ఆదర్శం. దేశ ప్రధానిగా ధైర్యసాహసాలను ప్రదర్శించిన ఇందిరా గాంధీ, సరోజినీ నాయుడు, రాణి ఝాన్సీ లక్ష్మి భాయి, రాణి రుద్రమదేవి, అహల్యాభాయి హోల్కర్, మేరీ కోమ్, ఇందిర నూయి, నిర్మల సీతారామన్, నీతా అంబానీ, సుష్మా స్వరాజ్, సానియా మిర్జా లాంటి ఎందరో మహిళలు తమ సత్తాను చాటుకొని సమాజాభివృద్ధికి అవిరళ కృషి చేశారు.

### భారత బాలికలను వేధిస్తున్న ప్రధాన సమస్యలు:

అమ్మాయి అంటే అత్తింటికి పోయేదే అని, బాలిక ఇంటి పని మనిషి మాత్రమే అనే భావనలు నేటికీ తల్లితండ్రుల్లో నెలకొని ఉండడం విచారకరం. బాలురతో సమానంగా పెంచాల్సిన బాలికలను తల్లితండ్రులే చిన్న చూపు చూడడం క్షమించరానంత నేరం. బాలికలను కార్మికులుగా మార్చడం, అవిద్య, పెంపకంలో నిర్లక్ష్యం, లింగ వివక్ష, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, బలవంతంగా పులుపు వృత్తిలోకి నెట్టడం, శారీరక మానసిక హింస, లింగ నిష్పత్తి పడిపోవడం, కనీస అవసరాల కొరత, వ్యక్తిగత అపరిశుభ్రత, నిరుద్యోగం, వంటింట్లోనే బందీ చేయడం, వరకట్న సమస్యలు, పోషకాహార లోపం, ద్వితీయ శ్రేణి పౌరురాలిగా పెంచడం, గర్భంలో బాలిక ఉందని తెలిసి భ్రూణ హత్యలు, గృహ హింస, ఆర్థిక అసమానతలు లాంటి పలు సవాళ్ల నడుమ భారతీయ బాలికలు బక్కచిక్కి పోతున్నారు.

# నైపుణ్యం కొరతలో యువత

ప్రపంచ మానవాళి చరిత్రను మార్చి సానుకూలంగా వ్రాయగలిగేది నేటి విద్యావేత్త తరం మాత్రమే. ప్రపంచ దశ దిశలకు మార్చగలిగే సామర్థ్యం విద్యావంతులకు ఉంటుంది. రేపటి సమాజ స్థితిగతులను నిర్ణయించే శక్తియుక్తులు నేటి మేధావులు, శాస్త్రజ్ఞులకు మాత్రమే ఉంటుందని గత చరిత్ర ఏకరువు పెడుతున్నది. ప్రతి విద్యావంతుడు ఓ మహత్తర శక్తి అవుతాడు. మేధావి ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక శక్తివంతమైన వ్యవస్థ. సమాజ గతిని తమకు అనుకూలంగా మార్చగలిగే ధీరుడు విద్యావేత్త. విద్య లేని వాడు వింత పశువు అన్నారు. కత్తి కన్న కలం గొప్పది అని కూడా విన్నాం. దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యతో ప్రమాణీకరించడం పరిపాటి అయ్యింది. వ్యక్తి, కుటుంబ, దేశ, ప్రపంచ ప్రగతికి బాటలు వేయగలిగేది నాణ్యమైన విద్య మాత్రమే. విద్యతో వివేకం తోడైతే ప్రపంచం మనకు సలాం కొడుతుంది. బుద్ధిలేని నిరక్షరాస్యుడి కన్న అనైతిక విద్యావంతుడు అతి ప్రమాదకరం కాబట్టి విద్యతో పాటు మానవీయ విలువలు కూడా తోడు కావాలి. నేడు బాలురతో పాటు బాలికల విద్యకు సమాన ప్రాధాన్యం ఇవ్వబడుతున్నది. మహిళ/బాలికల నిర్బంధ ఉచిత విద్యకు పెద్ద పీట వేయాలి. చదువు, నైపుణ్యాల ద్వారానే మానవ సంస్కృతీ వారసత్వాలు వెలుగొందుతాయి నమ్మాలి.

### విద్య ప్రయోజనాలు అనేకం:

విద్య ప్రయోజనాల జాబితాలో వ్యక్తిత్వం వికాసం, ఆకర్షణీయ వేతనంతో కూడిన ఉద్యోగం, సమాజాన్ని జాగృత పరచడం, పేదరికాన్ని తరిమేయడం, అసమానతలను తొలగించడం, నాణ్యమైన జీవితాన్ని గడపడం, మానవీయ విలువలను జీర్ణించుకోని ఆచరణలో పెట్టడం, సమాజంలో గౌరవాన్ని పొందడం, కుటుంబ అభివృద్ధికి దోహదపడడం, చక్కటి జీవనశైలిని పాటించడం, ఆలోచనల్లో విస్తృతి కలగడం, సంభాషనాచాతుర్యం పెరగడం, నాయకత్వ లక్షణాలు అలవడడం, శారీరక మానసిక సమతుల్యత సాధించడం, సన్మార్గంలో నడుస్తూ ప్రజలకు దిశ నిర్దేశనం చేయడం, సద్గుణాలను ఆకలింపు చేసుకోవడం, నైపుణ్యాలను వంటపట్టించుకోవడం, సరైన ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇవ్వగలగడం, ఆత్మవిశ్వాసం పెరగడం, సమాజంలో గౌరవం లభించడం, తార్కిక విశ్లేషణలు చేయగలగడం, ఆర్థిక ప్రగతి నమోదు కావడం, సామాజిక చైతన్యం, సాంకేతిక విప్లవం, సృజనశీల ఆలోచనలు జనించడం, ఆవిష్కరణలకు ఊతం ఇవ్వడం, దేశాభివృద్ధిని కాంక్షించడం లాంటి అనేక ఉపయోగాలు ఉన్నాయి.

### అంతర్జాతీయ విద్యా దినోత్సవం-2026 ఇతివృత్తం:

“విద్యార్థి కేంద్రిత విద్య” లేదా “స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్” ప్రాధాన్యతను ప్రచారం చేయడం, సృజనశీలతను ఆహ్వానించడం, విలక్షణ ఆలోచనలకు ఊతం ఇవ్వడం, సమ్మిళిత విద్యా విధానానికి పునాదులు వేయడం, నైపుణ్యాల పెంపుకు పట్టం కట్టడం, వ్యక్తిని మహత్తర శక్తిగా మార్చగలగడం నేటి విద్యా విధానానికి ఊపిరి కావాలి. విషయ పరిజ్ఞానానికి నైపుణ్యం తోడైతేనే వ్యక్తి సాంకేతిక ప్రతిభ మానవాళి శ్రేయస్సుకు దోహదపడుతుంది. నైపుణ్యం లేని విద్య సువాసన లేని పువ్వులాంటిదే అని గమనించి నేటి యువత విద్య, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలను సమాంతరంగా ఒట్టపట్టించుకోవాలి. విద్య ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడానికి ప్రతి ఏట 24 జనవరి రోజు “అంతర్జాతీయ విద్యా దినోత్సవం” పాటించడం 2018 నుంచి ఆనవాయితీగా మారింది. ఈ వేదికగా విద్య ప్రాధాన్యాన్ని వివరించే సదస్సులు/కార్యశాలలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, రీడింగ్ హాబిట్‌ను పెంచడం, విద్యావేత్తలను గుర్తించడం, విద్యలో రాణించిన యువతను సన్మానించడం, విద్యార్థులకు విద్య ప్రాధాన్య అంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించవచ్చు. అంతర్జాతీయ విద్యా దినోత్సవం-2026 ఇతివృత్తంగా “విద్య సహ-సృష్టిలో యువశక్తి (ది పవర్ ఆఫ్ యూత్ ఇన్ కో-క్రియోటింగ్ ఎడ్యుకేషన్)” అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.



### 3వ అతి పెద్ద భారత విద్యా వ్యవస్థ:

నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో భారత ప్రభుత్వం విద్యా ప్రాధాన్యాన్ని గుర్తించి సర్వశిక్షా అభియాన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, నూతన విద్యా విధానం-2000 లాంటి పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత్‌లో అక్షరాస్యత రేడు 77.7 శాతం మాత్రమే ఉన్నది. మన దేశంలో అక్షరాస్యత రేటు కేరళలో అత్యధికంగా 96.9 శాతం, అత్యల్పంగా బీహార్‌లో 61.8 శాతం నమోదు అవుతున్నది. తెలంగాణలో 72.8 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 66.8 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. గ్రామీణ భారతంలో 73.5 శాతం, పట్టణ ప్రాంతాల్లో 87.7 శాతం అక్షరాస్యత నమోదు అవుతుండగా, పురుషుల్లో 84.7 శాతం, మహిళల్లో 70.3 శాతం నమోదు అవుతున్నది. ప్రపంచంలో 3వ అతి పెద్ద విద్యా వ్యవస్థ కలిగిన భారతంలో మొత్తం 1,338 యూనివర్సిటీలు, 70,000లకు పైగా ఉన్నత విద్యా కళాశాలలు/సంస్థలు ఉన్నాయి. అందులో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 483 రాష్ట్ర యూనివర్సిటీలు, 146 డీమ్డ్ యూనివర్సిటీలు, 529 ప్రైవేట్ యూనివర్సిటీలు, 1.5 మిలియన్ల పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల విద్యను 260 మిలియన్లు అభ్యసిస్తున్నారు. భారత ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 28.4 శాతంగా నమోదు అవుతున్నది. ప్రతి లక్ష జనాభాకు బీహార్‌లో 7 కళాశాలలు, తెలంగాణలో 59 కళాశాలలు ఉండగా దేశంలో సగటున 28 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి అమెరికాలో 13:1, చైనాలో 20:1 ఉండగా భారత్‌లో మాత్రం 30:1గా ఉన్నది. దేశంలో 30 శాతం కళాశాలలు మాత్రమే గుర్తింపు పొందగా, 45 శాతం యూనివర్సిటీలు మాత్రమే గ్రేడ్స్ పొందాయి. ప్రపంచ అత్యుత్తమ 1000 యూనివర్సిటీల్లో భారత్‌కు చెందిన 91 యూనివర్సిటీలు ఉన్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. భారత్‌లో విద్యా వ్యవస్థ కొంత వరకు గాడి తప్పినట్లు, నాణ్యతలకు తిలోదకాలిస్తూ, నైపుణ్య విద్యను గంగలో కలపడం వల్ల భారత యువత నిరుద్యోగ కోరల్లో చిక్కి అసహనాన్ని, ఆవేశాన్ని, అశాంతిని వ్యక్తం చేస్తున్నది. గుణాత్మక విద్యను త్యాగం చేస్తూ పరిమాణాత్మక మెరుపులకే మురిసి పోతున్న భారతీయ విద్యా వ్యవస్థను పట్టాలపైకి తీసుకురావలసిన సమయం ఆసన్నమైంది. యువ భారతానికి డిజిటల్ మెరుగులు దిద్ది, నైపుణ్య బుద్ధులు నేర్పి అంతర్జాతీయ స్థాయి టెక్నోక్రాట్స్, సైంటిస్టులు, అధ్యాపకులు, పలు రంగాల్లో శాసించగల మేధావులను తయారు చేసే నూతన గుణాత్మక విద్య విధానం కావాలని, ప్రభుత్వాలు ఆ దిశలో పటిష్ట అడుగులు వేయాలని కోరుకుందాం. అందరికీ అంతర్జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం



## మూడు కిలోల వెండితో 'వివాహ ఆహ్వాన పత్రిక'



బంగారంతో పోటీపడుతూ వెండి ధర రోజురోజుకూ కొండెక్కుతున్న తరుణంలో రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన శివ్ జోహారీ.. తన కుమార్తె వివాహం కోసం మూడు కిలోల స్వచ్ఛమైన వెండితో ప్రత్యేక ఆహ్వాన పత్రికను తయారు చేయించడం విశేషం. మొత్తం 128 విడిభాగాలతో రూపొందిన ఈ పత్రికలో కనీసం ఒక్క మేకు లేదా స్క్రూ కూడా వాడలేదు. చేతితో దీని తయారీకి ఏడాది సమయం పట్టింది. దాదాపు రూ.25 లక్షలు ఖర్చు అయినట్లు అంచనా. వినాయకుడు, శివపార్వతులు, శ్రీరాముడు, తిరుమల బాలాజీ, అష్టలక్ష్ములతోపాటు 65 దేవతా విగ్రహాలు, దేవుడి ద్వార పాలకులను ఇందులో పొందుపరిచారు. 86.5 అంగుళాల కొలతలతో 3 అంగుళాల లోతు గల పెట్టెగా దీన్ని సిద్ధం చేశారు. తన కుమార్తె శ్రుతి జోహారీ పెళ్లి చిరస్మరణీయంగా ఉండాలని ఇలా తయారు చేయించినట్లు శివ్ జోహారీ తెలిపారు.

## పాఠశాలలకు బాంబు బెదిరింపులు!



గణతంత్ర దినోత్సవానికి ముందు.. పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టిస్తోంది. నోయిడాలోని శివనాడార్ స్కూల్‌తో సహా అహ్మదాబాద్‌లోని పలు పాఠశాలలకు ఈ బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు తనిఖీలు ప్రారంభించారు.

అహ్మదాబాద్‌లో పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే బాంబు స్క్వాడ్ సిబ్బందితో ఆయా స్కూళ్లకు వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఇటు నోయిడా స్కూల్‌కి కూడా బెదిరింపు మెయిల్ అందిన వెంటనే యాజమాన్యం అప్రమత్తమైంది. విద్యార్థులను పాఠశాల నుంచి బయటకు పంపించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ప్రారంభించాయి. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని.. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు తెలిపారు. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

## నావల్లే 800 ఉరిశిక్షలు ఆగాయి



తన వల్లే ఇరాన్‌లో 800లకు పైగా నిరసకారుల మరణ శిక్షలు ఆగాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖ ప్రాసిక్యూటర్ మొహమ్మద్ మొవాహెది స్పందించారు. అవన్నీ అబద్ధాలన్నారు. నిరసనకారులకు సామూహిక మరణ శిక్ష విధించాలనే నిర్ణయమే తమ ప్రభుత్వం తీసుకోలేదన్నారు. ఎవరికీ ఉరిశిక్షలు విధించలేదని తెలిపారు. అరెస్టు చేసిన వారి సంఖ్య కూడా అంత మొత్తంలో లేదన్నారు. దీనిపై తప్పుడు వార్తలు, ప్రకటనలను ప్రచారం చేయొద్దని అంతర్జాతీయ మీడియా వర్గాలకు సూచించారు.



ట్రంప్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌లోని వందల మంది నిరసనకారులకు విధించిన ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి వల్ల అక్కడి అధికారులు రద్దు చేశారని పేర్కొన్నారు. తాను కల్పించుకోకపోయి ఉంటే 800 మందికి పైగా ప్రాణాలు కోల్పోయేవారని.. వారి ఉరిశిక్షలను తానే ఆపానని తెలిపారు. తీవ్ర చర్యలు తీసుకుంటానని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవర్గం వెనక్కి తగ్గిందన్నారు.

## ప్రీ వెడ్డింగ్ షూట్‌లపై సామాజిక యుద్ధం



భారతీయ సమాజంలో ఎంతో ఔన్నత్యమున్న పెళ్లి వేడుకల్లో పాశ్చాత్య పోకడలు, రీల్స్ మోజు ఎక్కువ అవుతున్నాయని.. ఇవి మన మర్యాదలకు విరుద్ధమని ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని సామాజిక సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద బిజినెస్ ప్యాకేజీలా మారిన ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు కనీసం రూ.50,000 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతోంది. మధ్యతరగతి కుటుంబాలకు ఇది అదనపు భారమని తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తమ సామాజిక వర్గంలో ఈ షూట్‌లను పూర్తిగా నిషేధిస్తున్నట్లు రాష్ట్ర సాహు సంఘం జాయింట్ సెక్రటరీ ప్రదీప్ సాహు పేర్కొన్నారు. మన నాగరిక సమాజానికి ఇవి విరుద్ధమని కుంబీ సమాజ్ అధ్యక్షుడు రంజిత్ భావు సైతం మండిపడ్డారు. విడాకుల కేసుల్లో ఈ షూట్‌ల ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలోకి వస్తే అమ్మాయిల భవిష్యత్తుకు పెద్ద ప్రమాదమని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ కిరణ్మయి నాయక్ హెచ్చరించారు. ఈ షూట్‌లతో సామాజిక అనర్థాలు జరుగుతున్నాయని రాష్ట్రంలోని ధంగర్ సమాజ్ కార్యదర్శి ఆశిష్ ధంగర్, సిక్కు సమాజ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ నిరసన వ్యక్తం చేశారు.

## జమ్మూ కాశ్మీర్‌లో భారీ హిమపాతం

### పర్యాటకులను ఫిదా చేస్తున్న వందే భారత్ జర్నీ



జమ్మూ కాశ్మీర్‌లో భారీ హిమపాతం కురుస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా మరింత సుందరంగా కనిపిస్తోంది. ముఖ్యంగా మంచు కొండలు, చినాబ్ బ్రిడ్జ్ మీదుగా సాగే వందే భారత్ ప్రయాణం అద్భుతంగా మారింది. ప్రపంచ స్థాయి ఇంజనీరింగ్ టెక్నాలజీతో నిర్మించిన ఈ మార్గంలో ప్రయాణించేందుకు చాలా మంది టూరిస్టులు ఆసక్తి చూపిస్తున్నారు. మంచు భారీగా కురవడంతో విదేశాల్లో ఎలాంటి సన్నివేశాలు కనిపిస్తుంటాయో అలాంటి సన్నివేశాలే ఇప్పుడు జమ్మూకశ్మీర్ లోనూ కనిపిస్తున్నాయి.

గురువారం నుండి రెండు పశ్చిమ ద్రోణి తుఫాన్లు ఈ ప్రాంతాన్ని సమీపించడంతో వాతావరణంలో మార్పులు వచ్చాయి. ప్రస్తుతం అక్కడ 2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రాబోయే కొద్దిరోజుల్లో గుల్మార్గ్, పహల్గామ్, అనంతనాగ్, కుల్గామ్, షోపియన్ మరియు సోనామార్గ్ లాంటి ప్రాంతాలలో తేలికపాటి నుండి భారీ హిమపాతం కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దిగువ లోయలలో కూడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతాల్లో వాహనాలకు అంతరాయం ఏర్పడగా రాబోయే రోజుల్లో అది మరింత పెరగవచ్చని జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఐదేళ్ల చిన్నారిని నిర్బంధించిన ఇమిగ్రేషన్ అధికారులు!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం.. వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఐదేళ్ల చిన్నారిని ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించడం తీవ్ర కలకలం రేపుతోంది. మిన్నెసోటాలోని ప్రీస్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న ఆ చిన్నారిని, అతడి తండ్రిని ఫెడరల్ అధికారులు అదుపులోకి తీసుకొని, వారిని టెక్సాస్‌లోని ఓ నిర్బంధ కేంద్రానికి తరలించారని ప్రీస్కూల్ సిబ్బంది, బాధిత కుటుంబ న్యాయవాది పేర్కొన్నారు.

స్కూల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నిర్బంధించిన బాలుడి పేరు లియామ్ కోనెజో రామోస్‌గా పేర్కొన్నారు. 2024లో ఈ చిన్నారి కుటుంబం అమెరికాకు వలస వచ్చిందని తెలిపారు. బహిష్కరణకు సంబంధించి వారికి ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదన్నారు. ఇమిగ్రేషన్ అధికారులు బాలుడిని లక్ష్యంగా చేసుకున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతినిధి ట్రిసియా మెక్‌లిఫ్లిన్ స్పందించారు. చిన్నారి తండ్రి అడ్రియన్ అలెగ్జాండర్ కోనెజో అరియాస్ ఈక్వెడార్ జాతీయుడని పేర్కొన్నారు. దేశంలో చట్టవిరుద్ధంగా ఉంటున్న అతడిని.. అదుపులోకి తీసుకునేందుకు ఇమిగ్రేషన్ అధికారులు ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. పిల్లాడి భద్రత కోసం ఓ అధికారి అతడితోనే ఉన్నట్లు వివరించారు.

పిల్లాడి నిర్బంధంపై వస్తున్న విమర్శలపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందిస్తూ.. ఇమిగ్రేషన్ అధికారులు చిన్నారి తండ్రిని మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారన్నారు. ఇక, ఈ ఘటనను యూఎస్ మాజీ ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ తీవ్రంగా ఖండించారు. ఇది తనను తీవ్రంగా కలచివేసిందని ఆమె ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## ఖైదీల మధ్య చిగురించిన ప్రేమ..

# పెళ్లికి ఎమర్జెన్సీ పెరోల్



హత్యానేరం కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న ఇద్దరు ఖైదీల మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న జంట ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. వారి అభ్యర్థనకు కోర్టు అంగీకరించడంతో పెరోల్‌పై బయటకు వచ్చినవారు నేడు ఒకటి కాబోతున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే?

డేటింగ్ యాప్‌లో పరిచయమైన వ్యక్తిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ప్రియాసేథ్ అనే యువతి 2018 నుంచి జైపుర్‌లోని సంగనేర్ ఓపెన్ జైల్లో శిక్ష అనుభవిస్తోంది. ఐదుగురిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన హనుమాన్ ప్రసాద్ అదే జైల్లో 2017 నుంచి శిక్ష అనుభవిస్తున్నాడు. ఆరు నెలల క్రితం వీరి మధ్య ప్రేమ చిగురించింది. పెళ్లితో ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నారు. తాము వివాహం చేసుకోవడానికి పెరోల్ ఇవ్వాల్సిందిగా రాజస్థాన్ హైకోర్టు ను ఆశ్రయించారు. దీంతో న్యాయస్థానం 15 రోజుల అత్యవసర పెరోల్ ఇచ్చింది. ప్రస్తుతం పెరోల్‌పై బయటకు వచ్చిన ఈ జంట రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఈరోజు వివాహం చేసుకోనుంది.

**ఏ కేసుల్లో జైలుకెళ్లారంటే...**

తన ప్రేమికుడు చేసిన అప్పును తీర్చడానికి పథకం వేసిన ప్రియ డేటింగ్ యాప్‌లో పరిచయమైన ఓ యువకుడిని ఇంటికి పిలిచి, కిడ్నాప్ చేసింది. అనంతరం ఆమె ప్రియుడు, మరో స్నేహితుడితో కలిసి బాధితుడి తండ్రికి ఫోన్ చేసి రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేసింది. అతడు రూ.3 లక్షలు మాత్రమే ఇచ్చాడు. యువకుడిని విడుదల చేస్తే ఈ విషయం ఎక్కడ బయటపడుతుందనే భయంతో అతడిని హత్య చేశారు. ఆ మృతదేహాన్ని సూట్‌కేస్‌లో పెట్టి కొండ ప్రాంతంలో పడేశారు. మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. హనుమాన్ ప్రసాద్ ఓ వివాహితతో అక్రమ సబంధం పెట్టుకున్నాడు. వారి బంధానికి అడ్డొస్తున్నారనే కోపంతో మహిళ భర్తను, పిల్లలను వారితో కలిసి ఉంటున్న మరో బంధువును వేట కొడవలితో నరికి చంపాడు. ఈ కేసులో సదరు మహిళను, హనుమాన్ ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

## మోడీజీ దీనిపై దృష్టి పెట్టండి..

భారత్ పై అమెరికా విధిస్తున్న సుంకాలతో వస్త్ర పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని ప్రధాని మోడీ మాట్లాడాలంటూ కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేశారు. వీడియోలో రాహుల్ గాంధీ వస్త్ర పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడారు. పలు విషయాలను వారితో చర్చించారు. అమెరికా విధిస్తున్న 50శాతం సుంకాలు, అనిశ్చితి భారతదేశ వస్త్ర ఎగుమతిదారులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్డర్లు తగ్గడంతో ఉద్యోగాల కోత, ఫ్యాక్టరీల మూసివేత మన డెడ్ ఎకానమీని సూచిస్తున్నాయని తెలిపారు. 4.5 కోట్లకు పైగా ఉద్యోగాలు, లక్షలాది వ్యాపారాలు ప్రమాదంలో ఉన్నప్పటికీ మోడీ ఎలాంటి ఉపశమనం కల్పించడం లేదన్నారు.

## ఇరాన్ దిశగా అమెరికా సైన్యం



ఆందోళనకారులను అణచివేస్తోన్న ఇరాన్‌పై సైనిక చర్యకు సిద్ధమైన అమెరికా.. చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ దేశంలో ఉద్రిక్తతలు చల్లారకపోవడంతో ఇరాన్ పాలకులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. ఇప్పటికే ఇరాన్ చుట్టూ భారీ నౌకాదళాన్ని మోహరించామని.. అమెరికాలోని అతిపెద్ద సైన్యం ఆ దేశం వైపు కదులుతోందని పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో ఆ దేశానికి ఎలాంటి నష్టం జరగకూడదని తాను భావిస్తున్నప్పటికీ ఇంకా ఉద్రిక్తతలు సద్దుమణగట్లేవన్నారు. అక్కడి పరిస్థితులను తాము నిశితంగా పరిశీలిస్తున్నామని, ఇక ముందు ఏం జరుగుతుందో వేచి చూద్దామన్నారు. అధ్యక్ష భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లోని

### మరోసారి ట్రంప్ హెచ్చరికలు

వందల మంది నిరసనకారులకు విధించిన ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి వల్ల అక్కడి అధికారులు రద్దు చేసిన విషయాన్ని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ విషయంలో తాను కల్పించుకోకపోయి ఉంటే ఇరాన్‌లో 800 మందికి పైగా నిరసనకారులు తమ ప్రాణాలు కోల్పోయేవారని.. వారి ఉరిశిక్షలను తాను ఆపానని తెలిపారు. వారిని ఉరితీస్తే ఇరాన్‌పై తీవ్ర చర్యలు తీసుకుంటానని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవర్గం వెనక్కి తగ్గిందన్నారు.

## డబ్ల్యూహెచ్‌వో నుంచి వైదొలిగిన అమెరికా

### రూ.2వేల కోట్లు బకాయిపడిన అగ్రరాజ్యం



**వాషింగ్టన్:** అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ అధికారికంగా వైదొలిగింది. కొవిడ్ మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలుచేయడంలో డబ్ల్యూహెచ్‌వో విఫలమైందని అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం తెలిపింది. ఇకపై డబ్ల్యూహెచ్‌వోకు అమెరికా నుంచి వచ్చే అన్నిరకాల నిధులు నిలిపివేస్తున్నామని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాని అన్ని కార్యాలయాల నుంచి యూఎస్ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు వెల్లడించింది. ఈ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా వైదొలుగుతున్నట్లు తెలిపింది. ఇకనుంచి పరిమిత పరిధి మేరకు డబ్ల్యూహెచ్‌వోతో కలిసి పనిచేయనున్నట్లు యూఎస్ ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలు సందర్భాల్లో ఆ సంస్థ నుంచి వైదొలుగుతామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా అగ్రరాజ్యం తన నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. అయితే డబ్ల్యూహెచ్‌వో నుంచి అగ్రరాజ్యం వైదొలిగే సమయానికి అమెరికా దానికి 260 మిలియన్ డాలర్ల (రూ.2,382 కోట్లు) బకాయిలను చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక వెల్లడించింది.

ఈ విషయంపై డబ్ల్యూహెచ్‌వో అధికారులు మాట్లాడుతూ.. సంస్థ నుంచి వైదొలుగుతున్నట్లు అమెరికా వెల్లడించగానే సరిపోదని.. సంస్థకు బకాయిపడిన 260 మిలియన్ డాలర్లను చెల్లించేవరకు డబ్ల్యూహెచ్‌వో నుంచి యూఎస్ ఉపసంహరణ పూర్తి కాదన్నారు. అయితే ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెల్లించాల్సిన బకాయిలపై అమెరికా అధికారిక వర్గాలు స్పందిస్తూ.. సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలను పూర్తిగా చెల్లించాలనే చట్టబద్ధమైన నియమమేమీ లేదన్నారు.

### మెడికల్ సీటు కోసం

## పాదం నరుక్కున్న విద్యార్థి!



డాక్టర్ కావాలని కలలు కనే విద్యార్థులు.. వాటిని సాకారం చేసుకునేందుకు కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తారు. కానీ, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ విద్యార్థి మాత్రం వక్రమార్గాన్ని ఎంచుకున్నాడు. రెండు సార్లు నీట్ ప్రవేశ పరీక్ష రాసి విఫలమైన అతడు.. దివ్యాంగుల కోటాలో తేలికగా సీటు పొందవచ్చని భావించి తీవ్ర చర్యకు దిగాడు. ఇందుకోసం తన పాదాన్నే నరుక్కున్నాడు. చివరకు అతడి ప్రయత్నం బెడిసికొట్టడంతో పోలీసుల కేసు ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని జౌన్‌పుర్‌కు చెందిన సూరజ్ భాస్కర్ (20) ఇటీవల తీవ్రంగా గాయపడ్డాడు. గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి పారిపోయారని, పాదం తెగిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడని అతడి సోదరుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు.. సూరజ్ ఇచ్చిన వాంగ్మూలంలో అనేక లోపాలు కనిపించాయి. అతడి ఫోన్‌ను పరిశీలించగా.. అందులో ఓ మహిళ నంబర్ తొలగించి ఉండటం మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. అతడి డైరీలోనూ "2026లో నేను డాక్టర్ అవుతాను" అని రాసి ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు కొనసాగించిన అధికారులకు షాకింగ్ విషయం తెలిసింది.

వైద్య విద్య ప్రవేశ పరీక్ష ను రెండు సార్లు రాసిన సూరజ్.. అర్హత సాధించలేకపోయాడు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనై ఎలాగైనా సీటు పొందాలని భావించాడు. దివ్యాంగుల కోటాలో తేలికగా సీటు సాధించవచ్చని అనుకున్నాడు. ఇందుకోసం ఓ పాదాన్ని తొలగించుకున్నాడు. ప్రమాదంలో ఇదంతా జరిగిందని నమ్మించేందుకు.. గుర్తుతెలియని దుండగులు దాడి చేశారనే కట్టుకథ చెప్పినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో అతడిపై ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలనే దానిపై న్యాయ సలహా తీసుకుంటున్నట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం అతడు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## రిపబ్లిక్ డే పరేడ్ కవాతులో ఈయూ బృందం!



దిల్లీ: ఈసారి రిపబ్లిక్ డే వేడుకలు అంతర్జాతీయంగా కీలకంగా మారనున్నాయి. ఈ ఉత్సవాల్లో ఐరోపా సమాఖ్య బృందం కవాతులో పాల్గొనుంది. భారత్‌తో సంబంధాలను మరింత మెరుగుపర్చుకునేందుకు ఈయూ నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. ఇటీవల గ్రీన్‌లాండ్ అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహరించిన తీరు ప్రపంచ నేతలను కలవరానికి గురి చేసిన సంగతి తెలిసిందే.

# భావితరాల నాయకుడు నారా లోకేష్

- ఘనంగా జన్మదిన వేడుకలు
- సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించిన నాయకులు, కార్యకర్తలు













**విజయవాడ జనవరి 23 వుదయం న్యూస్ బ్యూరో:** - నారా లోకేష్ భావితరాల నాయకుడని, ఎన్టీఆర్ మనవడిగా, చంద్రబాబు తనయుడిగా రాష్ట్ర రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీని మరో 40 సంవత్సరాలు నడిపే సత్తా ఉన్న నాయకుడు నారా లోకేష్ అని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం అశోక్ నగర్ లోని తూర్పు తెదేపా కార్యాలయంలో మంత్రివర్యులు నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్, ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ హాజరై రక్తదాతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ రక్తదాన శిబిరంలో పెద్దఎత్తున యువత పాల్గొని 110 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, కిలారు నాగశ్రావణ్, షేక్ షరీఫ్, బాలినేని నాని, పెద్ది అన్నారావు, గాలిమేల, మల్లెల రామకృష్ణ, అబ్దుల్ కరీమ్, మల్లెల లక్ష్మీ నారాయణ, తాడిబోయిన బాబూరావు, బుజ్జి, సిరాజ్, రాజేష్, రామకృష్ణ, కృష్ణప్రసాద్, హనీఫ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదురుపల్లి బస్టాండ్‌లో..

**ఆత్మకూరు రూరల్ చేజర్ల (వుదయం ప్రతినిధి) జనవరి 23వ తేదీ** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో, కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు సూచనలతో చేజర్ల మండలం ఆదురుపల్లి బస్టాండ్లో విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బీద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు నారా లోకేష్‌ను యువ నాయకుడిగా కొనియాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతకు ఆయన మార్గదర్శకుడని అభిప్రాయపడ్డారు. విద్య, ఐటి రంగాల్లో తీసుకుంటున్న వినూత్న నిర్ణయాలు యువత భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీటీసీ బీద వెంకటయ్య, చేజర్ల మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ షావాజ్ ఖాన్, కార్యదర్శి సలీం, టిడిపి సీనియర్ నాయకులు పీర్ల వెంకటయ్య, గల్లా పుల్లయ్య, చెన్నం శెట్టి అంకయ్య, నాశన పెంచలయ్య, గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### చేజర్లలో ఘనంగా..

**ఆత్మకూరు రూరల్ చేజర్ల (వుదయం ప్రతినిధి) జనవరి 23వ తేదీ** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వర్యులు ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో, ఆత్మకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కిమ్స్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు సూచనలతో ఈ రోజు మండల కేంద్రమైన చేజర్ల లో నవ్యాంధ్ర భవిష్యత్తు రథ సారథి రాష్ట్ర ఐటీ మరియు విద్యా శాఖ మంత్రి వర్యులు శ్రీ నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం లో ప్రత్యేక పూజ కార్యక్రమం అనంతరం బస్టాండ్ సెంటర్ ఆవరణంలో కేక్ కట్ చేసి స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు అందజేసిన మండల తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు. మాజీ ఎంపీపీ రావి పెంచల రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు భూదత్త రఘు రాఘవరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రావి లక్ష్మి నరసా రెడ్డి. ఆర్య వైశ్య నాయకులు పువ్వాడి శ్రీనివాసులు. దేవతి సుబ్బారావు. దేవతి రమేష్, బొగ్గవరపు సుధాకర్. బీసీ నాయకులు రంపాటి పుల్లయ్య. బొరిగర్ల రాజకృష్ణ. మారాల జనార్దన్ నాయుడు. శేషయ్య నాయుడు. ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ దావూద్. షేక్ మస్తాన్ షరీఫ్. సయ్యద్ ఇస్మాయిల్ బిమానులు పాల్గొన్నారు.

### తెలుగుదేశం నాయకులు

**ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) జనవరి 23వ తేదీ** రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ ఆనం రామ నారాయణ రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు పట్టణం లోని మునిసిపల్ బస్టాండ్ మరియు అన్న క్యాంటీన్ దగ్గర నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్న క్యాంటీన్ లో మూడు పూటలా ఉచిత అన్నదాన కార్యక్రమం ఆత్మకూరు సబ్ జైలు వద్ద ఉచిత పండ్లు, బ్రెడ్ లా పంపిణీ చేసిన ఆత్మకూరు పట్టణ నాయకులు. పాల్గొన్న ప్రతి పార్టీ సభ్యునికి ధన్యవాదాలు తెలిపిన ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి.

### గద్దె అనూరాధ, గద్దె క్రాంతి

**విజయవాడ జనవరి 23 వుదయం న్యూస్ బ్యూరో:** - సమాజానికి సేవ చేసే అవకాశం రావడమే గొప్ప వరమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ భావిస్తున్నారని, అలాంటి గొప్ప నాయకుడు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ పటమటలంక ఏరియాలోని 'చైల్డ్ ఎయిడ్ ఫౌండేషన్' ఆవరణలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పాల్గొని కేక్ కట్ చేయడంతో పాటుగా విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి క్రాంతి శ్రీ, చలసాని రమణ, సుగసాని రత్నశ్రీ, దయాల శిరీషా గాంధీ, అన్నాబత్తుల శ్రీదేవి, దేవేంద్ర, పఠాన్ హయతీఖాన్, నర్రా కిషోర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పెనమలూరు తెదేపా కార్యాలయంలో..

**విజయవాడ జనవరి 23 వుదయం న్యూస్ బ్యూరో:** - తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా మరియు ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించటమైనది. నియోజకవర్గంలోని యువతతో మానవహారం ఏర్పాటు చేసి నారా లోకేష్ జన్మదిన శుభాకాంక్షలను పెనమలూరు నియోజకవర్గ యువ నాయకులు బోడే వెంకట్ రామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు, వికలాంగులకు త్రిచక్ర సైకిళ్ళు, విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పెనమలూరు నియోజకవర్గ యువ నాయకులు బోడే వెంకట్ రామ్ కూటమి నాయకులు, పాల్గొన్నారు.

### మండల టీడీపీ ఆధ్వర్యంలో..

**అవనిగడ్డ జనవరి23 (వుదయం ప్రతినిధి):** కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడుల సాధనకు నారా లోకేష్ విస్తృత కృషి చేస్తున్నారని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం అవనిగడ్డ గాంధీ సెంటరులో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు మండల టీడీపీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మండలి వెంకట్రామ్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు నినాదాల ద్వారా నారా లోకేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, టీడీపీ జిల్లా కార్యదర్శి అవనిగడ్డ ప్రకాశం, డీసీ ఎంఎస్ డైరెక్టర్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, కొత్తపేట, మెరకనపల్లి, అవనిగడ్డ పీఏసీఎస్ చైర్మన్లు యలవర్తి చిన్న, యర్రంశెట్టి సుబ్బారావు, మాదివాడ రత్నారావు, టీడీపీ అవనిగడ్డ టౌన్ ప్రెసిడెంట్ అన్నపరెడ్డి లక్ష్మినారాయణ, మాజీ వైస్ ఎంపీపీ లుక్కా పిచ్చియ్య, నాయకులు మండలి రామ్మోహనరావు, బడే సుబ్బారావు, బచ్చు మల్లి, మొగల్ మురాద్ బెగ్, షేక్ జబీర్, ఖలీల్, శ్రీనివాసరావు, గుగ్గిలం శ్యామ్ కుమార్, నారేపాలెం శివరామ కృష్ణ, సిద్ధాబతిన హరినాధబాబు, కమ్మిలి సాయి భార్గవ, కొతవరపు వెంకటేశ్వరావు, దేగల రాఘవ, పిరాటి రాంబాబు, మొగావత్ గోపి, పసుపులేటి కృష్ణలాల్, సామర్ల శ్రీను, మొగావత్ శ్రీను, మండలి వెంకటేశ్వరావు, తుంగల వసంతరావు, పులిగడ్డ బాలు శ్రీనివాస్, వాహిదుల్లా పాల్గొన్నారు.

**విజయవాడ జనవరి 23 వుదయం న్యూస్ బ్యూరో:** -తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకులు నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు ఒక వినూత్నమైన సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.కంకిపాడు పట్టణ పరిధిలోని పది అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు పొందుతున్న బీద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద పిల్లలకు లబ్ధి చేకూరేలా ప్లాస్టిక్ చాపలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులు సౌకర్యవంతంగా కూర్చోవడానికి, నిద్రపోవడానికి దోహదపడుతుందంటూ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్. జేబి సుకన్య చిన్నారుల తరుపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యలమంచిలి కిషోర్ బాబు మాట్లాడుతూ... పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ స్ఫూర్తితో, నారా లోకేష్ జన్మదినం వంటి శుభ సందర్భాల్లో తనకు వీలయినంతలో దాతృత్వ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం వ్యక్తిగతంగా ఆనందదాయకమని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం, విద్య, సౌకర్యం కోసం చేపట్టే ఇలాంటి చిన్న చిన్న ప్రయత్నాలు దీర్ఘకాలంలో పెద్ద పెద్ద మార్పులను తీసుకొస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కంకిపాడు పట్టణ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

### టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

**కడప, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ ఆధ్వర్యంలో కడపలోని యోగివేమన యూనివర్సిటీ లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు మరియు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలేష్ మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి, యువగళం పాదయాత్రతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన లోకేష్ పోరాట పటిమ మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వై వి యు టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు భరత్, ఇంచార్జ్ కార్యదర్శి అమృత్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చేతన్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్, హాండ్స్ ఫర్ యు వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టపోగుల సుబ్బారావు, టిఎన్ఎస్ఎఫ్ వై వి యు నాయకులు యశ్వంత్, శ్రావణి, చింతకొమ్మ దిన్నె రమేష్, వంశీ, సురేష్ రెడ్డి, ఉమర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### దగదర్తిలో నారా లోకేష్ ..

**కావలి, జనవరి 23, వుదయం న్యూస్:** నియోజకవర్గం లోని దగదర్తి గ్రామ రోడ్డు సెంటర్ నందు దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాలేపాటి లోకేష్ ఆధ్వర్యంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మాలేపాటి రవీంద్ర నాయుడు, కంచర్ల సునీల్ ఆదేశాల మేరకు వైభవంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ముందుగా నేతలు మాలేపాటి సుధాకర్, లోకేష్ సారథ్యంలో భారీ స్థాయిలో బాణాసంచా పేల్చి, మాలేపాటి స్వగృహం నుండి బైక్ ర్యాలీగా వెలుపోడు రోడ్డు సెంటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడ భారీ కేక్ ను కట్ చేసి పార్టీ శ్రేణులకు, తరలివచ్చిన ప్రజలకు పంచిపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా మాలేపాటి లోకేష్ మాట్లాడుతూ... ఈ సందర్భంగా రాష్ట్ర ఐటి మరియు విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ జన్మదినం దగదర్తి మండల ప్రజానీకం సమక్షంలో జరుపుకోవడం ఆనందంగా ఉందని, మా అందరి తరపున నారా లోకేష్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ

**కావలి, జనవరి 23, వుదయం న్యూస్:** కావలి నియోజకవర్గంలో ఘనంగా మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా చేపట్టారు. శుక్రవారం కావలి ఏరియా వైద్యశాలలో ఘనంగా జరిగిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నేత, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా చేశారు. సందర్భంగా కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా మాట్లాడుతూ కాబోయే యువ దర్శకుడు, ముఖ్యమంత్రి గా లోకేష్ ను చూస్తామన్నారు. రాక్షస పాలన నుంచి విముక్తి కలిగించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సాగుతుందన్నారు. సందర్భంగా లోకేష్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు, పళ్ళు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, భాజపా నేతలు పాల్గొన్నారు.

---

## పులిగడ్డ గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాలి

### సర్పంచ్ దాసరి విజయ్ కుమార్



**అవనిగడ్డ జనవరి23 (వుదయం ప్రతినిధి):** పులిగడ్డ గ్రామపంచాయితీ పరిధిలో గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వినూత్నంగా ఆలోచించి సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ మరియు పంచాయతీ ఈవో బి.అనిత కలసి బస్టాండ్ , పంచాయతీ ఆఫీస్ , వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, మెయిన్ సెంటర్లో మరియు పలుచోట్ల ప్రజలకు అవగాహన కలిగే విధంగా చెత్తను రోడ్ల మీద పడవేయకుండా డస్ట్ బిన్ లోనే వేయాలని అవగాహన కలిగే విధంగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేసి ఈ సందర్భంగా సర్పంచ్ విజయ్ మాట్లాడుతూ పులిగడ్డ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే కర్తవ్యంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి పీఎం స్వనిధి వరం

- కడపలో పీఎం స్వనిధి మెగా చెక్ పంపిణీ
- ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి



**కడప, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి. కడప నగరంలోని వీధి వ్యాపారులు ఆర్థికంగా ఎదిగి, స్వయం సమృద్ధి సాధించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని గాంధీనగర్ స్కూల్ రోడ్డులో గల మెప్మా కార్యాలయంలో నిర్వహించిన ప్రధాన మంత్రి వీధి విక్రేతల ఆత్మనిర్భర్ నిధి 2.0 కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కడప కార్పొరేషన్ పరిధిలోని 8109 మంది వీధి విక్రయదారులకు రూ. 20.30 కోట్ల భారీ మెగా చెక్కును అందజేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. చిరు వ్యాపారులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బందులు పడకుండా, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేష్, పాలకొండయ్య స్వామి టెంపుల్ చైర్మన్ రెడ్డయ్య యాదవ్, నాయకులు సుధాకర్ రెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు స్టేట్ బ్యాంకు సౌజన్యంతో ఆర్థిక చేయూత



**కావలి, జనవరి 23, వుదయం న్యూస్:** ప్రమాదంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులకు ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజన ద్వారా రెండు లక్షలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం కావలి రూరల్ మండలం బట్లదిన్నె గ్రామంలో కార్యక్రమం బ్యాంకు అధికారులు చేపట్టారు. గ్రామానికి చెందిన హాజరత్తయ్య, యు శీనయ్య అనేవారు ప్రమాదంలో ఇటీవల ప్రమాదశాత్తు మరణించడం జరిగింది. వారికి సంబంధించి బ్యాంకులో అకౌంట్ ఉండటంతో భీమా చేసి ఉన్నది. బ్యాంక్ లో విచారించగా పి.యం.జె.జె.బి.వై ఇదరకి యాక్టివ్ లో ఉంది. అందుకుగాను బ్యాంకు లో క్లెయిమ్ చేశాము అని బ్యాంకు అధికారులు తెలిపారు. పి.యం.జె.జె.బి.వై ద్వారా రెండు లక్షలు రూపాయలు ఇదరకి వేరు వేరుగా నగదు సెటిల్మెంట్ అయ్యింది. ఈ బీమా ద్వారా రెండు లక్షల రూపాయలు చెక్కులను ఇరువురి భార్యలు అనూష, వరలక్ష్మి వారిద్దరికి చెక్కులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ లోకనాద్ మాట్లాడుతూ పి.యం.జె.జె.బి.వై బీమా మరియు పి.యం.ఎస్.బి.వై బీమాను అందరూ చేసుకోవాలని భవిష్యత్తులో జరిగే అకాల సంఘటనలకు మీ కుటుంబాలకి చేయూత కలిగే విధంగా భరోసా కల్పిస్తుంది అని తెలియ చేయడం జరిగింది. పై కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్, మరియు కావలి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ బొద్దు మదన్ కుమార్, సునాని రాజేష్, మరియు వివోఎ లక్ష్మి తదితరులు పాల్గొనడం జగిరింది.



## రోడ్డు మరమ్మతులు చేయండి

### ఎంపీజే డిమాండ్

**ప్రొద్దుటూరు, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** ప్రొద్దుటూరు పట్టణం రాజీవ్ సర్కిల్ నందు ఈ దినం మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆధ్వర్యంలో రాజీవ్ సర్కిల్ సమీపాన పైప్ లైన్ లీకేజీ వలన నీరు వృధాగా పోయి పెద్ద గొయ్యి ఏర్పడింది వెంటనే ప్రజా ప్రతినిధులు.అధికారులు వెంటనే స్పందించి పైప్ లైన్ లీకేజీని ముమ్మరతులు చేయాలని ప్రజలు మరియు మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. ఎంపీజే రాయలసీమ ఇన్చార్జ్ ఎండి అయుబ్ ఖాన్. 14వ వార్డు కౌన్సిలర్ జిలాని భాష. ఎంపీజే పట్టణ అధ్యక్షులు హుస్సేన్ బాషా. కార్యదర్శి రఫీక్. సభ్యులు నాయబ్ రసూల్. ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

---

## గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలను పరిష్కరించాలి

- గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి మనోజ్ కుమార్
- జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



**తిరుపతి, జనవరి 23, వుదయం ప్రతినిధి:** తిరుపతి జిల్లాలో గ్రామ రెవెన్యూ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ కు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి మనోజ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరుపతి కలెక్టరేట్ నందు జరిగిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నందు గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలు గురించి గ్రామ మరియు వార్డు సచివాలయాల డిపార్ట్మెంట్ కి రెవిన్యూ శాఖ కు ఉన్న సమన్వయ లోపాల గురించి అధికారులు ఇస్తున్నటువంటి మెమోలగురించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను గ్రామ రెవెన్యూ అధికారులకు ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వీఆర్ఓల పని భారాన్ని తగ్గించాలని కోరారు. సుమోటో సర్టిఫికెట్ ల ఇబ్బందుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని విజ్ఞప్తి చేశారు. అందరూ గ్రామ రెవెన్యూ అధికారులకు కామన్ డిడిఓగా తహశీల్దార్ ఉండాలని కోరారు. ఖాళీగా ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులకు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ రెవెన్యూ అధికారుల అన్ని సమస్యల గురించి తిరుపతి జిల్లా గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం క్లుప్తంగా వివరించి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ బాలాజీ రెడ్డి,జిల్లా అధ్యక్షులు ఆర్ నాగరాజు, స్టేట్ జాయింట్ సెక్రటరీ జి చెంగల్ రాయలు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి హేమంత్,జిల్లా కోశాధికారి జి భాస్కర్ ,జిల్లా ఆర్గ నైజింగ్ సెక్రటరీ యస్ జయ శంకర్ రెడ్డి కాళహస్తి డివిజన్ అధ్యక్షులు టి శంకరయ్య సూళ్లూరుపేట డివిజన్ అధ్యక్షులు కె రామకృష్ణ జిల్లా కార్యవర్గ సభ్యులు గ్రామ రెవిన్యూ అధికారులు సంఘ నాయకులు మురళి,శివ,సతీష్, తదితర గ్రామ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పలువురికి మండలి వెంకట్రామ్ పరామర్శ




**అవనిగడ్డ జనవరి23 (వుదయం ప్రతినిధి):** అవనిగడ్డ నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ శుక్రవారం పలువురిని పరామర్శించారు. కోడూరు మండలం వీ.కొత్తపాలెంలో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్న జనసేన పార్టీ నాయకుడు మాదాసు గోపాలరావును పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నీటి సంఘం అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, జనసేన పార్టీ నాయకులు యలవర్తి వెంకన్న, బాదర్ల చక్రపాణి, యలవర్తి వినోద్, పవన్, సనకా నరేంద్ర, మాజీ సర్పంచ్ ఆరిగ ఆంజనేయులు, యలవర్తి గోపీ తదితరులు ఉన్నారు. అనంతరం అవనిగడ్డ మండలం తుంగలవారిపాలెంలో పలువురిని పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకొంటున్న అందె గోపాలకృష్ణను పరామర్శించారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద కోలుకొంటున్న దోవారి శ్రీనును పరామర్శించారు. గంగు బాలాజీని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల బ్రెయిన్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద కోలుకొంటున్న గంగు నాగరాజు పరామర్శించారు.

## మంటల్లో సజీవ దహనమైన డ్రైవర్లకు నివాళి

### హెచ్పీసీఎల్ ట్రాన్స్ పోర్ట్ అధ్యక్ష కార్యదర్శులు రవిశంకర్ రెడ్డి, వేమ నారాయణరెడ్డి



**కడప, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** రోడ్డు ప్రమాదాలలో మృతి చెందిన డ్రైవర్ల కుటుంబాలకు ప్రభుత్వం, 50 లక్షల రూపాయలను అందించాలని, ప్రమాదంపై విచారణ జరిపించాలని, హెచ్ పీసీఎల్ ట్యాంకర్ ట్రాన్స్పోర్ట్ అధ్యక్ష, కార్యదర్శులు రవిశంకర్ రెడ్డి వేమా నారాయణరెడ్డి లు డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా సిరివెళ్ల వద్ద రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన డ్రైవర్లకు సంతాపం తెలిపి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దస్తగిరి మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా.. కూటమి ప్రభుత్వం

- నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్



**అవనిగడ్డ జనవరి23 (వుదయం ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని అవనిగడ్డ నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం కోడూరు పీఏసీఎస్ కార్యాలయంలో రైతులకు మూడు శాతం రిబేట్ లబ్ది పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మండలి వెంకట్రామ్ విచ్చేసి రైతులకు బ్యాంకు ఖాతాల్లో రిబేట్ జమ పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని రైతుల్లో 2023-24 సీజన్ రుణాలు చెల్లించిన రైతులు 741మందికి ప్రభుత్వం రూ.13,46,244లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సొసైటీ ద్వారా గత ఖరీఫ్ సీజనులో అత్యధికముగా 467మంది రైతుల నుంచి 27,688.6 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.6,61,31,003 లు చెల్లించినట్లు వివరించారు. ప్రకృతి విపత్తు సమయంలోను ఈ సొసైటీ ద్వారా ప్రభుత్వ అధికారులు రైతులకు అండగా నిలిచారని తెలిపారు. రైతు శ్రేయస్సు ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం సొసైటీ సభ్య రైతులు తాతా వెంకటస్వామి, దేవనబోయిన భావన్నారాయణ, సింగం సుబ్రహ్మణ్యం, అద్దంకి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా వారి మట్టి ఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు సొసైటీ ఆధ్వర్యంలో రూ.10వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని వెంకట్రామ్ చేతులమీదుగా అందచేశారు. సొసైటీ చైర్మన్ పూతబోయిన కరుణ కుమార్, సీఈఓ అర్జా నగరాయలు, పర్సన్లు పూతబోయిన శ్రీనివాసరావు, మల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మర్రె గంగయ్య, జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, లింగారెడ్డిపాలెం సొసైటీ చైర్మన్ కోట సుబ్బారావు, మాజీ ఎంపీపీలు మాచర్ల భీమయ్య, పెద్ది భాస్కరరావు, ఏఎంసీ డైరెక్టర్లు మంగళగిరి శ్రీనివాసరావు, జరుగు ఆదినారాయణ, మాజీ ఎంపీటీసీ బడే వీరబాబు, నాయకులు పూతబోయిన సీతారత్న సాయిబాబు, బడే వీర వెంకటేశ్వరరావు, కాగిత రామారావు, తోట రాంబాబు, బడే హనుమంతరావు, నాగం బాపయ్య, పెద్ది బాబూరావు, పిల్లి మల్లి, సుబ్బయ్య, శ్రీను పాల్గొన్నారు.

## నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను



**ప్రొద్దుటూరు, జనవరి 23, (వుదయం ప్రతినిధి)** నాకు రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను అని నినదించి, బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ధీరుడు.భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాట పటిమను, దేశభక్తిని రగిలించిన ఆజాద్ హింద్ ఫౌజ్ అధినేత, శ్రీ నేతాజీ సుభాష్ చంద్ర బోస్ గారి జయంతి సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు వంకదార నరేంద్ర రావు ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ నేతాజీ కి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీశ్రీ భారతీయ జనతా పార్టీ నాయకులు భూమి రెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కంబగిరి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పరమేశ్వర రావు సుధాకర్ రెడ్డి , నాగ మునిరెడ్డి, పుల్లారెడ్డి, ప్రశాంతు, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి గూగుల్ గంగాధర్ రెడ్డి, చలపతి రావు,రాగాల రమణయ్య,, గురివిరెడ్డి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

**కోదాడ, జనవరి 23 (వుదయం) :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం కోదాడ పట్టణంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నాయకులు భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. లోకేష్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోదాడ నియోజక వర్గ కమిటీ సభ్యులు ముత్తినేని సైదేశ్వర్ రావు, ఓరుగంటి ప్రభాకర్, సీనియర్ నేత, మాజీ పట్టణ అధ్యక్షుడు గుళ్ళపల్లి సురేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు కొల్లు వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణ, పిట్టల శోభన్ బాబు, చావ శ్రీనివాసరావు, నారాలోకేష్ యువసేన అధ్యక్షుడు కోదాడ రేవంత్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు ముంతా రవికుమార్, బాలకృష్ణ, అనంతగిరి మండల ఉపాధ్యక్షులు పిటుకూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



**దమ్మపేట, జనవరి 23 (వుదయం) :** రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అప్పారావుపేట సిబ్బందికి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్యంగా హెల్మెట్, కార్ సీట్ బెల్ట్ ధరించడం, ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అశ్వారావుపేట సిఐ నాగరాజు, దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, దమ్మపేట పోలీస్ సిబ్బంది మరియు అప్పారావుపేట ఆయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మందమర్రిలో సామూహిక హనుమ సింధూర అర్చనలు



**మందమర్రి, జనవరి 23 (వుదయం) :** మందమర్రి పాల చెట్టు ప్రాంతంలోని పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక హనుమ సింధూర అర్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 23 హనుమాన్ జన్మదిన పూర్వాభాద్ర నక్షత్రం, వసంత పంచమి, శుక్రవారం కలిసి వచ్చిన శుభముహూర్తాన్ని పురస్కరించుకొని స్వామివారి కృపా కటాక్షాలు సిద్ధించాలని పట్టణంలోని మహిళ భక్తులతో హనుమాన్ సింధూర అర్చన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. సీతమ్మ నుదుటన ధరించిన సింధూరంతో శ్రీరామచంద్ర స్వామి క్షేమంగా ఉంటాడని తెలుసుకున్న హనుమంతుడు ఒళ్లంతా సింధూరం ధరించి భక్తిని చాటుకున్నాడని, పవిత్రమైన వసంత పంచమి రోజు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని చెప్పారు.

# విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత





**ఖమ్మం, జనవరి 23- వుదయం బ్యూరో:** విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించిందని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం 43వ డివిజన్ బాలాజీ నగర్ లో 2 కోట్ల 43 లక్షలతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనాన్ని, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... రోగాలతో అనేక ఇబ్బందులతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలతో సిబ్బంది ప్రేమ ఆప్యాయతలతో ప్రవర్తించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలలో పచ్చని మొక్కలు పెంచాలని, ఆసుపత్రి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మంచి విద్య, వైద్య అవకాశాలతో ఖమ్మం ప్రశాంత నగరంగా అభివృద్ధి చెందాలని, విద్య, వైద్య రంగాలను రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని అన్నారు. రూ.2 వేల 200 ఇందిరమ్మ ఇళ్లను ఖమ్మం నగరంలో అర్హులైన పేదలకు ఇవ్వనున్నామని త్వరలో మరో రూ.2 వేల 500 ఇండ్లు మంజూరుకి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఖమ్మంలోనే మార్కెట్ వద్ద రోడ్డుపై నివసిస్తున్న 28 పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించి రోడ్డు విస్తరణ చేశామని మంత్రి తెలిపారు. రోడ్డు విస్తరణలో ఎక్కడైనా భవనాలు కోల్పోతే వారికి పది రెట్లు పరిహారం అందిస్తామని అన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలలో గుడిసెలు వేద్దామని అధికారంలో ఉన్న నాయకులు ప్రయత్నించిన అధికారులు ఒప్పుకోవద్దని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రూ.2 కోట్ల 43 లక్షలతో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించామన్నారు. ప్రజలు ప్రతి చిన్న అవసరానికి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదని, చిన్న, చిన్న జ్వరం కేసులు, రక్త పరీక్షలు వంటి సేవలు హెల్త్ సెంటర్ వద్ద తీసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. స్థానిక జనాభా పరిధిలో గర్భిణులకు సంబంధించి 100 శాతం ఏ.ఎన్.సి. చెకప్ ఇక్కడి నుంచి జరగాలని కలెక్టర్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. ఏ.ఎన్.సి. చెక్ అప్‌లతో పాటు ప్రసవాలు, కొత్తగా పుట్టిన శిశువులకు టీకాలు కూడా 100 శాతం ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో జరిగేలా కృషి చేయాలని అన్నారు. వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, స్థానిక కార్పొరేటర్ డి. జ్యోతి రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# పౌరులుగా మన బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించాలి

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**నా భారత దేశం - నా ఓటు అనే థీమ్ తో ఓటర్ దినోత్సవం**

**జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఓటర్ల ప్రతిజ్ఞ**



**ఖమ్మం, జనవరి 23 వుదయం బ్యూరో :** పౌరులుగా మన బాధ్యతలను తప్పకుండా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేసే దిశగా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరు నిస్వార్ధంగా స్వేచ్ఛతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించేందుకు ఈ జాతీయ ఓటరు దినోత్సవాన్ని వినియోగిస్తామని అన్నారు. ప్రజాస్వామ్యంలో బాధ్యత గల పౌరులుగా దేశ అభ్యున్నతిలో మన భాగస్వామ్యం ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఉద్యోగులతో కలిసి ఓటర్ ల ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో కార్మికుల సమస్యలు ప్రస్తావిస్తా

**ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**



**దమ్మపేట, జనవరి 23 (వుదయం) :** దమ్మపేట మండలం మందలపల్లి సెంటర్ నందు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు పరిసరాల పరిశుభ్రతలో భాగంగా వీధులను శుభ్రం చేస్తున్నారు. అటువైపు నుంచి వెళుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వారిని గమనించి వారి వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యే చీపురు పట్టుకుని రోడ్ల వెంట చెత్తను తొలగిస్తూ శుభ్రత పనుల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని, అసెంబ్లీ వేదికగా కార్మికుల సమస్యను ప్రస్తావిస్తానని వారికి భరోసా ఇచ్చారు. పారిశుధ్య కార్మికులు గ్రామాల పరిశుభ్రత కోసం చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని తెలిపారు. ఎండా వానా తేడా లేకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కార్మికులు చేస్తున్న కృషికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు

**జైపూర్ ప్రెస్ క్లబ్**

**జైపూర్, జనవరి23(వుదయం)** జైపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వేద పండితులతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గోదరి కరుణాకర్ ఆధ్వర్యంలో అఖిలా భారత జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నూతనంగా ఎన్నికైన తాళ్లపల్లి రమేష్ గౌడ్‌ని శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ క్లబ్ సభ్యులు ఎల్కాటూరి నరేష్, మోతె సాయి బాబా, రామగిరి రాము, దుర్గాప్రసాద్, కనుకుంట్ల సుభాష్, మల్లేష్, బీమా రాజు తదితరులు పాల్గొన్నారు.



## సంబురంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**పినపాక, జనవరి 23 (వుదయం) :** పండగ వాతావరణంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికుల సమక్షంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశం చేశారు. మేజర్ గ్రామపంచాయతీ సారపాక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, మండల అధ్యక్షుడు దుర్గంపూడి కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కాగా శుక్రవారం గృహప్రవేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక సుందరయ్య నగర్‌లో లబ్ధిదారులుగొల్లపల్లి కొమురయ్య, విజయ్ గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభోత్సవం చేసిన మేజర్ గ్రామపంచాయతీ సారపాక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్ నాయక్ మాట్లాడుతూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆశీస్సులతో నియోజవర్గంలో సొంతింటి కల నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో పులపల్లి సుధాకర్ రెడ్డి, వారాల వేణుకోమటిరెడ్డి మోహన్ రెడ్డి, రహీం ఖాన్మల్లి కృష్ణ, వార్డు మెంబర్ బట్టు రాములు తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- **నూతన మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్**

**రామకృష్ణాపూర్, జనవరి 23 (వుదయం) :** మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపేలా కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి సైతం ప్రాధాన్యత ఇస్తానని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ మారుతి ప్రసాద్ అన్నారు. శుక్రవారం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీకి నూతన మున్సిపల్ కమిషనర్‌గా మారుతి ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. రామగుండం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఏ మారుతీ ప్రసాద్ సాధారణ బదిలీల్లో భాగంగా క్యాతన్ పల్లి మున్సిపాలిటీకి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని, సిబ్బంది సైతం సహకరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పలువురు సిబ్బంది కమిషనర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలి

**కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి**



**మంథని జనవరి 23 (వుదయం)** ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ పాఠశాలలో మాఘ మాసంలోని శుద్ధ వసంత పంచమి సందర్భంగా శుక్రవారం చిన్నపిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యా ప్రదాయని చదువుల తల్లి సరస్వతికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరము వసంత పంచమి రోజున సరస్వతి పుట్టినరోజు కావడం వల్ల సరస్వతి పిల్లలందరూ అక్షరాభ్యాసం చేయించుకోవడం వల్ల సరస్వతి మాత అనుగ్రహం కలుగుతుందన్నారు. పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షిస్తూ వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి. స్రవంతి, పావని, విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



- **మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి**

**మహబూబాబాద్, జనవరి 23 (వుదయం) :** రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల మోదుగులగూడెం పిల్లలకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కగా పాటించడం, జీబ్రా క్రాసింగ్ లను వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేయడం, రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు.

# వ్యవసాయం..విజ్ఞానం

**రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

**సూర్యాపేట పర్యటనలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**రైతులు, విద్యార్థులతో ముఖాముఖి**



**సూర్యపేట, జనవరి 23 (వుదయం) :** వ్యవసాయం ఒక విజ్ఞానమని" ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదం ప్రస్తుతం జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ ,జై అనుసంధాన్ గా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి లో శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సతీ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు,అధికారులు గవర్నర్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికరు. వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి లబ్ధిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద వంద ఎకరాల్లో రూ. 150 కోట్లతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు. కోదాడ సమీపంలో రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం, మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో రూ. కోటితో యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్ కు, రూ. కోటితో నిర్మించతలపెట్టిన డార్మెటరీ భవనాలకు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ మాట్లాడారు. వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం సౌభాగ్యమన్నారు. రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కాలేజీ, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ రైతులకు రూ. 2.47కోట్లు విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రోసీడింగ్స్ పంపిణీ చేశారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ. 504 కోట్లు, ఆదాయ వనరుల ను పెంపొందించేందుకు మరో రూ. 89 కోట్ల చెక్కులు అందజేశారు.

**నదీ జలాల్లో తెలంగాణ హక్కులను పరిరక్షిస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

కృష్ణ, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ... నీటి వాటా సాధన కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఏపీ సహా మరెవరైనా సరే తెలంగాణ హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తే గట్టిగా ప్రతిఘటిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ. 50 లక్షలతో తెలంగాణఏపీల మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించినట్లు గుర్తు చేశారు. యాత్రికుల సౌకర్యార్థం భవిష్యత్తులో రూ. 80 కోట్లతో హుజుర్నగర్‌మట్టపల్లి రహదారి విస్తరణ పనులతో పాటు ఆలయ సన్నిధిలో డార్మిటరీ, వంటశాలా నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. చరిత్రాత్మక లక్ష్మీ నరసింహ స్వామి ప్రాశస్త్యాన్ని మరింత ఇనుమడింప చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్,శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతీ, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్.పి నరసింహ పాల్గొన్నారు.

## గవర్నర్‌కు మేడారం జాతర ఆహ్వానం

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



**ధర్మపురి, జనవరి 23 (వుదయం) :** ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు రావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. మేడారం జాతర సందర్భంగా శుక్రవారం లోక్ భవన్‌లో గవర్నర్‌తో మంత్రి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జాతర విశిష్టతను, భక్తుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లను గవర్నర్‌కు వివరించారు. అనంతరం జాతర అధికారిక ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. కోట్లాది మంది భక్తుల నమ్మకానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని మంత్రి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. దీనికి గవర్నర్ సానుకూలంగా స్పందించారు.

## రహదారి భద్రత.. మనందరి సమిష్టి బాధ్యత

**సిద్దిపేటలో ఘనంగా రహదారి భద్రతా అవగాహన సదస్సు**



**సిద్దిపేట, జనవరి 23 (వుదయం) :** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సిద్దిపేట జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రవాణా శాఖాధికారి వి.లక్ష్మణ్ సూచనల మేరకు, మోటర్ వాహన తనిఖీ అధికారి శంకర్ నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ సారథి రాజేష్, రవి నేతృత్వంలోని కళాబృందాలు తమ ఆటపాటలతో రహదారి నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారందరూ కళాకారుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి, తాము కూడా భద్రతా నియమాలను తప్పకుండా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మోటార్ వాహన తనిఖీ అధికారి శంకర్ నారాయణ మాట్లాడుతూ.. రహదారి భద్రత అనేది ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన విద్య అని, ఇది తోటి ప్రయాణికులందరికీ శ్రేయస్కరమని పేర్కొన్నారు. శిరస్త్రాణం ధరించడం, సీటు పట్టి ధరించడం, మద్యం మత్తులో వాహనం నడపకపోవడం మరియు ప్రయాణ సమయంలో చరవాణి మాట్లాడకపోవడం వంటి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో మెజారిటీ వాహన చోదకుల తప్పిదాల వల్లే జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమం చివరలో సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారి శ్రీకాంత్ రెడ్డి అందరితో రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది, కళాబృంద సభ్యులు పాల్గొన్నారు.

## సరస్వతి క్షేత్రంలో అక్షరాభ్యాస వేడుకలు

**– అమ్మవారి రథోత్సవం ఘనంగా నిర్వహణ**







**సిద్దిపేట, జనవరి 23 (వుదయం)** వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం చిన్నకోడూరు మండలం అనంతసాగర్‌లోని సరస్వతి క్షేత్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అక్షరాభ్యాసం చేయించేందుకు తల్లిదండ్రులు తమ చిన్నారులతో పెద్ద సంఖ్యలో హాజరై సరస్వతి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా భక్తులు సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.హైమావతి హాజరై సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులను అభినందించారు.వసంత పంచమి సందర్భంగా సరస్వతి అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి రథంపై ఊరేగించారు. గ్రామ వీధుల గుండా నిర్వహించిన రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి నామస్మరణతో వాతావరణాన్ని భక్తిమయంగా మార్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా చిన్నకోడూరు మండల పోలీస్ అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షించారు. చిన్నకోడూరు ఎమ్మార్వో, విలేజ్ సెక్రటరీలు కార్యక్రమ నిర్వహణలో చురుకుగా పాల్గొని సహకారం అందించారు. అదేవిధంగా సరస్వతి అమ్మవారి దర్శనానికి టీవీ సీరియల్ నటీమణులు కూడా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి దర్శనం భక్తుల్లో విశేష ఆకర్షణగా నిలిచింది. మొత్తంగా వసంత పంచమి సందర్భంగా సరస్వతి క్షేత్రంలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమం, అమ్మవారి రథోత్సవం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

వుదయం
www.voodayam.com




## ప్రతి పౌరుడు ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

**తహసిల్దార్ ముక్కలనూరి శ్రీనివాస్**

**రాయపర్తి, జనవరి 23 (వుదయం):** ప్రజాస్వామ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటర్‌గా తమ పేరు నమోదు చేసుకోవాలని మండల తహసిల్దార్ ఎం.శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 25న 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు ఓటర్లతో దేశ పౌరులుగా మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతాం. కులం, మతం, జాతి, వర్గం, భాషాపరమైన ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తా అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారే కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు వి ఎస్ శర్మ, ప్రవీణ్ రెడ్డి, ఉపేందర్, ఉపాధ్యాయులు బృందం, అంగన్వాడి టీచర్స్ చంద్రకళ, అయిత విజయరాణి, కృష్ణవేణి కవిత శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

## జాతర సక్సెస్ చేద్దాం!



**పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**హనుమకొండ, జనవరి 23 (వుదయం):** మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పోలీస్, ఆర్టీసీ అధికారులతో సమన్వయ సమావేశాన్ని శుక్రవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముందుగా గత జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలు, కారణాలతో పాటు, పోలీస్ మరియు ఆర్టీసీ సంయుక్తం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మేడారం జాతర ఆర్టీసీ శాఖ చేసిన ఏర్పాట్లపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాను పోలీస్ కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు మేడారం తరలి వస్తున్న భక్తుల రద్దీని గమనిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సి వుంటుందని, మేడారంకు వెళ్లే మార్గంలో బస్ నిలిపి వేసి ప్రయాణికులకు టికెట్లు జారీ చేయడ్దని, గతంలో సమస్యలు సృష్టించిన డ్రైవర్ల విధుల్లోకి తీసుకోవద్దు, డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఒక వేళ బస్ బ్రేక్ డౌన్ అయితే రోడ్డుపై నిలిచిన పోయిన బస్‌ను తక్షణమే మరమ్మత్తు చేసే విధంగా టెక్నీషియన్లను అందుబాటులో వుంచే విధంగా క్యాంప్‌లను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో ఏవైనా ట్రాఫిక్ అంతరాయం కలిగితే జాతరకు వెళ్లే బస్సులను ప్రత్యామ్నాయ మార్గాల నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టాలని గా పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు అంకిత్ కుమార్, దార కవిత, ఆర్టీసీ, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీలు సత్యనారాయణ, జితేందర్ రెడ్డి, జానీ నర్సింహులు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంలు భాను కిరణ్, మహేష్, డిపో మేనేజర్లు రవి చందర్, అర్పిత, ధర్మా సింగ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సీతారెడ్డి, వెంకన్న, సుజాత ఇతర పోలీస్, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం
# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**మత్తు పదార్థాల రవాణా వాడకంపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలి**
**విద్యాసంస్థలు బహిరంగ ప్రదేశాలలో విస్తృత ప్రచారం కల్పించాలి**
**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**





**మహబూబాబాద్, జనవరి 23 (వుదయం):** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సమావేశ మందిరంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సరిత, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్, సంబంధిత అధికారులతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పక్కా కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై జిల్లా స్థాయి నార్కోటిక్, నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదు అవుతున్న ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ నియంత్రణ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు వినియోగా నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీశాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ దుకాణాల్లో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని సూచించారు. చెడు అలవాట్లు వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాలలో మాదకద్రవ్యాల నిరోధక చర్యలు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. సంస్కృతిక సారధి సభ్యులచే, సోషల్ మీడియా ప్రింట్ ఎలక్ట్రానిక్ ప్రతినిధుల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటలిజెన్స్ విభాగం వారు ఆర్టీసీ బస్సులు, ట్రైన్స్ తదితర ప్రదేశాలలో నిత్యం తనిఖీలు నిర్వహించి నిఘా పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిరంజీవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజేష్, డాక్టర్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలను
# వైభవంగా నిర్వహించాలి

◆ **కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట, జనవరి 23 (వుదయం):** జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకలను పండగ వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాల్‌తో కలిసి ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలు కళ్ళకు కట్టేలా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవనం, సహకార, వైద్య ఆరోగ్యం, పోలీస్, ఫైర్, ఆర్టీసీ, ఫారెస్ట్, విద్యుత్, హౌసింగ్ తదితర 12 శాఖల శకటాలను సిద్ధం చేయాలన్నారు. అలాగే చేనేత, ఎస్సీ, బీసీ, ఎస్టీ కార్పొరేషన్లు, సంక్షేమ శాఖ, బ్యాంకర్స్, ఇరిగేషన్, మార్కెటింగ్, లేబర్, మిషన్ భగీరథ, సాంఘిక సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖ తదితర 15 శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, కార్యక్రమానికి వచ్చే అతిథులకు, విద్యార్థులకు, ప్రజలకు మరియు ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా షామియానా, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా మరియు తాత్కాలిక మొబైల్ టాయిలెట్స్ వంటి వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ కమిషనర్‌తో కలిసి పెరేడ్ గ్రౌండ్‌ను సందర్శించిన కలెక్టర్.. గ్రౌండ్ ముస్తాబు, పరేడ్ నిర్వహణ, శకటాల ప్రదర్శన, స్టాళ్లు, డయాస్ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్ఓ నాగరాజమ్మ, అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఆర్డీఓ సదానందం, కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారాన్ని నియోజకవర్గం చేయాలి

**జిల్లా మాజీ చైర్ పర్సన్ అంగోత్ బిందు**



**బయ్యారం, జనవరి 23 (వుదయం):** బయ్యారం మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా చేయాలని మహబూబాబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ అంగోత్ బిందు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నియోజకవర్గ సాధన సమితి కన్వీనర్ బానోత్ చందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ.. గార్ల, బయ్యారం, గంగారం, కొత్తగూడ, మండలాలను కలుపుతూ బయ్యారం మండల కేంద్రాన్ని నియోజకవర్గంగా ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. సమీప భవిష్యత్తులో పునర్విభజన జరిగితే బయ్యారాన్ని నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ సాధన కమిటీ సభ్యులు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోతు కిషన్ నాయక్, మాజీ ఎంపీటీసీ సనప సోమేష్, ఎనుగుల ఐలయ్య, తుమ్మల శ్రీనివాస్, మండలంలోని గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు. అనంతరం జేఏసీ నాయకులు మండల తాహశీల్దార్ నాగరాజుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ ఏర్పాటుకు సహకరించాలని నాయకులు కోరారు.

## విద్యార్థుల్లో పరిశోధకుని వెలికితీసేలా కృషి

**మండల విద్యాశాఖ అధికారి పురుషోత్తంరెడ్డి**



**జయశంకర్ భూపాలపల్లి, జనవరి 23 (వుదయం):** విద్యార్థుల్లో దాగి ఉన్న పరిశోధకుని వెలికి తీసేలా ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహదేవపూర్ మండల విద్యాశాఖ అధికారి పురుషోత్తంరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం మహాదేవపూర్ మండలంలోని సూరారం గ్రామ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ అవారణలో విద్యార్థిని విద్యార్థులకు టీ షర్ట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ మేకల శంకరమ్మ, ఉప సర్పంచ్ చల్ల చిన్నన్న ను పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేకల శంకరమ్మ, ఉప సర్పంచ్ చల్ల చిన్నన్న లు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. మండల విద్యాశాఖ అధికారి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే భావి భారత శాస్త్రవేత్తలు తయారవ్వాలనే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటలను నిజం చేసేలా ప్రభుత్వ పాఠశాలలలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు దానిలో భాగంగానే సూరారం పాఠశాలలో 140 మంది విద్యార్థులు విద్యాభ్యాసిస్తున్నారని వారిలో నాలుగు గ్రూపులుగా ఏర్పాటు చేసి విద్యార్థులలో ఉన్న పరిశోధకున్ని వెలికి తీసే విధంగా ఉపాధ్యాయుల కృషి చేస్తున్నారని అన్నారు నాలుగు విద్యార్థుల గ్రూపులకు సంబంధించి శాస్త్రవేత్తల పేర్లు పెట్టడం జరిగిందని విద్యార్థులకు సంబంధించి వారి తల్లిదండ్రులు గ్రామ పెద్దల సహకారంతో విద్యార్థులకు టీ షర్ట్ పాయింట్లు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసే గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేశ్వర దేవస్థాన మాజీ డైరెక్టర్ చల్లా కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మడక ప్రతాప్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ఏర్పాటు చేయండి



◆ **జిల్లా చైర్మన్‌కు గ్రామ సర్పంచ్‌ల వినతి**

**జయశంకర్ భూపాలపల్లి, జనవరి 23 (వుదయం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంతోపాటు పెద్దంపేట గ్రామంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని మద్దులపల్లి గ్రామ సర్పంచ్ సరిత, పెద్దంపేట గ్రామ సర్పంచ్ లావణ్య రాజయ్యలు జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబును కోరారు. ఈ సందర్భంగా మహాదేవపూర్ మండల కేంద్రంలోని గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ను సర్పంచులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామాలకు గ్రంథాలయలు ఏర్పాటు చేయాలని వినతిపెట్టగా, స్పందించిన చైర్మన్ కోట రాజబాబు సానుకూలంగా స్పందించి, అవసరమైన సామాగ్రి మరియు పుస్తకాలతో కూడిన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని గ్రామపంచాయతీలోనే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మద్దులపల్లి గ్రామ సర్పంచ్ సరితకు పెద్దంపేట సర్పంచ్ లావణ్య రాజయ్య, కు చైర్మన్ కోట రాజబాబు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలుగుల గ్రామ సర్పంచ్ గారే విజయలక్ష్మితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకంపోయింది



**దామెర, జనవరి 23 (వుదయం):** దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పోలేపాక ఆంద్రయ్య, పోలేపాక సదయ్యలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి గులాబీ కండువా కప్పుకున్నారు. శుక్రవారం దామెర మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్లే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని చల్లా ధర్మారెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోలేపాక ఆరోగ్యం, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

**వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి సత్యనారాయణ**
**నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు**



**నర్సంపేట, జనవరి 23 (వుదయం):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ నర్సంపేటలో భారత ఎన్నికల సంఘం, కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సూచనల మేరకు రాబోయే జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ఎన్నికల ప్రతిజ్ఞ కార్యక్రమంను నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని, తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ఎన్నికల ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను యువతకు అవగాహన కల్పించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమని, ప్రతి పౌరుడు తన ఓటును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ముఖ్యంగా యువత ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం ద్వారా మంచి పాలన సాధ్యమవుతుందన్నారు. ఎన్ ఎస్ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ యువ ఓటర్లు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తిగా నిలుస్తారని ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా ఓటు వేయడం ద్వారా బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, స్లోగాన్ రాసే పోటీలను జనవరి 24 రోజున నిర్వహిస్తున్నామని ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్, ఎన్ సి సి క్యాడెట్స్ పాల్గొన్నారు.

## యువజన మార్పిడితో దేశ సమైక్యత బలోపేతం



◆ **ఇవి.శ్రీనివాస్ రావు**

**హనుమకొండ, జనవరి 23 (వుదయం):** మై భారత్ వరంగల్, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమంలో భాగంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన 40 మంది యువతీ యువకులు ఉమ్మడి వరంగల్ జిల్లాని సందర్శించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు, వడ్డేపల్లి పల్ల రవీందర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన యువత మధ్య పరస్పర అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇవి.శ్రీనివాస్ రావు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ... భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలతో సమృద్ధిగా ఉందని, ఇలాంటి యువజన మార్పిడి కార్యక్రమాలు దేశ సమైక్యత, జాతీయ ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. యువత దేశ భవిష్యత్తు అని, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మై భారత్ - వరంగల్ ఉప సంచాలకులు శ్రీ చింతల అన్వేష్, వాలంటీర్లు సురేష్, నవీన్, కర్ణాటక రాష్ట్ర యువజన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు వెళ్లే భక్తులు జాగ్రత్తగా వాహనాలు నడపాలి





◆ **జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

**జయశంకర్ భూపాలపల్లి, జనవరి 23 (వుదయం):** మేడారం జాతరకు వెళ్లే భక్తులు అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడపాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. మేడారం జాతర సందర్భంగా భక్తుల రాకపోకల సౌలభ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శుక్రవారం నార్లాపూర్ నుంచి భూపాలపల్లి, నార్లపూర్ నుంచి కాల్వపెల్లి మీదుగా కాటారం వరకు ఎగ్జిట్ మార్గాన్ని పరిశీలించారు. జాతర నుంచి తిరిగి వచ్చే వాహనాలు సాఫీగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణించేలా రహదారి పరిస్థితులను పరిశీలించి, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా జాతర విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందికి మెస్ సౌకర్యాలు, నివాస ఏర్పాట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా ఉండేలా చూడాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మేడారం నుంచి నార్లాపూర్ మీదుగా భూపాలపల్లి వచ్చే మార్గంలో మూల మలుపులు అధికంగా ఉన్నందున వాహనదారులు అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. మూల మలుపుల వద్ద వాహనదారులకు ముందుగా హెచ్చరికలు అందించేలా అవసరమైన ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే జాతర సమయంలో పశువులను, రోడ్లపైకి రాకుండా చూడాలని వాటివల్ల రోడ్డు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున వాటిని రాకుండా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జాతర సందర్భంగా రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రమాదాల నివారణకు భక్తులు, వాహనదారులు పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

◆ **డిపిఓ యాదగిరి**



**కోదాడ, జనవరి 23 (వుదయం):** గ్రామ సర్పంచులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూర్యాపేట జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి అన్నారు. ఈనెల 19 నుంచి 23 వరకు 5 రోజులు పాటు మొదటి విడుతలో నిర్వహించిన చిలుకూరు, కోదాడ, నడిగూడెం, హుజూర్ నగర్, అనంతగిరి, చింతలపాలెం, మేళ్లచెరువు మండలంలోని గ్రామాలలో నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమం సందర్భంగా సర్పంచులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ.. గ్రామంలో సమస్యలను పరిష్కరించడంలో సర్పంచులు ప్రత్యేక చొరవచూపాలని, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని కోరారు. శిక్షణలో పాల్గొని పూర్తిస్థాయిలో విజయవంతం చేసిన సర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట, కోదాడ డివిఎల్‌పిఓలు నారాయణరెడ్డి, పార్థసారథి, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్.. ఆదివాసీల హత్యలు

**బీజేపీ మతోన్మాద ఫాసిస్టు పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టండి**
**ప్రగతిశీల సమాజ నిర్మాణానికి పోరాడండి**
**పోటు రంగారావు, గుమ్మడి నర్సయ్య**
**ఘనంగా ప్రారంభమైన పీడీఎస్‌యూ రాష్ట్ర 23వ మహాసభ**
**భారీ విద్యార్థి ర్యాలీ, బహిరంగ సభ**




**ఖమ్మం జనవరి 23 (వుదయం):** దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ శక్తులు కలిసి దేశానికి బిగిస్తున్న కుల మతోన్మాద ఫాసిస్ట్ పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి విద్యార్థి, యువతపైనే ఉన్నదని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్త రామదాసు కళాక్షేత్రంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటీ పృథ్వీ అధ్యక్షతన 'విద్యార్థి బహిరంగ సభ' జరిగింది. ఈ బహిరంగ సభలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల అశోక్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయి బోలాలు ముఖ్య వక్తలుగా హాజరై మాట్లాడారు. 79 సంవత్సరాల స్వాతంత్ర పాలనలో ప్రభుత్వాలు పార్లమెంట్, అసెంబ్లీలో చేసిన చట్టాలు, తీసుకువచ్చిన సంస్కరణలు పేద, మధ్యతరగతి వర్గాలకు నేటికీ ఉచితంగా నాణ్యమైన సమాన విద్య, వైద్యం అందించడంలో విఫలమైనాయని తెలిపారు. దేశంలో ప్రశ్నించే గొంతులను అర్బన్ నక్సల్స్ అనే ముద్ర వేసి, జైలు పాలు చేస్తూ, చిత్రహింసలు పెడుతూ, ఆపరేషన్ కగార్ పేరిట అమాయక, ఆదివాసి గిరిజనులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో మతం ముసుగులో స్త్రీలపై దాడులు, అత్యాచారాలు చేసిన వారిని, బ్యాంకులను కొల్లగొట్టి ప్రజల డబ్బుతో విదేశాలకు పారిపోయిన బడా బాబులకు బిజెపి ప్రభుత్వం రక్షణ కల్పించడం సిగ్గుచేటని తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రపంచ దేశాలు అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతుంటే భారత విద్యార్థి, యువత శక్తి యుక్తులను నిర్వీర్యం చేస్తూ, దేశంలో బ్రాహ్మణీయ మనువాద తిరోగమన విధానాలను పున ప్రతిష్టించే చర్యలకు ఒడిగడుతున్నారన్నారు. నేటి విద్యార్థి, యువత సమాజంలో పాలకులు తీసుకు వస్తున్న దేశ వ్యతిరేక చర్యలను అడ్డుకోవాలన్నారు. విద్యార్థి అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రగతిశీల సమాజాన్ని స్థాపించుకోవాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, ఎర్ర అఖిల్ కుమార్, నరేందర్, గణేష్, సహాయ కార్యదర్శి సాయి, సురేష్, వి.వెంకటేష్, రాకేష్, కోశాధికారి మహేందర్, జే.ఎన్.యు.ఢీల్లీ పి.డి.ఎస్.యు. విద్యార్థినేత తిరుపతి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు అంగడి కుమార్, మునిగేల శివ ప్రశాంత్, బి.అజయ్, వి.కావ్య, పి.అనూష, దీక్షిత, సీతారాం, నాగరాజు, సాయి, మధుసూదన్, పాల్గొంటున్నారు.

# వసంత పంచమి వేడుకలు

## నెరేళ్ళ అరబిందో పాఠశాలలో వైభవంగా వసంత పంచమి వేడుకలు





**ధర్మపురి, జనవరి 23 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని నెరేళ్ళ గ్రామంలో వసంత పంచమి వేడుకలు అ త్యం త భక్తిశ్రద్ధలతో నిర్వహించా రు. స్థానిక అరబిందో పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చదువుల తల్లి సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.పాఠశాల కరస్పాం డెంట్ జాజాల రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా సర్పంచ్ కాసారపు. బాలాగౌడ్,ఉప సర్పంచ్ కసారపు కొమురయ్య,మాజీ ఎంపిటిసి రెడ్డవేణి సత్యం,అక్కనపెల్లి. బాబు, మెరుగు పరశురాం పాల్గొ న్నారు.అమ్మవారి విగ్రహానికి పూల మా లలు వేసి, అక్షరా భ్యాస కార్యక్రమాలను చేపట్టారు.వసంత పంచమిప్రాముఖ్య తను,విద్యార్థుల జీవితంలో విద్య యొక్క విలువను కరస్పాండెంట్ ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రుల గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**కలెక్టర్ పమేలా సత్పతి.**

**కరీంనగర్, జనవరి 23 వుదయం ప్రతినిధి :**



పొరపాట్లకు తావివ్వకుండా మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడి టోరియంలో జిల్లాలోని కరీంనగర్ నగ రపాలిక, హుజురాబాద్, చొప్పదండి , జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి టీఓటీ, ఆర్వో, ఏఆర్ఓ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హ్యాండ్ బుక్ ను క్షుణ్ణంగా చదవి నిబం ధనలు తప్పనిసరిగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిర్వ హణలో ఆర్వోల పాత్ర కీలకమన్నారు. నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి విషయం పరిశీలిస్తూ ఏఆర్ఓలు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ క్రాస్ చెక్ చేసుకుంటూ సమస్యలు తలెత్తకుండా ముందు చూపుతో వ్యవహరించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, నామినేషన్ల స్వీకరణ , స్క్రూటీని చేసే విధానం వివరించారు. ఏవైనా అనుమానాలు ఉంటే ఉన్నత అధి కారులను సంప్రదించి నివృత్తి చేసుకో వాలన్నారు.నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ న్సిపల్ ఎన్నికలవేళ అప్రమత్తంగా వ్యవహరిం చాలని సిబ్బందికి సూచించారు.ఆర్వోలు,ఏఆర్ఓలు తమ విధులను పక్కాగా నిర్వహించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**రంగారెడ్డి జిల్లా జనవరి 23 (వుదయం ప్రతినిధి):**

ప్రతి ఒక్కరు బాధ్యతగా ప్రతి ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కునువినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రా రెడ్డి అన్నారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్ర మంలో జిల్లాఅదనపు కలెక్టర్ కె.చంద్రా రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మన భారత దేశం ప్రపంచంలో అతిపెద్దదైన ప్రజాస్వామ్య దేశమని, ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని, ఓటు హక్కు విలువ మనతోపాటు, తోటివారికి తెలియజేయలన్నారు. ఓటును తాత్కాలిక ప్రలోభాలకు లొంగకుండాసద్వినియోగం చేసుకో వాలని సూచించారు. మన భవిష్యత్తును నిర్ణయించేఎన్నికల్లో మనమందరం బాధ్యతగా పాల్గొని ఓటుహక్కు వినియోగించు కోవాలన్నారు.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ 'భారత దేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపైవిశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత నిష్పక్షపాత




ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని మతం, జాతి, కులం వర్గం భాష లేదాఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటుచేస్తామని' వివిధ శాఖల అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లారెవెన్యూ అధికారి సంగీత, జిల్లా గ్రామీ ణాభివృద్ధి పిడి మరియు స్వీప్నోడల్ అధికారి శ్రీలత, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# రోకామ్ స్లామ్ సిద్దిపేట పోలీసుల సత్తా

## 8 మంది కానిస్టేబుళ్లకు ప్రతిష్టాత్మక మెడల్స్



**సిద్దిపేట, జనవరి 23 వుదయం :**

దేశవ్యాప్తంగా నిర్వహించిన నాలుగు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాల మారథాన్‌లను విజయవంతంగా పూర్తి చేసి, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ప్రోకామ్ స్లామ్' మెడల్స్ సాధించిన సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌కు చెందిన 8 మంది కానిస్టేబుళ్లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్ గారు ప్రత్యేకంగా అభినందించారు. ఒకే క్యాలెండర్ సంవత్సరంలో ముంబై (42.195 కి.మీ ఫుల్ మారథాన్), ఢిల్లీ (21.09 కి.మీ హాఫ్ మారథాన్), కోల్‌కతా (25 కి.మీ), మరియు బెంగళూరు (10 కి.మీ) మారథాన్‌లను నిర్ణీత సమయంలో పూర్తి చేసిన వారికి మాత్రమే ఈ అరుదైన 'ప్రోకామ్ స్లామ్' గౌరవం దక్కుతుంది. ఈ ఘనత సాధించిన వారిలో ఎం. రాజీ రెడ్డి, ఎ. హరికృష్ణ, పి. రమేష్ (ఐటీ సెల్), జి. అశోక్, ఎస్. గోపాల్ (సిద్దిపేట ట్రాఫిక్), ఈ. భానుచందర్, కె. జగదీష్ (ఏఆర్ కానిస్టేబుల్స్), మరియు కె. రమేష్ (తొగుట పీఎస్) ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. కఠిన మైన పోలీస్ విధుల్లో ఉంటూనే, శారీరక దృఢత్వం కోసం శిక్షణ పొంది జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గర్వ కారణమని కొనియాడారు. వీరి క్రమశి క్షణ మరియు పట్టుదల తోటి సిబ్బందికి, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## సమ్మక్క సారలమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : కలెక్టర్

- జనవరి 28 నుంచి 31 వరకు జాతర నిర్వహణ
- మిని మేడారంగా సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ
- గోదావరిఖని జాతర స్థలాన్ని ఎమ్మెల్యే తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్

**గోదావరిఖని, జనవరి, 23 వుదయం:**



సమ్మక్క సారలమ్మ జాతరకు కట్టుదిట్ట మైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ తో కలిసి గోదావరి ఖని సమక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జనవరి 28 నుంచి 31 వరకు నిర్వహించే సమక్క సారలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లను చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు రానున్నారని, 8 నుంచి 10 లక్షల వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థ దాదాపు 7 నుంచి 8 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ గోదావ రిఖని సమ్మక్క సారలమ్మ జాతరకు అవ సరమైన ఏర్పాట్లు చేసిందని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా మరో 2 కోట్ల రూపాయలను జాతర కోసం ఖర్చు చేశామని అన్నారు. భక్తుల వాహనా లకు సంబంధించిన పార్కింగ్ నుంచి మళ్లీ తిరిగి వెళ్లే వరకు అవసరమైన ఏర్పాట్లు ప్రణాళిక బద్ధంగా చేశామని అన్నారు. జాతర నిర్వహణకు సంబంధించి సింగరేణి, ఎన్టిపిసి , మున్సి పాలిటీ అధికారులు సమన్వయంతో పని చేస్తూ జాతరను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతర సందర్భంగా పారిశుధ్య నిర్వహ ణకు ప్రాధాన్యత కల్పించే అదనపు కార్మి కులను ఏర్పాటు చేశామని అన్నారు.గో దావరి నదిలో పుణ్యస్నానాలు చేసే వారికి అవసరమైన షవర్స్, మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జాతర జరుగు నాలుగు రోజులు వైద్య సిబ్బంది అవసరమైన మందులు తోపాటు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తారని, గజ ఈత గాళ్లను అందుబా టులో పెట్టుకున్నామని అన్నారు.★రా మగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతంలో ప్రతి ఇంటి నుంచి పెద్ద ఎత్తున సమ్మక్క సారలమ్మ జాతర జరు పుకుంటామని అన్నారు. ప్రజలకు మంచి ఆధ్యాత్మిక కేంద్రంగా సమ్మక్క సారలమ్మ జాతర అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ప్రస్తుతం బ్రహ్మాం డమైన ఏర్పాట్లు చేశామని అన్నారు.జాతర నిర్వహణకు సంబంధించి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకున్నామని , సీసీ కెమెరా లతో కూడిన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గోలివాడ ప్రాంతంలో కూడా 3 కోట్ల రూపాయలు ఖర్చు చేసి జాతరకు ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. 5 నుంచి 6 లక్షల మంది పైగా భక్తులు గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతరకు విచ్చేసి అమ్మవార్లను దర్శించు కుంటారని , 2వ మేదారం గా గోదావరి ఖని పేరుగాంచిందని ఎమ్మెల్యే తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి గోదావరి నదిలో పుణ్యస్నానం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పాలకుర్తి మండలం ఫర్టిలైజర్ సిటీ లోని జడ్పీ స్కూల్ ను కలెక్టర్ పరిశీలించి అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అంతకు ముందు పాలకుర్తి మండలం ఈసల తక్కలపల్లి లోని సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను కలెక్టర్ పరి శీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఆర్జి 1 జిఎం లలిత్, దేవదాయ శాఖ కమిషనర్ , గోదావరిఖని జాతర కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి విమల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి మండలంలో

# అదనపు కలెక్టర్ పర్యటన

### కేజీబీవీ పాఠశాల...ఇందిరమ్మ నిర్మాణాలు... పీహెచ్సీ సేవలపై పలు సూచనలు





**జగిత్యాల జనవరి 23 (వుదయం ):**

జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు ప్రజా సదుపాయాల నాణ్యత తనిఖీలో భాగంగా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి రాజ గౌడ్ శుక్రవారం తనిఖీ చేశారు కేజీబీవీ పాఠశాల సందర్శనలో విద్యార్థుల విద్యా పురోగతి బోధన విధానం హాజరు శాతం రిమిడియల్ క్లాసుల నిర్వహణ అంశాలపై సమీక్ష జరిగింది వంట గదిని పరిశీలించి మెను నిల్వ వస్తువులు వంట సిబ్బంది పని తీరుపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు హాస్టల్ గదులు నీటి సదుపాయం శుభ్రత ఆరోగ్య నిర్వహణ వంటి అంశాలపై తగిన సూచనలు అందించారు విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ విద్య పురోగతి పాఠశాల సౌకర్యాలపై అడిగి తెలుసు కున్నారు బాగా చదువుకుని గురువులు తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని మీరు అనుకున్న ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు అనంతరం మండలం లోని ఇందిరమ్మ నిర్మాణ పనులను అధి కారులు పరిశీలించి పనుల పురోగతి నాణ్యత ప్రమాణాలు టైమ్ లైన్ లపై ఆరా తీశారు పూర్తి కావస్తున్న నిర్మాణాలు నాణ్యంగా ఉండాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు పనుల ఆలస్యంపై కారణాలు తెలుసుకొని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు అదే విధంగా సమ్మక్క–సారక్క గద్దెలను పరిశీలించి భక్తులకు అవసర మైన సౌకర్యాలు ట్రాఫిక్ తాగునీటి ఏర్పాట్లు పారిశుధ్య అంశాలపై స్థానిక అధికారులతో చర్చించారు రానున్న కాలంలో భక్తుల రద్దీ పెరగనుందని అందుకు కావాల్సిన ముందస్తు చర్యలు క్షేత్ర స్థాయిలో చేపట్టాలని అధికారు లను ఆదేశించారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి) పరిశీలించి వైద్య సేవలు రోగుల రిజిస్టర్ ప్రసూతి సేవలు టీకాలు మందుల లభ్యత వంటి అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు టీకా కేంద్రం స్టోర్ రూమ్ శానిటేషన్ పరిసరాలను పరిశీలించారు ఈ పరిశీలనలో ఎంపిడివో రవీందర్ రావు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా నరసింహుని వసంతోత్సవం



**ధర్మపురి జనవరి 23 వుదయం :**

వసంత పంచమి పర్వదినాన్ని పురస్క రించుకుని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి వసంతోత్సవం కన్నుల పండుగగా జరిగింది.శుక్రవారం స్వామివారిని ఆలయం నుండి ఇసుక స్తంభం వరకు మంగళవాయిద్యాల నడుమ ఊరేగిం పుగా తీసుకెళ్లారు. అక్కడ స్వామివారికి వేద పండితులు అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించినఅనం తరం, అర్చకులు,భక్తులు ఒకరిపై ఒకరు వసంతం చల్లుకుంటూ మురిసి పోయారు. వేడుక అనంతరం స్వామివారు తిరిగి ఆలయానికి చేరుకు న్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి సభ్యులు,వేద పండి తులు పాలెపు ప్రవీణ్ కు మార్ శర్మ,పణతుల వెంకట రమ ణ శర్మ,

ముఖ్య అర్చకులు నంబి. శ్రీనివాసచా ర్యులు,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యూహాత్మక ఒప్పందం

## ఇన్ఫోర్టెకార్ప్–ప్రాక్సియన్ టెక్–ఫైడైమెన్షన్స్ మధ్య వ్యూహాత్మక ఒప్పందం

**హైదరాబాద్/లండన్, వుదయం :**



ఏరోస్పేస్, డిఫెన్స్, ఐటీ మరియు హై–టెక్నాలజీ రంగాల్లో పరస్పర సహకా రాన్ని బలోపేతం చేసేందుకు ఇన్ఫోర్టె కార్ప్ సొల్యూషన్స్ లిమిటెడ్ (యుకే), ప్రాక్సియన్ టెక్, ఫైడైమెన్షన్స్ సంస్థలు త్రైపాక్షిక వ్యూహాత్మక ఒప్పందంపై సంతకాలు చేశాయి.ఈ ఒప్పందం ద్వారా భారత్, యునైటెడ్ కింగ్‌డమ్, యూరప్ తదితర అంతర్జాతీయ మార్కెట్లలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్, ఐటీ, ఐటీఈఎస్ రంగాల్లో ఉద్భవిస్తున్న అవకాశాలను సంయుక్తంగా వినియో గించుకోవాలని సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.ఒప్పందం ప్రకారం ఇన్ఫోర్టెకార్ప్ సంస్థ తన గ్లోబల్ మార్కెట్ యాక్సెస్, వ్యూహాత్మక భాగ స్వామ్యాలు మరియు ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ సామర్థ్యాలను వినియో గించనుంది. ప్రాక్సియన్ టెక్ అధునా తన ఇంజినీరింగ్, డిజైన్ మరియు ఇన్నో వేషన్ ఆధారిత టెక్నాలజీ అభివృద్ధిలో తన నైపుణ్యాన్ని అందించనుంది. ఫైడై మెన్షన్స్ ఐటీ, ఐటీఈఎస్, సిస్టమ్స్ ఇంటి గ్రేషన్ మరియు క్లిష్టమైన టెక్నాలజీ ప్రాజెక్టుల అమలులో సహకారం అందించనుంది.ఈ భాగస్వామ్యం ద్వారా ఏరోస్పేస్ మరియు డిఫెన్స్ రంగాల్లో వ్యూహాత్మక ప్రాజెక్టులు, టెండర్లను సంయుక్తంగా సాధించడం, టెక్నాలజీ ట్రాన్స్ఫర్, స్వదేశీకరణ, లోక లైజేషన్‌కు ప్రోత్సాహం ఇవ్వడం, గ్లోబల్ OEMలు మరియు ప్రభుత్వ ఖాతాదారు లకు మిషన్–క్రిటికల్ సొల్యూషన్లు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థలు తెలిపాయి.ఈ సందర్భంగా ఇన్ఫోర్టెకార్ప్ సొల్యూషన్స్ లిమిటెడ్ కో–ఫౌండర్ (ఏరోస్పేస్ & డిఫెన్స్ – యుకే & ఓవర్సీస్) రాజు కీర్చిపల్లి మాట్లాడుతూ, ఈ ఒప్పందం ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో విశ్వసనీయమైన ఎకో సిస్టమ్ నిర్మాణానికి దోహదపడుతుం దని అన్నారు.

మూడు సంస్థల సమిష్టి బలాలతో ప్రపంచ స్థాయి, నాణ్యమైన పరిష్కారా లను అందించగలుగుతామని పేర్కొన్నారు.ప్రాక్సియన్ టెక్, ఫైడైమె న్షన్స్ ప్రతినిధులు కూడా ఈ భాగస్వామ్యం డిజిటల్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉండటంతో పాటు,

దీర్ఘకాలిక వృద్ధి, స్థిరత్వానికి దోహదప డుతుందని తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

## జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ..



**.కోరుట్ల జనవరి 23 (వుదయం) :**

కథలాపూర్ మండలం గంభీర్ పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా పరిశీ లించారు ఈ సందర్భంగా పాఠశాలలో బోధన విధానం విద్యార్థుల హాజరు మధ్యాహ్న భోజన పథకం అమలు మౌలిక వసతులను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీ లించారు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు తరగతి గదిలో విద్యార్థుల పాఠ్యంశాల్లోని సిలబస్ ను అడిగి తెలుసుకున్నారు విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ జరిపి వారితో పాఠాలు చదివించి వారి భోధన స్థితి గతులను ప్రత్యేకంగా పరిశీలించారువి ద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ఇతర నైపుణ్యాల్లో కూడా రాణించాలని సూచించారు అదేవిధంగా 26వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ విద్యార్థులతో పాటు స్వయంగా పాల్గొని వారిని ఉత్సాహపరిచారు ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డిఓ జివాకర్ రెడ్డి జిల్లా విద్యాధికారి కె రాము మండల తహసిల్దార్ ఎంఈఓ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# బాసరలో ఘనంగా వసంతిపంచమి

## భారీగా తరలివచ్చిన భక్తులువేకువ జామున మూడు గంటల నుండి అక్షరభ్యాస పూజలు

**బాసర , జనవరి 23 వుదయం :**

దక్షిణ భారత దేశంలోనే సుప్రసిద్ధమైన సరస్వతీ క్షేత్రం నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి జన్మదినం వసంత పంచమి సందర్భంగా భక్తులు శుక్రవారం ఆలయానికి భారీగా తరలి వచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుండీ వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున రెండు గంటల నుండి క్యూలైన్లలో భక్తులు నిలబడి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో అమ్మవారి పూజా కార్యక్రమాలు ప్రారంభం కాగా...ఆలయ వైదిక బృందం సరస్వతి, మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించింది. వేకువ జామున మూడు గంటల నుండి అక్షర భ్యాస పూజలు ప్రారంభించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి చిన్నా రులకు అక్షర శ్రీకార పూజలు నిర్వహిం చారు.

ఇందుకోసం ఆలయంలో ప్రత్యేకంగా మూడు అక్షరాభ్యాస మండపాలను ఏర్పాటు చేశారు. వేద వ్యాసుడు ప్రతి ష్ఠించిన ఈ ఆలయంలో ప్రతి ఏటా వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. మాఘ మాసంలో వచ్చే మాఘ శుద్ధ పంచమిని వసంత పంచమిగా నిర్వహిస్తారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

**మంచిర్యాల జిల్లా జనవరి 23 వుదయం :**

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యా లయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధి కారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధి కార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకో వాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు,

పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహ నాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదా రులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేప ట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుం దని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేం దుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టా లని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిష నర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగా హన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబ డిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ లలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చలు తీసు కోవాలని తెలిపారు.

# 28 న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్‌మేళా

## 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ

**హైదరాబాద్, జనవరి 23 వుదయం :**

ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయి మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 28 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యా లయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు ★అపోలో ఫార్మసీ లోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫారసీ , బీ ఫార్మసీ ఎం.ఫార్మసీ, మరియు ఏదైనీ డిగ్రీ చేసిన యువతి యువకులకు 18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివ ర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది . రూ.12,000 నుండి రూ.25,000 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు . T రఘుపతి, HR (Ph.No.8247656356) ను సంప్రదించా లని ఆ ప్రకటనలో కోరారు విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లా యిమెంట్ బ్యూరో వద్ద నేరుగా జనవరి 28,2026 న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు

# 25 న మల్కాజిగిరి లో స్టార్ మా సీరియల్స్ తారల సందడి!

**హైదరాబాద్ జనవరి 23 వుదయం :**




;స్టార్ మా 'పొదరిల్లు' జంట గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్ – హైదరాబాద్లో కనీవిని ఎరుగని టెలివిజన్ మహోత్సవం జనవరి 25 ఆదివారం సాయంత్రం 6 గంటల నుండి హైదరా బాద్ లో మల్కాజిగిరిలో శ్రీ లక్ష్మి సాయి గార్డెన్స్ ఫంక్షన్ హాల్, అనుటెక్స్ చౌరస్తా లో జరగ నుంది.ఈ సందర్భంగా ఒకే వేదికపై తొలిసారి స్టార్ మా సీరియల్స్ తారల సందడి చేయను న్నారు.స్టార్ మా ఛానల్లో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ప్రముఖ సీరియల్ 'పొదరిల్లు' హీరో–హీరో యిన్ వివాహ సందర్భంగా నిర్వహి స్తున్న గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్కు హైద రాబాద్ నగర ప్రజలను ఆహ్వానిస్తు న్నారు.ఈ శుభసందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చేందుకు, స్టార్ మా లో ప్రసారమవుతున్న అన్ని ప్రముఖ సీరియల్స్కు చెందిన నటీనటులు ఒకే వేదికపై తొలిసారి సందడి చేయనున్నారు. తమ అభిమాన హీరో–హీరో యిన్ను ఆశీర్వదించడానికి, శుభాకాంక్షలు తెలపడా నికి స్టార్ మా కుటుంబం మొత్తం ఈ వేడుకకు హాజ రుకానుంది.ఇది కేవలం ఒక వివాహ వేడుక మాత్రమే కాదు..స్టార్ మా ప్రేక్షకులకు ఒక అరుదైన పండుగ!ఒకే చోట, ఒకే వేదికపై మీకు ఇష్టమైన అన్ని సీరియల్స్ తారలను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఇదే తొలిసారి.ఈ గ్రాండ్ వెడ్డింగ్ రిసెప్షన్లో అభిమానులతో కలిసి సెలబ్రేట్ చేసుకో వాలని 'పొదరిల్లు' జంట ప్రత్యేకంగా హైదరాబాద్ ప్రజలను ఆహ్వాని స్తోంది.స్టార్ మా కుటుంబం మొత్తం ఒక్కటయ్యే ఈ మహా సంబరాన్ని మిస్ కాకండి!..మీ అభిమాన తారలతో కలిసి ఈ ఆనంద క్షణాలకు మీరు కూడా సాక్షులవ్వండి!

# చక్కని ఆరోగ్యం

## గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం తాగే అలవాటు ఉందా?

ఫిట్‌నెస్ ప్రియులు ఉదయాన్నే ఖాళీ కడుపుతో నిమ్మ రసం గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం తరచూ చూస్తుంటాం. దీనివల్ల కడుపులోని కొవ్వు తొలగిపోతుందని చాలా మంది భావిస్తుంటారు. ఈ పురాతన చిట్కా పలు ఆరోగ్య సమస్యలను కూడా నివారిస్తుందని నమ్ముతారు. ప్రతి ఉదయం గోరు వెచ్చని నీటిలో నిమ్మ రసం కలిపి తాగడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులను దూరంగా ఉంచుతుంది. నిమ్మకాయలోని అధిక విటమిన్ సి కంటెంట్ జలుబును నివారిస్తుంది. నిమ్మకాయలో పొటాషియం కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది నరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. శరీర ఆమ్ల స్థాయిని నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. తరచుగా అనారోగ్యానికి గురికాకుండా రక్షణ కల్పిస్తుంది. నిమ్మ నీరు దంత కుహరాలు, పంటి నొప్పి, చిగుళ్ల నొప్పి వంటి దంత సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించగలదు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం వల్ల మూత్రవిసర్జన సైతం మెరుగుపడుతుంది. ఇది శరీరం నుంచి విషాన్ని, వ్యర్థాలను తొలగిస్తుంది. అందువల్ల నిమ్మ రసం తాగడం వల్ల మెరిసే చర్మం పొందవచ్చు. ఇది జీర్ణ సమస్యలను పరిష్కరించడంలో కూడా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. అజీర్ణంతో బాధపడేవారికి ఈ నిమ్మ నీరు అద్భుతంగా పనిచేస్తుంది. అయితే ఈ నిమ్మకాయ నీటిని తప్పుడు సమయంలో, తప్పుడు మార్గంలో తాగితే ఆరోగ్యానికి విషం మాదిరి ప్రతికూలంగా పని చేస్తుంది. యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు ఉన్నవారు ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం అంత మంచిది కాదు. నిమ్మ నీరు తాగడం వల్ల దంతాల ఎనామిల్ దెబ్బతింటుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా నోటిలో పుండ్లు ఉంటే నిమ్మ నీటిని తాగడం వల్ల అవి మరింత తీవ్రతరం అవుతాయి. ఎల్లప్పుడూ గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగడం మంచిది. తాగిన వెంటనే పళ్ళు తోముకోకూడదు. రోజుకు ఒకటి కంటే ఎక్కువ సార్లు నిమ్మ నీరు తాగకూడదు. ఈ నీటిని నేరుగా తాగడం కంటే స్ట్రా ద్వారా తాగడం వల్ల ఎనామిల్ సురక్షితంగా ఉంటుంది. అల్సర్లు లేదా తీవ్రమైన అసిడిటీ ఉంటే ఈ నీళ్లు అస్సలు తాగకూడదు. అవసరమైతే వైద్యుడిని సంప్రదించడం మరచిపోకూడదు.



## జీవనశైలిలో ఈ మార్పులే గుండెకు శ్రీరామరక్ష!

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అనారోగ్యం దరిచేరకుండా ఉండాలంటే జీవనశైలిలో మార్పులు తప్పనిసరని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం పాటించే సరైన అలవాట్ల వల్ల దాదాపు 90 శాతం జబ్బులను దరిచేరకుండా నియంత్రించవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. కేవలం మందుల ద్వారానే కాకుండా, క్రమశిక్షణతో కూడిన దినచర్యను అలవరచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శారీరక శ్రమ అత్యంత కీలకమైన అంశం. వారానికి కనీసం మూడు నుండి నాలుగు సార్లు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనితో పాటు ప్రతిరోజూ 10 వేల అడుగుల నడకను లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలు దరిచేరవు. నడక అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది శరీరంలోని ప్రతి అవయవానికి పునరుత్తేజాన్ని ఇచ్చే ఒక అద్భుతమైన ప్రక్రియ. శరీరానికి అవసరమైన శక్తిని అందించడంలో నిద్ర, సూర్యరశ్మి ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి నిద్రపోవడం వల్ల మెదడు చురుగ్గా పని చేయడమే కాకుండా, శరీర కణాలు మరమ్మత్తుకు గురవుతాయి. ఉదయాన్నే లేత ఎండలో కొద్దిసేపు నిలబడటం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్-డి అందుతుంది. ఇది ఎముకల పుష్టికి, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుంది. మనం తీసుకునే ఆహారం, నీరు మన ఆరోగ్యానికి పునాదులు వంటివి. ప్రతిరోజూ పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన ప్రోటీన్లు, విటమిన్లు అందుతాయి. అలాగే రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు తాగడం వల్ల శరీరంలోని మలినాలు బయటకు వెళ్లిపోయి, చర్మం మరియు అంతర్గత అవయవాలు శుద్ధి చేయబడతాయి. వీటన్నింటితో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రతి రోజూ ధ్యానం (మెడిటేషన్) చేయడం ఎంతో అవసరం.



## రోజుకు ఎన్ని చపాతీలు తింటే ఆరోగ్యానికి మంచిది?

బరువు తగ్గాలనుకునే వారు మొదట చేసే పని అన్నం మానేసి చపాతీలు తినడం. చపాతీ ఆరోగ్యకరమే అన డంలో సందేహం లేదు.. కానీ ఆరోగ్యకరమైన పదార్థమైనా సరే.. ఏది ఎంత తినాలో అంతే తినాలి. చపాతీ తయారీ నుండి, అది తినే సమయం వరకు మనం చేసే చిన్న చిన్న తప్పులే మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. నేటి బిజీ జీవితంలో ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతోంది. ఈ క్రమంలో అన్నం మానేసి చపాతీలు తినేవారి సంఖ్య భారీగా పెరిగింది. చపాతీ ఆరోగ్యకరమే అయినప్పటికీ సరైన అవగాహన లేకుండా ఎన్ని పడితే అన్ని తినడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. గోధుమ పిండితో తయారు చేసే చపాతీలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, తక్కువ మొత్తంలో ప్రోటీన్, ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇది జీర్ణక్రియకు తోడ్పడటమే కాకుండా ఎక్కువసేపు ఆకలి వేయకుండా చూస్తుంది.చపాతీ పరిమాణం అనేది వ్యక్తి చేసే శారీరక శ్రమ, వయస్సు, బరువుపై ఆధారపడి ఉంటుంది: సాధారణ శారీరక శ్రమ చేసేవారు రోజుకు 4 నుండి 6 చపాతీలు తీసుకోవచ్చు. రు వెయిట్ లాస్ జర్నీలో ఉంటే రోజుకు 2 నుండి 4 చపాతీలకు పరిమితం అవ్వడం మంచిది. వీటికి బదులుగా సలాడ్లు, పప్పు ధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు రోజుకు 6 నుండి 8 చపాతీలు తిన్నా పర్వాలేదు. చాలామంది రాత్రిపూట కడుపు నిండా చపాతీలు తింటారు. కానీ రాత్రి సమయంలో జీర్ణక్రియ నెమ్మదిగా ఉంటుంది. అందుకే నిపుణులు రాత్రిపూట 1 నుండి 2 చపాతీలు మాత్రమే తినాలని సూచిస్తున్నారు. అంతకంటే ఎక్కువ తింటే అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలతో పాటు బరువు పెరిగే అవకాశం ఉంది.



## బీపీ, పీరియడ్స్‌కు మధ్య ఉన్న సంబంధం ఏంటీ?



రక్తపోటు సమస్య అనగానే మనం సాధారణంగా గుండె లేదా మెదడుకు సంబంధించిన వ్యాధుల గురించే ఆలోచిస్తాం. కానీ ఈ నిశ్శబ్ద శత్రువు మహిళల అంతర్గత ఆరోగ్యంపై, ముఖ్యంగా నెలసరి ప్రక్రియపై ఎంతటి తీవ్ర ప్రభావం చూపుతుందో తెలుసా? బీపీ పెరిగినా, తగ్గినా అది కేవలం రక్తనాళాలకే పరిమితం కాదు.. అది హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీసి, పీరియడ్స్ ఆగిపోయేలా లేదా అధిక రక్తస్రావం అయ్యేలా చేస్తుంది. అధిక రక్తపోటు లేదా హైపర్‌టెన్షన్ వల్ల శరీరంలోని కీలకమైన హార్మోన్లు అసమతుల్యతకు గురవుతాయి. ముఖ్యంగా ఆల్డోస్టిరాన్, కార్టిసాల్, అడ్రినలిన్, థైరాయిడ్ వంటి హార్మోన్ల స్థాయిలో మార్పులు రావడం వల్ల పీరియడ్స్ క్రమరహితంగా మారే అవకాశం ఉంది.రక్తనాళాలపై ప్రభావం: అధిక రక్తపోటు గర్భాశయం, అండాశయాలకు రక్తాన్ని చేరవేసే ధమనులను దెబ్బతీస్తుంది. దీనివల్ల నెలసరి సమయంలో రక్త ప్రవాహం పెరిగి అధిక రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉంది. అంతేకాదు ఒకవేళ బిపి సమస్య తీవ్రమైతే గర్భాశయ ధమనులు కుంచించుకుపోయి, పీరియడ్స్ శాశ్వతంగా ఆగిపోయే ప్రమాదం కూడా ఉంది. ఈ పరిస్థితిని వైద్య పరిభాషలో అమెనోరియా అని పిలుస్తారు. ఇది ఒక రకమైన ముందస్తు మెనోపాజ్ వంటిది. గుండె, మూత్రపిండాలు, మెదడు వంటి అవయవాలు సజావుగా పనిచేయాలన్నా.. ఋతుచక్రం సక్రమంగా ఉండాలన్నా రక్తపోటును అదుపులో ఉంచుకోవడం తప్పనిసరి. క్రమం తప్పకుండా బీపీ చెకప్ చేయించుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా ఈ సమస్యల నుండి బయటపడవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

## మళ్లీ.. చర్మానికి మెరుపు.. ఇలా!

ఎంత జాగ్రత్తగా ఉన్నా.. ఒక్కోసారి వాతావరణాన్ని బట్టి చర్మం పొడిబారడం, నిర్జీవంగా మారడం, పగుళ్లు రావడం.. వంటి సమస్యలు సహజం. అయితే ఇంట్లోనే లభించే కొన్ని పదార్థాలతో తయారు చేసుకునే ఫేస్ ప్యాక్స్ ద్వారా ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. బాగా పండిన అరటిపండు తీసుకొని మెత్తని గుజ్జుగా చేసుకోవాలి. దానికి చెంచా చొప్పున తేనె, పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని చర్మంపై అప్లై చేసుకొని 20 నుంచి 30 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. తరచూ ఇలా చేస్తే ఫలితం ఉంటుంది. పెరుగు, తేనె చర్మానికి తేమనందిస్తే, అరటిపండు నిర్జీవంగా మారిన



చర్మాన్ని పునరుత్తేజితం చేస్తుంది అంటున్నారు నిపుణులు. బాదంపై ఉండే పొట్టు తొలగించి కొద్దిగా పాలు జత చేస్తూ పేస్ట్‌లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ముఖానికి, మెడకు ప్యాక్‌లా వేసుకొని పూర్తిగా ఆరనివ్వాలి. ఆపై చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే.. ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది. కొద్దిగా శెనగపిండి తీసుకొని అందులో తగినంత టొమాటో రసం వేసి మెత్తని పేస్ట్‌లా కలుపుకోవాలి. కావాలనుకుంటే ఇందులో కాస్త రోజ్‌వాటర్ కూడా జత చేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని ప్యాక్‌లా అప్లై చేసుకొని.. 20 నిమిషాలు ఆరనిచ్చి చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇది చక్కని స్క్రబ్‌లా పని చేసి చర్మంపై ఉన్న మృతకణాల్ని తొలగిస్తుంది. అలాగే నిర్జీవమైన చర్మానికి తిరిగి జీవం పోసి తాజాగా కనిపించేలా చేస్తుంది.

## ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు!

ఒక్కోసారి ఉన్నట్లుండి మాట తడబడుతుంటుంది.. ఆ వెంటనే తిరిగి మామూలుగా అవడంతో పెద్దగా పట్టించుకోం.. అప్పుడప్పుడూ ఛాతీలో నొప్పి వస్తుంటుంది.. గ్యాస్ట్రిక్ సమస్యేమోనని నిర్లక్ష్యం చేస్తుంటాం.. సడన్‌గా బరువు తగ్గడం, జుట్టు ఎక్కువగా రాలడాన్ని అంత సీరియస్‌గా తీసుకోరు కొంతమంది.. అయితే ఇలాంటి లక్షణాలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు నిపుణులు. కొంతమంది జ్వరాన్ని తేలిగ్గా తీసుకుంటారు. ట్యాబ్లెట్స్, యాంటీ బయాటిక్స్‌తో ఈ సమస్య నుంచి బయటపడచ్చనుకుంటారు. కానీ జ్వరం ఎక్కువ రోజుల పాటు కొనసాగినా, 103 డిగ్రీల ఫారన్‌హీట్‌కు చేరినా.. ఇది ఒక్కోసారి వివిధ రకాల ఆటోఇమ్యూన్ వ్యాధులకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి ఈ లక్షణాల్ని నిర్లక్ష్యం చేయకపోవడం మంచిదని చెబుతున్నారు. కొంతమందికి ఉన్నట్లుండి మాట తడబడుతుంటుంది.. ముద్దగా వస్తుంది. కాసేపటికి అదే సెట్ అవుతుందిలే అని దీన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే ఈ లక్షణం శరీరంలో కొన్ని అనారోగ్యాలకు సంకేతమని చెబుతున్నారు నిపుణులు. రక్తంలో సోడియం-చక్కెర స్థాయులు పడిపోవడం, అమ్మోనియా స్థాయులు పెరిగిపోవడం, కాలేయ సంబంధిత సమస్యలు, మెదడు సంబంధిత ఇన్ఫెక్షన్లు.. వంటి సమస్యలున్నప్పుడు ఇలా జరిగే అవకాశాలున్నాయంటున్నారు. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం వల్ల అసలు సమస్యను గుర్తించవచ్చంటున్నారు. ఒక్కోసారి ఉన్నట్లుండి తీవ్ర గందరగోళానికి గురవుతుంటాం.. చేసే చేతలకు, మాటలకు పొంతన ఉండదు. ఇలాంటి లక్షణాలు దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువంటున్నారు నిపుణులు. జీవక్రియల పనితీరు అదుపు తప్పడం, మెదడులో ఇన్ఫెక్షన్లు, అరుదుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు కూడా ఈ లక్షణాలు కారణం కావచ్చని చెబుతున్నారు. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే అలర్ట్ అవ్వమని సలహా ఇస్తున్నారు. ఉదర సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యలున్న వారిలో ఒక్కోసారి ఛాతీలో నొప్పి వచ్చే అవకాశముంటుంది. అయితే ఈ



నొప్పికి ప్రతిసారీ ఇవే సమస్యలు కారణం కాకపోవచ్చంటున్నారు నిపుణులు. నొప్పికి తోడు ఛాతీపై ఎక్కువ బరువు మోపినట్లుగా అనిపించడం, మంట.. అది క్రమంగా చేతుల్లోకీ విస్తరించడం.. వంటి లక్షణాలు గమనిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం మంచిదంటున్నారు. ఎందుకంటే ఈ తరహా లక్షణాలు ఒక్కోసారి గుండె సంబంధిత సమస్యలు, గుండెపోటుకు దారితీసే ప్రమాదం ఉందంటున్నారు.

## అరటిఆకు భోజనం ఎందుకు మంచిది

అరటి ఆకు భోజనం తెలుగు వారికి కొత్తే కాదు. మన దేశంలో ముఖ్యంగా దక్షిణాదిలో అనేక ప్రాంతాలలో ఈ ఆచారం చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా దక్షిణ, ఆగ్నేయాసియాలో అరటి ఆకులను ఆహారాన్ని భుజించడానికి విస్తృతంగా ఉపయోగిస్తారు. అరటి ఆకులు సాంప్రదాయకంగానే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా భావిస్తారు. అరటి ఆకులు పెద్దగా, వెడల్పుగా ఉంటాయి. వేడి ఆహారాన్ని వాటిపై వడ్డించినప్పుడు అవి తేలికపాటి, సహజమైన వాసనను వెదజల్లుతాయి. ఇది ఆహారాన్ని మరింత సువాసనగా, రుచికరంగా చేస్తుంది. ఈ వాసన తినే వారికి ఆనందాన్ని పెంచడమే కాకుండా జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. అరటి ఆకులలో పాలీఫెనాల్స్ అనే సహజ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి గ్రీన్ టీ, కొన్ని పండ్లలో కూడా కనిపిస్తాయి. వేడి ఆహారాన్ని ఆకులపై ఉంచినప్పుడు ఈ పోషకాలు ఆహారంలో కరిగిపోతాయి. వీటిల్లోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. ఇది క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అరటి ఆకులు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. ఆకుల ఉపరితలంపై ఉండే కొన్ని సహజ సమ్మేళనాలు హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తాయి. ఇది ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆహారాన్ని సురక్షితం చేస్తుంది. అరటి ఆకుల బయటి పొర జీర్ణక్రియకు సహాయపడే సహజ మైనపు పదార్థాన్ని కలిగి ఉంటుంది. వేడి ఆహారాన్ని ఆకులపై ఉంచినప్పుడు ఈ పొర కొద్దిగా కరిగి, జీర్ణక్రియకు సహాయపడే పదార్థాలను ఆహారంలోకి విడుదల చేస్తుంది. ఈ ప్రక్రియ జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. కడుపును శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్లాస్టిక్ లేదా సింథటిక్ ప్లేట్లతో పోలిస్తే అరటి ఆకులు పూర్తిగా సహజమైనవి, రసాయన రహితమైనవి. వాటిలో సాధారణంగా ప్లాస్టిక్‌లలో కనిపించే ఃఖం లేదా థాలేట్‌ల వంటి హానికరమైన రసాయనాలు ఉండవు. అందువల్ల ఆహారంలో విషపూరిత రసాయనాలు కలిపే ప్రమాదం లేదు. అరటి ఆకులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అలాగే దాని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు శరీరంలోకి హానికరమైన బ్యాక్టీరియా ప్రవేశించకుండా నిరోధిస్తాయి. తద్వారా ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. శరీర రక్షణను పెంచుతాయి. అరటి ఆకులు ఆరోగ్యానికి మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా చాలా మేలు చేస్తాయి. అవి పూర్తిగా జీవఅధోకరణం చెందుతాయి. పర్యావరణానికి వ్యర్థాలను మిగిలించవు. అలాగే అరటి ఆకులపై వడ్డించిన వేడి ఆహారం సహజ వాసన తినే అనుభవాన్ని మరింత ఆహ్లాదకరంగా మారుస్తుంది. జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది.



## పండ్లు, జ్యూస్.. ఆరోగ్యానికి ఏది మంచిది?

ఆరోగ్యంగా ఉండాలని మనం ప్రతిరోజూ ఒక గ్లాసు పండ్ల రసం తాగుతుంటాం. పండ్ల నుంచి వచ్చేదే కాబట్టి ఇది మన శరీరానికి ఎంతో మేలు చేస్తుందని నమ్ముతాం. కానీ, నిజంగా జ్యూస్ తాగడం వల్ల పండు తిన్నంత ప్రయోజనం ఉంటుందా? ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి పండ్ల రసం వరం కంటే శాపంగా మారే అవకాశం ఉందా? ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న ఈ రోజుల్లో చాలామంది ఫ్రూట్ జ్యూస్ తాగడం చాలా ఆరోగ్యకరమని భావిస్తుంటారు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారు కూడా పండ్ల రసాలను ఎంచుకుంటూ ఉంటారు. అయితే పండ్లను రసంగా తీసుకోవడం కంటే.. పండును నేరుగా తినడమే శరీరానికి వంద రెట్లు మేలు చేస్తుందని డైటీషియన్లు హెచ్చరిస్తున్నారు. రక్తంలో చక్కెర పెరుగుదల: పండ్లను జ్యూస్ చేసినప్పుడు అందులోని సహజ చక్కెరలు శరీరానికి చాలా వేగంగా చేరుతాయి. ముఖ్యంగా మార్కెట్లో దొరికే ప్యాక్డ్ జ్యూస్‌లు తాగినప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. ఇది డయాబెటిస్ రోగులకు అత్యంత ప్రమాదకరం.పీచు పదార్థం కోల్పోవడం: పండ్ల వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం ఫైబర్. జ్యూస్ తీసే ప్రక్రియలో ఈ ఫైబర్ దాదాపు పూర్తిగా తొలగిపోతుంది. ఫైబర్ లేకపోవడం వల్ల చక్కెర నేరుగా రక్తంలో కలిసిపోయి అనారోగ్యానికి దారితీస్తుంది.అధిక కేలరీలు: ఒక గ్లాసు రసం తయారు చేయాలంటే కనీసం మూడు నాలుగు పండ్లు వాడాల్సి ఉంటుంది. దీనివల్ల శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు, చక్కెర అందుతాయి. ఫలితంగా బరువు పెరగడం, షుగర్ లెవల్స్ నియంత్రణ తప్పడం వంటి సమస్యలు ఎదురవుతాయి. పండును నేరుగా నమలి తినడం వల్ల శరీరానికి పుష్కలంగా ఫైబర్ అందుతుంది. ఈ ఫైబర్ రక్తంలోకి చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తుంది. దీనివల్ల షుగర్ లెవల్స్ స్థిరంగా ఉంటాయి. పండ్లలోని విటమిన్లు, ఖనిజాలు ఏమాత్రం వృథా కాకుండా శరీరానికి అందుతాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడతాయి. ఆకలిగా ఉన్నప్పుడు జ్యూస్ కంటే పండు తినడం వల్ల కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. ఇది జంక్ ఫుడ్ తినకుండా మిమ్మల్ని అడ్డుకుంటుంది. డైటీషియన్ ముస్కాన్ కుమారి ప్రకారం.. ఒకవేళ రు జ్యూస్ తాగాలనుకుంటే, ఇంట్లో తయారు చేసిన తాజా రసాల ను మాత్రమే చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. ప్యాక్ చేసిన జ్యూస్‌లను పూర్తిగా నివారించడం ఉత్తమం. డయాబెటిస్ ఉన్నవారు ఏవైనా పండ్లు తీసుకునే ముందు తమ వైద్యులను సంప్రదించడం మంచిది.



## అరగంట ఇలా నడిస్తే చాలట!

సింపుల్‌గా చేసే వ్యాయామాల్లో నడక గురించి మనకు తెలిసిందే! మొదలు పెట్టిన దగ్గర్నుంచి నిర్దేశిత సమయం దాకా ఒకే వేగంతో నడుస్తాం. ఇక బ్రిస్క్ వాకింగ్‌లో భాగంగా కాస్త వేగం పెంచి నడుస్తాం. అయితే ఈ రెండింటి కలయికే 'జపనీస్ వాకింగ్ పద్ధతి'. 30 నిమిషాల సమయం పెట్టుకొని.. మూడు నిమిషాలకోసారి వేగాన్ని మార్చుతూ నడవడమే ఈ వ్యాయామం. అంటే.. తొలుత మూడు నిమిషాల పాటు వేగంగా నడుస్తూ.. ఆ తర్వాతి మూడు నిమిషాలు సాధారణంగా నడుస్తూ వర్కవుట్‌ని కొనసాగించాల్సి ఉంటుంది. 'ఇంటర్వెల్ వాకింగ్ ట్రైనింగ్' గానూ పిలిచే ఈ వాకింగ్ పద్ధతి వల్ల రోజుకు వెయ్యి అడుగులు వేసిన దానికంటే ఎక్కువ ఫిట్‌నెస్ ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు. జిమ్, జిమ్ పరికరాలతో పని లేకుండా.. సమయం చూసుకోవడానికి ఓ స్టాప్‌వాచ్ లేదంటే మొబైల్ ఉంటే చాలు.. సౌకర్యంగా ఈ వ్యాయామం చేసేయచ్చని చెబుతున్నారు. అరగంట పాటు ఈ జపనీస్ వాకింగ్ పద్ధతిని పాటిస్తే ఆరోగ్యపరంగా, ఫిట్‌నెస్ పరంగా బోలెడన్ని ప్రయోజనాలు చేకూరతాయని నిపుణులు చెబుతున్నారు. అరగంట పాటు ఇలా వాకింగ్ చేస్తే జీవక్రియల పనితీరు మెరుగుపడు



తుందని చెబుతున్నారు. ఈ వాకింగ్ పద్ధతిలో భాగంగా.. మూడు నిమిషాల పాటు వేగంగా నడవడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఆపై మూడు నిమిషాల పాటు సాధారణంగా నడవడం వల్ల హార్ట్ రేట్ తగ్గుతుంది. ఈ హెచ్చుతగ్గుల వల్ల గుండెకు రక్తప్రసరణ మెరుగుపడి బీపీ అదుపులో ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. ఫలితంగా గుండె ఆరోగ్యమూ మెరుగుపడుతుందంటున్నారు. రోజూ ఈ వాకింగ్ పద్ధతిని సాధన చేసే వారిలో గుండె సంబంధిత సమస్యలు, గుండె పోటు.. వంటి అనారోగ్యాల ముప్పు తగ్గినట్లు పలు పరిశోధనల్లోనూ తేలిందట! జపనీస్ వాకింగ్ పద్ధతి మధుమేహులకూ మేలు చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. అంతేకాదు.. ఈ వాకింగ్ పద్ధతిని జీవనశైలిలో భాగం చేసుకోవడం వల్ల టైప్-2 మధుమేహం బారిన పడకుండా కూడా జాగ్రత్తపడచ్చట! కాసేపు వేగంగా, మరికాసేపు సాధారణంగా నడవడం వల్ల కాళ్లలోని కండరాలపై ఒత్తిడి పడి అవి దృఢంగా మారే అవకాశం ఉంటుందంటున్నారు. అంతేకాదు.. ఈ వ్యాయామం చేయడం వల్ల ఎముక సాంద్రత పెరిగి.. భవిష్యత్తులో ఆస్టియోపొరోసిస్ సమస్య బారిన పడకుండా జాగ్రత్తపడచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎలాంటి జిమ్ పరికరాలు లేకుండా.. ఒత్తిడికి లోనుకాకుండా చేసే ఈ సింపుల్ వ్యాయామం వల్ల మానసిక ఆందోళనలూ దూరమవుతాయంటున్నారు నిపుణులు. అంతేకాదు.. సుఖ నిద్రకూ ఈ వ్యాయామం ప్రేరేపిస్తుందని చెబుతున్నారు.

## బిజినెస్

# 78% క్షీణించిన ఇండిగో లాభం




దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ అక్టోబరు– డిసెంబరు త్రైమాసికానికి రూ.549.10 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2024–25 ఇదే కాల లాభం రూ.2,448.80 కోట్ల కంటే ఇది 78% తక్కువ. గత నెలలో భారీగా విమాన సర్వీసుల రద్దు వల్ల రూ.577.20 కోట్ల మేర ప్రభావం పడిందని, కొత్త కార్మిక చట్టాల అమలు కోసం రూ.969.30 కోట్లు కేటాయించడమూ నికరలాభం క్షీణతకు కారణమైందని కంపెనీ తెలిపింది. విమాన సర్వీసుల అంతరాయాలకు గాను పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) విధించిన రూ.22.2 కోట్ల జరిమానాను కూడా అనుకోని వ్యయాల కింద కంపెనీ చూపించింది. రూపాయి విలువ క్షీణత నేపథ్యంలో, డాలరు రూపేణా చెల్లింపులకు రూ.1,035 కోట్ల భారం పడినట్లు తెలిపింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ఇండిగో మొత్తం ఆదాయం రూ.24,540.60 కోట్లకు చేరింది. 2024–25 ఇదే త్రైమాసికం నాటి రూ.22,992.80 కోట్ల కంటే ఇది 7% అధికం. రూ.1,546.50 కోట్ల భారం: డిసెంబరు 3–5 తేదీల్లో భారీగా విమాన సర్వీసుల రద్దు, ఆలస్యంతో కార్యకలాపాల పరంగా తీవ్ర అవరోధాలను సంస్థ ఎదుర్కొన్నట్లు ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ తెలిపారు. అయినా ఆదాయంలో 7% వృద్ధి నమోదు చేశామన్నారు. కొత్త కార్మిక చట్టాల అమలు, విమాన సర్వీసుల రద్దు, డీజీసీఏ జరిమానా సహా అక్టోబరు– డిసెంబరు త్రైమాసికంలో అనుకోని వ్యయాలు రూ.1546.50 కోట్లుగా నమోదైనట్లు తెలిపారు. సమీక్షా త్రైమాసికంలో ఇండిగో మొత్తం 3.2 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. 2025 మొత్తంమీద ఈ సంఖ్య సుమారు 12.40 కోట్లుగా ఉంది. డిసెంబరు చివరికి ఇండిగో వద్ద ఉన్న మొత్తం విమానాల సంఖ్య 440. నగదు, నగదు సమాన నిల్వలు రూ.51,606.90 కోట్లుగా ఉన్నాయి. 'విమాన సర్వీసుల రద్దు పరిణామాలపై లోతుగా సమీక్ష జరుపుతున్నాం. శీతాకాల షెడ్యూల్‌లో ప్రకటించిన విమాన సర్వీసుల్లో, డీజీసీఏ 10% కోత విధించడం వల్ల జనవరి– మార్చి త్రైమాసికంలో కొంత ప్రభావం పడుతుందని ఎల్బర్స్ చెప్పారు. పాకిస్తాన్ గగనతల ఆంక్షల వల్ల 20–30 నిమిషాలు అధికంగా ప్రయాణించాల్సి వస్తోందని, దీంతో ఆ మేరకు ఇంధన వ్యయాలు పెరిగాయని తెలిపారు.

# కర్ణాటకలో బైక్ ట్యాక్సీలపై నిషేధం ఎత్తివేత




కర్ణాటకలో బైక్ ట్యాక్సీ సేవలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ.. అక్కడి హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది (Bike Taxis Return In Karnataka). ఈ క్రమంలో పలు నిబంధనలు అమలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం సూచనలు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. బైక్ ట్యాక్సీలను ఇకపై వాణిజ్య వాహనాలుగా పరిగణిస్తారు. బైక్ ట్యాక్సీలుగా ఉపయోగించేందుకు వాహన యజమానులు ముందుగా లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి. అగ్రిగేటర్లు కూడా కొత్త దరఖాస్తులు సమర్పించేందుకు న్యాయస్థానం అనుమతించింది. గతేడాది జూన్‌లో సింగిల్ బెంచ్ ఆదేశాలతో బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. దీనిపై ఓలా, ఉబర్ వంటి అగ్రిగేటర్లు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. గతంలో ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. హైకోర్టు తీర్పుపై కర్ణాటక (Karnataka) రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి స్పందించారు. దీనిపై చర్చలు జరిపిన అనంతరం నిర్ణయం తీసుకుంటామన్నారు.

## భారీ నష్టాలతో ముగిసిన సూచీలు..



ముంబయి: అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు, నిరుత్సాహకర త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో దేశీయ స్టాక్ సూచీలు మరోసారి భారీ నష్టాలు చవిచూశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలూ ప్రభావం చూపాయి. దీంతో ఉదయం లాభాల్లో కదలాడిన సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 25,050 దిగువ స్థాయికి చేరుకుంది. దీంతో నిన్నటి లాభాల సంబరం ఒక్కరోజుకే పరిమితమైంది. మదుపర్ల సంపద రూ.6 లక్షల కోట్ల మేర ఆవిరైంది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.452 కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,335.94 (క్రితం ముగింపు 82,307.37) వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం తర్వాత క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 81,471.82 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 769.67 పాయింట్ల నష్టంతో 81,537.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 241.25 పాయింట్ల నష్టంతో 25,048.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.93 వద్ద మరోసారి ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎటెర్నల్, ఇండిగో, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4926 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మార్కెట్ పతనానికి అతిపెద్ద కారణం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIs) వరుసగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండడం. వరుసగా 13వ రోజైన గురువారం 2,550 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. జనవరిలో ఇప్పటివరకు వారు దాదాపు రూ.36,591 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ఇది ప్రభావం చూపింది. లంచం ఆరోపణల కేసులో అదానీ గ్రూప్ ప్రమోటర్లకు సమన్లు పంపేందుకు అమెరికాకు చెందిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (SEC) కోర్టు అనుమతి కోరినట్లు వార్తలు వచ్చాయి. దీంతో అదానీ గ్రూప్ షేర్లు (అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ వంటివి) 13 శాతం వరకు నష్టపోయాయి. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

## అదానీ స్టాక్స్‌లో భారీగా అమ్మకాలు



ముంబయి: ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ స్టాక్స్ (శుక్రవారం) భారీ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (SEC) గౌతమ్ అదానీ, సాగర్ అదానీలకు సమన్లు జారీ చేసేందుకు కోర్టు అనుమతి కోరిన నేపథ్యంలో కంపెనీ షేర్లు 13 శాతం మేర పతనం అయ్యాయి. గ్రూప్‌నకు చెందిన 10 కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.4 లక్షల కోట్లు క్షీణించింది. అదానీ గ్రూప్‌లోని ఫ్లాగ్‌షిప్ కంపెనీ అయిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 9.38 శాతం పతనమై రూ.1,891.60కు చేరుకుంది. అదానీ పవర్ 8.84 శాతం పతనమై రూ.128.35, అదానీ పోర్ట్స్ 7.81 శాతం క్షీణించి రూ.1,303.35; అదానీ టోటల్ గ్యాస్ 7.55 శాతం నష్టంతో రూ.507 వద్ద ముగిశాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ షేరు 13.20 శాతం కుంగి రూ.785కి చేరుకుంది. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ 10.57 శాతం క్షీణతతో రూ.827.20 వద్ద ముగిసింది.

## ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2,549.80 కోట్లు

అంతర్జాతీయ మార్కెట్లు లాభాల బాట పట్టడంతో, మన స్టాక్ మార్కెట్లు కూడా ఇదే దారిలో నడిచాయి. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు గురువారం విరామం పడింది. గ్రీన్‌లాండ్ స్వాధీనతకు సంబంధించి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజీ స్వరం వినిపించడంతో పాటు భారత్‌తో మంచి వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సూచనప్రాయంగా వెల్లడించడం మదుపర్లను మెప్పించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు లాభపడి 91.58 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.1% తగ్గి 64.52 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, షాంఘై, దక్షిణ కొరియా, హాంకాంగ్ లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలో ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.43 లక్షల కోట్లు పెరిగి, రూ.458.52 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,459.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,909.63 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 82,783.18 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సూచీ, తర్వాత 81,874.39 పాయింట్ల వద్ద కనిష్ఠ స్థాయినీ నమోదు చేసింది. చివరకు 397.74 పాయింట్ల లాభంతో 82,307.37 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 132.40 పాయింట్లు పెరిగి 25,289.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,435.75 – 25,168.50 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 24 లాభపడ్డాయి. బీఈఎల్ 3.75%, టాటా స్టీల్ 2.69%, అదానీ పోర్ట్స్ 2.57%, ఎస్‌బీఐ 1.95%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.73%, ఏషియన్ పెయింట్స్ 1.62%, పవర్‌గ్రిడ్ 1.51%, సన్ ఫార్మా 1.35%, హెచ్‌సీఎల్ టెక్ 1.22%, ఇండిగో 1.15%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.14%, ఎన్‌టీపీసీ 1.14%, ట్రెంట్ 1.01%, కోటక్ బ్యాంక్ 1% చొప్పున పెరిగాయి. ఎటర్నల్ 2.61%, టైటన్ 1.5% చొప్పున తగ్గాయి. రంగాల వారీ సూచీలకొస్తే పీఎస్‌యూ బ్యాంక్, భారీ యంత్ర పరికరాలు, పారిశ్రామిక, యుటిలిటీస్, సేవలు, విద్యుత్, లోహ, ఎఫ్ఎంసీజీ, కమోడిటీస్, ఆరోగ్య సంరక్షణ రంగాల షేర్లు రాణించాయి. మన్నికైన వినిమయ వస్తువులు, స్థిరాస్తి రంగాలు డీలా పడ్డాయి. బీఎస్ఈలో 2,934 షేర్లు సానుకూలంగా, 1,307 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి. 144 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.ఫలితాల నేపథ్యంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా షేరు బీఎస్ఈలో 5.62% లాభపడి రూ.166.40 వద్ద ముగిసింది. ఒక దశలో 7% పెరిగి రూ.168.40 వద్ద 52 వారాల గరిష్ఠ



స్థాయిని తాకింది. త్రైమాసిక ఫలితాలు మదుపర్లను మెప్పించకపోవడంతో, పీఎన్‌బీ హౌసింగ్ షేరు బీఎస్ఈలో 7.78% నష్టపోయి రూ.859వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 10% తగ్గి రూ.838.35 వద్ద లోయర్ సర్క్యూట్‌ను కూడా తాకింది. ఫిన్‌టెక్ దిగ్గజం రాజోర్‌పే ఆఫ్‌లైన్ చెల్లింపుల విభాగమైన రాజోర్‌పే పీఓఎస్, ఆఫ్‌లైన్ చెల్లింపుల అగ్రిగేటర్‌గా వ్యవహరించడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి లైసెన్స్ పొందినట్లు తెలిపింది.

## భారత ఎగుమతులపై ఈయూ ప్రభావం!

దిల్లీ: ప్రిఫరెన్షియల్ పథకం కింద భారత్, ఇండోనేషియా, కెన్యా దేశాల్లోని కొన్ని రంగాల ఉత్పత్తులకు కల్పించిన ఎగుమతి ప్రయోజనాలను ఐరోపా సమాఖ్య (ఈయూ) రద్దు చేసింది. ఈనెల 1 నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంటే మనదేశం నుంచి 27 దేశాల ఐరోపా సమాఖ్యకు వెళ్లే ఎగుమతులపై ప్రభావం పడనుంది. భారత్, ఈయూ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చలు ఈనెల 27న ముగియనున్న నేపథ్యంలో, ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. 2028 డిసెంబరు వరకు నిర్దిష్ట జీఎస్‌పీ (జనరలైజ్డ్ స్కీమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్) మన ఎగుమతిదార్లకు ప్రయోజనాలు అందవు. ఖనిజాలు, రసాయనాలు, ప్లాస్టిక్స్–రబ్బరు, జౌళి–దుస్తులు, రాళ్లు–సిరామిక్స్, విలువైన లోహాలు, ఇనుము–ఉక్కు, ప్రాథమిక లోహాలు, విద్యుత్ వస్తువులు, రవాణా సామగ్రి రంగాలపై జీఎస్‌పీ ప్రయోజనాలను ఈయూ రద్దు చేసింది. సంబంధిత ఎగుమతిదార్లపై ప్రతికూల ప్రభావం పడనుంది. మనదేశం నుంచి ఈయూ మార్కెట్‌కు వెళ్లే ఉత్పత్తుల్లో 87% విలువకు సమానమైన ఎగుమతులపై ప్రభావం



పడుతుందని మేధో సంస్థ జీటీఆర్ఐ అంటోంది. వ్యవసాయం, తోళ్లు వంటి 13% విలువైన ఎగుమతులపైనే ఈ పథకం కింద ప్రయోజనాలు కొనసాగనున్నాయని తెలిపింది. ఈ పథకం ఉంటే: జీఎస్‌పీ వల్ల భారత ఎగుమతిదార్లు ఈయూ మార్కెట్‌కు అత్యంత ప్రాధాన్య దేశాల (ఎమ్ఎఫ్ఎన్) కన్నా తక్కువ టారిఫ్‌తోనే ఎగుమతులు చేయొచ్చు. ఉదాహరణకు దుస్తులపై 12% టారిఫ్ ఉన్నా.. జీఎస్‌పీ కింద 9.6 శాతమే వర్తిస్తుంది. తాజా ఆదేశాల నేపథ్యంలో, ఈ నెల 1 నుంచి చేసిన ఎగుమతులపై 12% టారిఫ్ చెల్లించాల్సిందే. 2024–25లో భారత్, ఈయూ ద్వైపాక్షిక వాణిజ్యం 136.53 బిలియన్ డాలర్లు (సుమారు రూ.12.28 లక్షల కోట్లు)గా ఉంది. ఇందులో ఎగుమతులు 75.85 బి.డాలర్లు (సుమారు రూ.6.82 లక్షల కోట్లు) కాగా, దిగుమతులు 60.68 బి.డాలర్లు (సుమారు రూ.5.46 లక్షల కోట్లు). భారత మొత్తం ఎగుమతుల్లో ఈయూ వాటా 17 శాతంగా ఉంది.

## క్రీడలు

## స్మృతి మంధాన మాజీ ప్రియుడిపై చీటింగ్ కేసు



భారత మహిళా క్రికెట్ జట్టులో స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన మాజీ ప్రియుడి, సింగర్, సినిమా డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ పై చీటింగ్ కేసు నమోదయింది. మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లా పోలీసులకు విజ్ఞాన్ మానే అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు ప్రకారం.. విజ్ఞాన్ మానే ప్రముఖ క్రికెటర్ స్మృతి మంధానకు చిన్ననాటి స్నేహితుడు. వృత్తిరీత్యా సినిమా ఫైనాన్షియర్. పలాశ్ ముచ్చల్ సాంగ్లీకి వచ్చిన సమయంలో, స్మృతి మంధాన తండ్రి శ్రీనివాస్ మంధాన ద్వారా మానేకు ముచ్చల్ పరిచయం అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.'నజరియా' అనే సినిమా నిర్మాణానికి పెట్టుబడి పెట్టాలని పలాశ్ ముచ్చల్ తనను సంప్రదించాడని మానే ఆరోపించారు. ఈ సినిమా త్వరలో ఓటిటి ప్లాట్‌ఫామ్‌లో విడుదలై, పెట్టుబడిపై వేగంగా లాభాలు వస్తాయని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆ హామీలను నమ్మి తాను మొత్తం రూ.40 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు మానే పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని పలు విడతల్లో నగదు రూపంలో, అలాగే గూగుల్ పే ద్వారా చెల్లించినట్లు తెలిపారు.

## పీవీ సింధును అభినందించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు



భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఇండోనేసియా మాస్టర్స్ టోర్నమెంట్‌లో రెండో రౌండ్‌లో గెలిచి తన కెరీర్‌లో 500వ విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది.మహిళల సింగిల్స్‌లో 500 విజయాలు సాధించిన తొలి భారతీయ షట్లర్‌గా సింధు రికార్డు సాధించడం దేశానికి గర్వకారణంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘనతపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి పీవీ సింధుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తెలుగు బిడ్డ పీవీ సింధు 500వ విజయం సాధించడం నిజంగా గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. నీ కష్టం, కఠిన సాధన ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. ఆకాశమే నీకు హద్దు కాదని, భవిష్యత్తులో ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయన సోషల్ డియాలో ట్వీట్ చేశారు. పీవీ సింధు 500వ విజయం సాధించడం తెలంగాణకే కాదు, దేశానికే గర్వకారణమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. సింధు అంకిత భావం, నిరంతర కష్టపాటు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సృష్టించాలని ఆకాంక్షిస్తూ ఆయన ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు.

## అమ్మకానికి ఆర్సీబీ ఫ్రాంచైజీ




ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న ఫ్రాంచైజీ.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. గత ఐపీఎల్ సీజన్‌లో ఆర్సీబీ విజేతగా నిలిచింది. ఐపీఎల్ టైటిల్ గెలవడం బెంగళూరు కొన్నేళ్ల కల.అలాంటి కలను గతేడాది సాకారం చేసుకుంది ఆర్సీబీ. ఇది ఇలా ఉంటే.. త్వరలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతులు మారనుంది. ప్రస్తుత ఆర్సీబీ యజమాని డియాజియో కంపెనీ ఇప్పటికే ఫ్రాంచైజీ విక్రయ ప్రక్రియను ప్రారంభించింది.2026 మార్చి 31 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడానికి భారత్‌తో పాటు కొన్ని విదేశీ సంస్థలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కూడా చేరింది. ఆ సంస్థ సీఈవో అదర్ పూనావాలా కూడా ఆర్సీబీ జట్టును దక్కించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.గురువారం అదర్ పూనావాలా ఎక్స్ వేదికగా ఓ కీలక పోస్ట్ చేశారు. ఐపీఎల్‌లోని అత్యుత్తమ జట్లలో ఒకన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ కొనుగోలు చేయడం కోసం త్వరలో తాను బిడ్‌ను వేస్తానని, అది కూడా పోటీ తత్వంతో, బలంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 2008లో ఐపీఎల్ ఆరంభ సమయంలో యూబీ గ్రూపు అధినేత విజయ్ మాల్యా ఆర్సీబీ ఫ్రాంచైజీని దక్కించుకున్నాడు. అనంతరం మాల్యా అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో భారత్‌లోని తన అనుబంధ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ ద్వారా బెంగళూరు ఫ్రాంచైజీని డియాజియో కొనుగోలు చేసింది. తాజాగా ఆ సంస్థ కూడా ఆర్సీబీ ఫ్రాంచైజీని విక్రయించేందుకు సిద్ధమైంది. మరోవైపు కొన్ని నివేదికల ప్రకారం ఆర్సీబీ విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లుగా ఉంది. మొత్తానికి మరో రెండు నెలల్లో ఆర్సీబీకి కొత్త ఓనర్ రావడం మాత్రం పక్కా అని తెలుస్తుంది.

## భారత్‌పై మొండి వైఖరితో భగ్గుమంటున్న క్రికెట్ ఫ్యాన్స్

బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీసుకున్న ఇటీవలి నిర్ణయాలు భారత క్రికెట్ అభిమానులలో తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తున్నాయి. భారత్‌లో జరగబోయే టీ20 ప్రపంచ కప్‌లో ఆడేందుకు నిరాకరిస్తున్నారనే వార్తలు సోషల్ డియాలో సెన్సేషన్‌గా మారాయి.గతం మరిచి ప్రవర్తిస్తున్న బంగ్లా తీరుపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. భారత్ పట్ల బంగ్లాదేశ్ చూపిస్తున్న ఈ మొండి వైఖరి కన్నతల్లి లాంటి దేశానికే వెన్నుపోటు




పొడిచినట్లు ఉందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. నిజానికి బంగ్లాదేశ్ క్రికెట్ చరిత్రను పరిశీలిస్తే, ఆ జట్టుకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడానికి బీసీసీఐ చేసిన కృషి ఎనలేనిది. 1988లో అప్పటి ఐసీసీ ఛైర్మన్ జగ్మోహన్ దాల్మియా చొరవ తీసుకుని బంగ్లాదేశ్‌కు ఐసీసీలో సభ్యత్వం ఇప్పించారు. ఆ తర్వాత కూడా టీమ్ ఇండియా అండగా నిలబడబట్టే ఆ దేశానికి టెస్ట్ హోదా లభించింది. ఆర్థికంగా, సాంకేతికంగా బంగ్లా క్రికెట్ ఎదగడానికి భారత బోర్డు ఎన్నోసార్లు చేయూతనందించింది.అంతేకాకుండా, బంగ్లాదేశ్ అనే ఒక స్వతంత్ర దేశం ఏర్పడటంలో భారత్ పాత్ర అత్యంత కీలకం. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత సైన్యం ప్రాణాలకు తెగించి పోరాడి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించింది. అస్తిత్వం లేని దశ నుండి ఒక దేశంగా ఎదిగేందుకు భారత్ అప్పట్లో అన్ని విధాలా తోడ్పడింది. అలాంటి మాతృ సమానమైన దేశంపై ఇప్పుడు క్రీడల విషయంలో వివక్ష చూపడం ఆ దేశ కృతజ్ఞతా రాహిత్యానికి నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. క్రీడలు దేశాల మధ్య బంధాలను బలపరచాలి కానీ, ఇలాంటి వివాదాలు దూరాన్ని పెంచుతాయి. భారత్ ఎప్పుడూ పొరుగు దేశాలకు స్నేహ హస్తం అందిస్తూనే ఉంది, ముఖ్యంగా బంగ్లాదేశ్ క్రికెట్ అభివృద్ధిలో అగ్రభాగం వహించింది.

## ఆ అంశంపై స్పందించేందుకు బీసీసీఐ ప్రెసిడెంట్ నిరాకరణ



భద్రత కారణాలను సాకుగా చూపుతూ తమ జట్టును టీ20 వరల్డ్ కప్ 2026 లో పాల్గొనేందుకు భారత్‌కు పంపబోమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఇండియాలో షెడ్యూలైన తమ మ్యాచుల్ని శ్రీలంకకు తరలించాలన్న బంగ్లా అభ్యర్థనను ఐసీసీ తిరస్కరించిన వేళ బీసీబీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ అంశంపై స్పందించేందుకు బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ నిరాకరించారు. రాయ్‌పుర్‌లోని స్వామి వివేకానంద విమానాశ్రయంలో గురువారం ఆయన్ను విలేకరులు చుట్టుముట్టి బంగ్లా నిర్ణయంపై స్పందించాలని కోరారు. అయితే బంగ్లా విషయంపై మాట్లాడటానికి మన్హాస్ నిరాకరించారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఆయన ఆసక్తి చూపలేదు. సున్నితంగా తిరస్కరిస్తూ.. విమానాశ్రయం బయట తన కోసం సిద్ధంగా ఉన్న కారులో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బంగ్లాదేశ్ ప్రపంచకప్‌నకు దాదాపు దూరమైనట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ర్యాంకింగ్స్ ఆధారంగా బంగ్లా టీమ్ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం లభించనుంది. అయితే ఈ విషయమై ఐసీసీ ఇంకా అధికారికంగా స్పందించలేదు. మరికొన్ని రోజుల్లోనే టీ20 వరల్డ్‌కప్ పోటీలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఐసీసీ ఈ విషయమై త్వరలోనే అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశముంది.

## ఒలింపిక్ ఛాంపియన్లను తయారు చేస్తా



ఒలింపిక్‌ఛాంపియన్లను తయారు చేయడమే లక్ష్యంగా గోల్ఫ్‌పై దృష్టిసారించానని టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ పేర్కొన్నాడు. 18 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు నెగ్గిన ఈ ఆటగాడు.. భారత గోల్ఫ్ ప్రిమియర్ లీగ్ (ఐజీపీఎల్) సహా పలు గోల్ఫ్ సంఘాలతో భాగస్వామి అయ్యాడు. వాటితో కలిసి దిల్లీలోని గోల్ఫ్ క్లబ్‌లో గురువారం 'గోల్ఫ్ గ్రోత్ ఇనిషియేటివ్' అనే కార్యక్రమం ప్రారంభించాడు. ఇందులో మాజీ గోల్ఫ్ ఆటగాళ్లు మిల్కా సింగ్‌తో సహా పలువురు భాగస్వాములు కానున్నారు. ఏడు ఒలింపిక్స్‌లో పాల్గొన్న పేస్.. రాబోయే పదేళ్లలో దేశ వ్యాప్తంగా వివిధ క్రీడల్లో పది అకాడలు ఏర్పాటు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపాడు. ''ఇద్దరు ఒలింపియన్ల కుటుంబానికి చెందిన వ్యక్తిగా.. ఒలింపిక్ ఛాంపియన్లను ఎలా తయారు చేయాలో నాకు తెలుసు. భువనేశ్వర్‌లో ఫ్లెయింగ్‌మ్యాన్ అకాడని ప్రారంభించి, లక్ష మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నాను. గోల్ఫ్‌ను పల్లెటూర్లకు పరిచయం చేయాలని చూస్తున్నా. ఎందుకంటే అక్కడి నుంచే విజేతలు పుట్టుకొస్తారు'' అని పేస్ అన్నాడు. దీనికి మద్దతుగా మొదట.. ఒడిశా, గురుగ్రామ్, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రపంచస్థాయి సదుపాయాలు ఏర్పాటు చేస్తామని ఐజీపీఎల్ ఓ ప్రకటనలో పేర్కొంది.

# వుదయం సినిమా



## ఫిబ్రవరి 6న విడుదల కానున్న

# 'శ్రీ చిదంబరం గారు'

శ్రీమతి. చింతా వరలక్ష్మీ సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజ శేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం'. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత వంశీ నందిపాటి థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన ఈ చిత్రం నుంచి ఇటీవల టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌కు వచ్చిన అనూహ్య స్పందన గురించి తెలిసిందే. కాగా ఈ చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి గారు ఆలపించిన 'వెళ్లేదారిలో' అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. చందు, రవి సంగీతం అందించిన ఈ పాటకు చంద్రశేఖర్ సాహిత్యాన్ని సమాకూర్చారు. ఈ పాట ట్యూన్‌తో పాటు లిరిక్స్ అందరి హృదయాలను హత్తుకుంటున్నాయి. ముఖ్యంగా కీరవాణి గారి గాత్రం ఈ పాటకు ప్రాణం పోసింది. కాగా ఈ పాట సక్సెస్ సెలబ్రేషన్స్‌తో పాటు చిత్ర విడుదల తేది ప్రకటన ప్రెస్‌మీట్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా చిత్రాన్ని ఫిబ్రవరి 6న ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా ఈ వేడుకకు ముఖ్య అథిగా విచ్చేసిన ఆర్‌పీ పట్నాయక్ మాట్లాడుతూ '' యంగ్ టీమ్ చేసిన బ్యూటిఫుల్ సినిమా ఇది. చాలా మంది యువత చిన్న చిన్న ప్రాబ్లమ్స్‌కే సూసైడ్ వరకు వెళ్లిపోతున్నారు. అలాంటి వారందరికి ఎంతో ఇన్స్పయిర్ అయ్యే కథ ఇది. మీలో లోపం మీకు బలం అవ్వాలి అనే చెప్పే కథ ఇది. ఈ సినిమాలో వంశీ కళ్లతో యాక్ట్ చేశాడు. టీమ్ అందరికి గుడ్ లక్' అన్నారు. సంగీత దర్శకుడు చందు రవి మాట్లాడుతూ 'శ్రీ చిదంబరం గారు' టీమ్‌ను, దర్శకుడిని ఇంట్రడ్యూస్ చేసిన వంశీ నందిపాటి గారికి థ్యాంక్స్. నిర్మాత గోపాలకృష్ణ మాట్లాడుతూ కొత్తవాళ్లను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో నేను చేసిన ఐదో సినిమా ఇది. ప్రొడక్షన్ వాల్యూస్ గురించి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మించాను. హీరోయిన్ సంధ్యా వశిష్ఠ మాట్లాడుతూ '' సినిమాలో లీల అనే పాత్రను చేస్తున్నాను. టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. హీరో వంశీ తుమ్మల మాట్లాడుతూ '' సంగీతంతో మా సినిమా వందరెట్లు పైన వుంది. ఆస్కార్ పాటను ట్యూన్ చేసిన కీరవాణి గారు పాటను పాటడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ సినిమాలో నేను మెల్లకన్ను పెట్టి నటించడానికి ఆర్‌పీ పట్నాయక్ గారి నటనే ఇన్‌స్పిరేషన్.

# #గోపీచంద్ 33

## క్లైమాక్స్ షూటింగ్ ప్రారంభం



మ్యాచో స్టార్ టి గోపీచంద్, విజనరీ దర్శకుడు సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్న హిస్టారికల్ మూవీ #గోపీచంద్33 తో రాబోతున్నారు. పవన్ కుమార్ ప్రజెంట్స్ చేస్తున్న ఈ చిత్రం గోపీచంద్ కెరీర్‌లోనే అత్యంత భారీ చిత్రాలలో ఒకటిగా రూపొందుతోంది.
ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాస్టర్ పర్యవేక్షణలో చిత్ర బృందం భారీ, హై ఇంటెన్సిటీ క్లైమాక్స్ సీక్వెన్స్ ని షూటింగ్‌ను ప్రారంభించింది. రాత్రిపూట చిత్రీకరించే క్లైమాక్స్ కోసం ప్రత్యేకంగా ఒక భారీ సెట్‌ను నిర్మించారు. దీనిని 25 రోజుల లెన్త్ షెడ్యూల్‌లో పూర్తి చేయబోతున్నారు.
భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ క్లైమాక్స్ టాలీవుడ్‌లో ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, స్కేల్, ఎగ్జిక్యూషన్ పరంగా ఫస్ట్-ఆఫ్-ఇట్స్-కైండ్‌గా ఉండబోతుంది. ప్రేక్షకులకు మరచిపోలేని అనుభూతిని అందించనుంది.
ఇప్పటికే విడుదలైన గోపీచంద్ బర్త్‌డే స్పెషల్ పోస్టర్, గ్లింప్స్‌లో, పొడవైన జుట్టు, రగ్డ్ గడ్డం, వారియర్ గెటప్‌లో కనిపించడం భారీ అంచనాలను పెంచింది
ఇన్నోవేటివ్ కథనాలు, టెక్నికల్ ఫినెస్‌కు పేరుగాంచిన సంకల్ప్ రెడ్డి, భారత చరిత్రలో వెలుగులోకి రాని ఒక శక్తివంతమైన అధ్యాయాన్ని తెరపై ఆవిష్కరించబోతున్నారు. సినిమా విజువల్ వండర్ గా ఉండబోతోంది. గోపీచంద్ ఇప్పటివరకు చేయని పాత్రలో కనిపించబోతున్నారు.



## 'పెద్ది' స్పెషల్ సాంగ్‌లో

# క్రేజీ బ్యూటీ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన లైనప్‌లో ఉన్న చిత్రాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా 'ఉప్పెన' డైరెక్టర్ బుచ్చిబాబు సనాతో ఆయన చేస్తున్న 'పెద్ది' చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఒక ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో చరణ్ మునుపెన్నడూ చూడని ఊర మాస్ లుక్‌లో కనిపించనున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ వంటి దిగ్గజాలు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈక్రమంలో.. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన వార్త నెట్టింట సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రంలోని స్పెషల్ మాస్ సాంగ్‌లో టాలీవుడ్ క్రేజీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ మెరవబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# బాబా బ్లాక్ షీప్ టీజర్ విడుదల




ఒక రోజు జరిగిన అనుకోని ఓ ఘటనతో 6 వ్యక్తుల జీవితాల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయనే వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. టినును ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ , విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళవి, కశ్యప్, రాజారవీంద్ర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను ప్రముఖ స్టార్ హీరో శర్వానంద్ విడుదల చేసి చిత్ర యూనిట్‌ను అభినందించారు.
టీజర్‌ను గమనిస్తే.. చుట్టూ పచ్చదనం, కొండలున్న అందమైన ఊరిని చూపిస్తారు. 'చెప్పుకోడానికి ఇది మామూలు కథ కాదు. అండ పిండ బ్రహ్మాండాలను కూడా అల్లాడించే కథ' అనే డైలాగ్ వినిపిస్తే , దానికి తగ్గట్లుగా 'ఏం చెప్పాలనుకుంటున్నారో కాస్త క్లారిటీగా చెప్పవా' అనే మరో డైలాగ్ వినిపిస్తుంది. ఈ గ్యాప్‌లో కొన్ని సీన్స్ కొంత మంది గన్స్‌తో కనిపిస్తారు. సినిమా ప్రధాన పాత్రధారుల్లో ఒకరైన అక్షయ్ ఈవెంట్ లో చెఫ్ లుక్‌లో కనిపిస్తాడు. అప్పుడే మనకు మరో మెయిన్ క్యారెక్టర్ విష్ణు ఎంట్రీ కనిపిస్తుంది. విష్ణు దగ్గరకెళ్లి ఈవెనింగ్ మంచి సర్‌ప్రైజ్ ప్లాన్ చేశా మామ అని అంటాడు.
గన్ ఫైరింగ్, కార్ చేజింగ్ వంటి ఎంగేజింగ్ సీన్స్ ను చూపిస్తారు. విష్ణు మాట్లాడుతూ 'పోలీసులు మన వెంట ఎందుకొస్తున్నారా?..వాళ్లని కూడా ఇన్వైట్ చేశావా?' అని టెన్షన్ పడుతుంటాడు. ఈ క్రమంలోనే జాన్ షెల్లీ హిట్లర్ అనే డాన్ పాత్రలో ఉపేంద్ర లిమాయే ఎంట్రీ ఉంటుంది. తను పెళ్లిలోకి వచ్చి అక్షయ్, విష్ణులను కొట్టి 'మీరు దొబ్బేసిన బాక్స్ అండ్ గన్ ఎక్కడ.. నా దగ్గర కొట్టేసిన బాక్స్ ఎవరికి అమ్మేశారు?' అని అడుగుతాడు. అక్కడ నుంచి టినూ ఆనంద్, జార్జ్ మరియన్, రాజా రవీంద్ర, విస్మయ శ్రీ తదితరులకు సంబంధించిన పాత్రలను పరిచయం చేశారు.

## ఫాంటసీ కామెడీ డ్రామా 'రాకాస' గ్లింప్స్ వచ్చేసింది!



యువ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో మానస శర్మ దర్శకత్వంలో రూపొందుతున్న ఫాంటసీ కామెడీ డ్రామా 'రాకాస'. నయన్ సారిక హీరోయిన్. వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, తనికెళ్ల భరణి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నిహారిక కొణిదెల నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీకి సంబంధించి శుక్రవారం గ్లింప్స్ విడుదలైంది. ఇందులో సంగీత్ శోభన్ వీరుడంటూ బయలుదేరి వలలో చిక్కుకుపోయి కనిపించారు. ఏప్రిల్ 03న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఫిబ్రవరి 14న లవ్ స్టోరీ రీ రిలీజ్



యువ సామ్రాట్ నాగ చైతన్య కెరీర్‌లో మరపురాని మైల్ స్టోన్ మూవీ 'లవ్ స్టోరీ . ఈ చిత్రంలో నాగ చైతన్య తెలంగాణ గ్రామానికి చెందిన ఫోక్ డాన్సర్‌గా పూర్తిగా కొత్త పాత్రలో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల చైని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఈ చిత్రంలో చై తన నటనలోని భావోద్వేగాల అందరినీ హత్తుకున్నాయి. ఆయన నటనకు విమర్శకులు, ప్రేక్షకులు, అభిమానులు ప్రశంసల వర్షం కురిపించారు. హీరోయిన్ గా సాయి పల్లవి అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. చైతన్య–సాయి పల్లవి మధ్య కెమిస్ట్రీ, కుల–వర్గ భేదాలను దాటిన ప్రేమ కథను మరింత హృదయాన్ని తాకేలా చేసింది. గ్రామీణ తెలంగాణ జీవనశైలిని నిజాయితీగా, సున్నితంగా తెరపై ఆవిష్కరించారు దర్శకుడు శేఖర్ కమ్ముల. సంగీత దర్శకుడు పవన్ అందించిన అందించిన నీ చిత్రమ్ చూసి, సారంగ దరియా సినిమా విడుదలకు ముందే చార్ట్‌బస్టర్స్‌గా మారాయి. ఇప్పటికీ అన్ని ప్రముఖ మ్యూజిక్ ప్లాట్‌ఫార్మ్‌లలో ట్రెండ్ అవుతున్నాయి. ఇప్పుడు, మేకర్స్ ఈ ఆల్ టైమ్ క్లాసిక్ రొమాంటిక్ సాగా ఫిబ్రవరి 14న - ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రీరిలీజ్ చేస్తున్నారు. కోవిడ్ కాలంలో, 2021లో విడుదలైన ఈ చిత్రం సవాళ్లను దాటుకొని బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. బ్యానర్లపై నిర్మాతలు నారాయణ్ దాస్ కె నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని ఒక ప్రేమకావ్యంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు వాలెంటైన్స్ డే రోజున లవ్ స్టోరీ మళ్లీ థియేటర్లలో సందడి చేయనుంది. చైతన్య–సాయి పల్లవి అభిమానులు సినీ ప్రేమికులు ఈ ఆల్-టైమ్ క్లాసిక్ ని మరోసారి బిగ్ స్క్రీన్ పై ఆస్వాదించేందుకు గెట్ రెడీ.

## ఓం శాంతి శాంతి శాంతి

# ట్రైలర్ లాంచ్

ట్యాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ తన అద్భుతమైన నటనతో కూడా అలరిస్తున్నారు. ఆయన లీడ్ రోల్ లో నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఎఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం, సహజమైన హాస్యం, ఆకట్టుకునే డ్రామాతో కూడిన వినోదభరితమైన విలేజ్ కామెడీ.
ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ , నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది. సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు హీరో విజయ్ దేవరకొండ ఈ సినిమా ట్రైలర్ ని లాంచ్ చేశారు. పెళ్లి చూపుల్లో ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్) ని ఈశా రెబ్బా 'మీరు లాస్ట్ చూసిన సినిమా ఏది? అంటూ అడిగే ప్రశ్నతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం అలరించింది. ఓంకార్ నాయుడు పాత్రలో తరుణ్ భాస్కర్ అదరగొట్టేశారు. 'కలకత్తాలలో చేపలని జలపుష్పాలు అంటారు. మీ పుష్పాలు నా చెవిలో పెట్టకండి' అంటూ గోదారి యాసలో తరుణ్ పలికిన డైలాగులు, తన బాడీ లాంగ్వేజ్ చాలా కొత్తగా వున్నాయి. తరుణ్ భాస్కర్ - ఈశా రెబ్బా మధ్య కెమిస్ట్రీ ట్రైలర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి మధ్య వచ్చే కాన్ఫ్లిక్ట్, ముఖ్యంగా ట్రైలర్ చివర్లో తరుణ్ భాస్కర్ రియాక్షన్ క్యురియాసిటీని పెంచుతోంది. కీలక పాత్రలో బ్రహ్మాజీ తనదైన స్టైల్‌లో ఆకట్టుకున్నారు. దర్శకుడు ఏ.ఆర్. సజీవ్ ఫన్‌తో పాటు ఎమోషన్‌ను అద్భుతంగా బ్యాలెన్స్ చేస్తూ కథను ఆసక్తికరంగా ప్రజెంట్ చేశారు. జై క్రిష్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ప్రతి సీన్‌కు లైవ్లీ ఫీల్‌ను తీసుకొచ్చింది. దీపక్ కెమెరా వర్క్ కలర్‌ఫుల్‌గా ఉండటమే కాకుండా, గోదావరి బ్యాక్‌డ్రాప్ ని న్ని మరింతగా ఎలివేట్ చేసింది. నిర్మాణ విలువలు రిచ్‌గా కనిపిస్తున్నాయి. కామెడీ, ఫన్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్‌తో పాటు అద్భుతమైన పెర్ఫార్మెన్స్‌లతో ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.





# అతడితో రిలేషన్‌షిప్‌లో ఉందా?

సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో 'సీత'గా చెరగని ముద్ర వేసుకున్న మృణాల్ ఠాకూర్, ఇటీవల తన వ్యక్తిగత జీవితం, కొత్త ప్రాజెక్టులతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ తో ఆమె ప్రేమలో ఉందని, వీరిద్దరూ ఫిబ్రవరి 14న పెళ్లి చేసుకోబోతున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలపై మృణాల్ టీమ్ స్పందిస్తూ.. అవన్నీ కేవలం పుకార్లేనని, ప్రస్తుతం ఆమె పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. ధనుష్ సైతం తన పెళ్లి గురించి వస్తున్న వార్తలను ఖండించారు.
ఈ పుకార్ల మధ్య మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో హీరో సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి దిగిన కొన్ని రొమాంటిక్ ఫోటోలను షేర్ చేయడంతో నెటిజన్లు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. వీరిద్దరు రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? అని పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఇది నిజమైన రిలేషన్ కాదని, వారిద్దరూ కలిసి నటిస్తున్న బాలీవుడ్ మూవీ 'దో దివానే సెహెర్ మే' ప్రమోషన్స్‌లో భాగంగానే ఆ ఫోటోలను షేర్ చేసినట్లు తెలుస్తోంది. రవి ఉద్యవార్ దర్శకత్వంలో, సంజయ్ లీలా భన్సాలీ, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Maria, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.